www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మా నీళ్లు మీకివ్వడమేంటి?

మీరు వరి వేసుకుంటే.. మేం అపరాలు వేయాలా?.. తెలంగాణ వాదనలపై ఏపీ తీవ్ర అభ్యంతరం

మాకు కేటాయించిన 512 టీఎంసీల్లో మేం 130 టీఎంసీలు వాడుకుంటే చాలా..?

మిగతా 382 టీఎంసీలూ మీకిచ్చేయాలా?.. కృష్ణా జలాలపై తెలంగాణవన్నీ పిచ్చిలెక్కలు

పంటల మార్పిడి పాటించాలని మాకు సలహా ఇవ్వడమేంటి?.. పొరుగు రాష్ట్రం వాదనలో పసలేదు

ఏపీ తరపు సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా స్పష్టీకరణ

బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ విచారణ వచ్చే నెల 23, 24, 25కు వాయిదా

10

శనివారం | 24-1-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 318 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: షష్ఠి రా.12:40 తదుపరి సప్తమి, నక్షత్రం: ఉత్తరాభాద్ర మ.2:16 రేవతి, వర్జ్యం: రా.1:56-3:29, దుర్ముహూర్తం: ఉ.6:52-8:21, అమృతఘడియలు: ఉ.9:31-11:06, రాహుకాలం: ఉ.9:00-10:30, సూర్యోదయం: 6:52, సూర్యాస్తమయం: 6:02 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బిజినెస్

గుంటూరు ● శనివారం 24 జనవరి 2026

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,59,710 ▲	1,46,400 ▲	3,60,000 ▲
విజయవాడ	1,59,400 ▲	1,49,000 ▲	3,25,500 ▲
విశాఖపట్నం	1,59,682 ▲	1,44,050 ▲	3,60,000 ▲
రాజమండ్రి	1,59,710 ▲	1,46,400 ▲	3,26,000 ▲
ప్రొద్దుటూరు	1,60,000 ▲	1,47,200 ▲	3,26,000 ▲
ముంబై	1,54,310 ▲	1,41,348 ▲	3,17,705 ▲

గ్రాన్యూల్స్ ఇండియా లాభంలో 28% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గ్రాన్యూల్స్ ఇండియా డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.1,387.90 కోట్ల ఆదాయంపై రూ.150.2 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం 28 శాతం (రూ.117.60 కోట్లు) వృద్ధి చెందగా ఆదాయం 22 శాతం (రూ.1,297 కోట్లు) పెరిగింది. త్రైమాసిక కాలంలో అమెరికా, యూరప్ మార్కెట్లలో ఫినిష్డ్ డోసేజీల విభాగం పనితీరు మెరుగ్గా ఉండటం కలిసివచ్చిందని గ్రాన్యూల్స్ పేర్కొంది.

3 లక్షల యమహా స్కూటర్ల రీకాల్

న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఇండియా యమహా మోటార్ తన పాపులర్ 125సీసీ హైబ్రిడ్ స్కూటర్లలో సాంకేతిక లోపాన్ని సవరించేందుకు గాను స్వచ్ఛంద రీకాల్‌ను ప్రకటించింది. 2024 మే 2 నుంచి 2025 సెప్టెంబరు 3 మధ్య కాలంలో తయారైన రేజెడ్ఆర్ 125 ఎఫ్ఐ హైబ్రిడ్, ఫాసినో 125 ఎఫ్ఐ హైబ్రిడ్ మోడళ్లలో ఫ్రంట్ బ్రేక్ వ్యవస్థలో లోపాన్ని గుర్తించినట్లు కంపెనీ తెలిపింది. ఈ కారణంగా మొత్తం 3,06,635 యూనిట్లను రీకాల్ చేస్తున్నట్లు వెల్లడించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)			
24వ తేదీ		విజయవాడ	505
హైదరాబాద్	475	గోదావరి	475
వరంగల్	477	విశాఖపట్నం	475
చిత్తూరు	523	డజను గుడ్లు రూ. 75	



ఫామ్‌గేట్ ధర	వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్		
హైదరాబాద్	140	విజయవాడ	150
వరంగల్	140	గుంటూరు	157
కరీంనగర్	140	ఒంగోలు	157
మహబూబ్‌నగర్	140	చిత్తూరు	146
కర్నూలు	140	నెల్లూరు	151
విశాఖపట్నం	140	అనంతపురం	151
గోదావరి	150		



'ఏజెంటిక్ ఏఐ'లో కొలువులే కొలువులు

28 శాతం వరకు అధిక జీతాలు

- ఏటా 35 నుంచి 40 శాతం వృద్ధి
- 50 శాతానికిపైగా నిపుణుల కొరత
- నియామకాల్లో జీసీసీలదే 54 శాతం వాటా
- బెంగళూరు, హైదరాబాద్‌లదే హవా ● క్వెస్ కార్ప్



ముంబై: ఐటీ, టెక్ కంపెనీల నియామకాల్లో నైపుణ్యాల వడపోత ప్రక్రియ మారిపోతోంది. కృత్రిమ మేధ (ఏఐ)పై పట్టు ఉంటేనే జాబ్ అంటున్నాయి. మళ్లీ ఏఐలోనూ ఏజెంటిక్ ఏఐ నైపుణ్యాలకు మరింత పెద్దపీట వేస్తున్నాయి. మిగతా వారితో పోలిస్తే ఏజెంటిక్ ఏఐపై పట్టున్న అభ్యర్థులకు 20 నుంచి 28 శాతం వరకు అధిక జీతాలు ఇచ్చి మరీ ఉద్యోగాలు ఇస్తున్నాయి. ఏటా వీరి డిమాండ్ 35 నుంచి 40 శాతం చొప్పున పెరుగుతోంది. అయితే పెరుగుతున్న ఈ డిమాండ్‌కు అనుగుణంగా ఏజెంటిక్ ఏఐ నిపుణులు దొరకడం లేదు. దీంతో ప్రస్తుతం ఈ రంగంలో యాభై శాతానికిపైగా నిపుణుల కొరత ఉందని క్వెస్ కార్ప్ అనే సంస్థ ఒక నివేదికలో తెలిపింది.

జీసీసీలదే జోరు

ఏజెంటిక్ ఏఐ నిపుణుల నియామకాల్లో దేశంలోని గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాలు (జీసీసీ) ముందున్నాయి. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న ఏజెంటిక్ ఏఐ నిపుణుల నియామకాల్లో 54 శాతం వరకు ఈ కంపెనీల్లోనే జరుగుతున్నట్టు క్వెస్ కార్ప్ నివేదిక తెలిపింది. టెక్, సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్ (సాస్) కంపెనీలూ వీరి నియామకాల్లో ముందున్నాయి. ఏజెంటిక్ ఏఐ నిపుణుల నియామకాల్లో దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే బెంగళూరు, హైదరాబాద్ ముందున్నాయి. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న వీరి నియామకాల్లో ఈ రెండు నగరాల వాటా 62 శాతం వరకు ఉంది. వివిధ జాబ్ పోర్టల్స్‌లో వచ్చిన 28,000కు పైగా పోస్టింగ్స్‌ను పరిశీలించి క్వెస్ కార్ప్ సంస్థ ఈ నివేదిక రూపొందించింది.

'ఏజెంటిక్ ఏఐ' అంటే?

ఇచ్చిన పనులన్నీ ఒక ఏజెంట్‌లా సొంతంగా నిర్ణయాలు తీసుకుని పూర్తి చేసే టెక్నాలజీనే ఏజెంటిక్ ఏఐ అంటారు. స్పష్టంగా చెప్పాలంటే ప్రస్తుతం మొబైల్స్‌లో ఫొటోలు, వీడియోలు, టెక్స్ట్ వంటి చిన్న చిన్న పనుల కోసం అనేక ఏఐ టూల్స్ వాడుతున్నాం. ఈ టూల్స్ ప్రాంప్ట్ ఆధారంగానే ఆ పనులు పూర్తి చేస్తాయి. ఏజెంటిక్ ఏఐ.. ఆ ఏఐ టూల్స్‌కు అప్‌గ్రేడ్ వెర్షన్ లాంటిది. దీనికి ప్రాంప్ట్‌కు బదులు పనులు మాత్రమే పురమాయించాలి. ఆ పనులు పూర్తి చేసేందుకు ఎలాంటి ప్రాంప్ట్ కావాలో అదే నిర్ణయించుకుని, ఆ పని పూర్తి చేస్తుంది. ఇప్పటికే కొన్ని కీలక రంగాల్లో ఈ ఏజెంటిక్ ఏఐని వినియోగిస్తున్నారు.

రూపాయి @ 92

- ఇంట్రాడేలో ఆల్‌టైమ్ కనిష్ఠానికి
- చివరకు 32 పైసల నష్టంతో రూ.91.90 వద్ద ముగింపు
- ఈ నెలలోనే రూ.2 వరకు క్షీణించిన దేశీయ కరెన్సీ

ముంబై: ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు ఆపసోపాలు పడుతోంది. శుక్రవారం ఇంట్రాడేలో ఒక దశలో రూ.92 స్థాయికి పడిపోయి మరో ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయిని తాకింది. తర్వాత కొద్దిగా కోలుకుని 32 పైసల నష్టంతో జీవితకాల కనిష్ఠ స్థాయి రూ.91.90 వద్ద ముగిసింది. దీంతో ఈ నెలలో ఇప్పటి వరకు డాలర్‌తో రూపాయి మారకం రేటు రూ.2 క్షీణించినట్టయింది. దేశీయ స్టాక్ మార్కెట్‌పై కొనసాగుతున్న 'బేర్' పట్టు, ఎడతెగని ఎఫ్‌పీఐల అమ్మకాలు ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. పెరుగుతున్న ముడి చమురు ధర, అమెరికా ప్రభుత్వ రుణ పత్రాలపై పెరుగుతున్న వడ్డీ రేటు ఇందుకు మరింత ఎసరు పెడుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే రూపాయి మారకం రేటు వచ్చే కొద్ది రోజుల్లో రూ.92.30ని తాకే అవకాశం ఉందనే అంచనాలు వినిపిస్తున్నాయి.

లారస్ ల్యాబ్స్ లాభం రూ.252 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లారస్ ల్యాబ్స్ లిమిటెడ్.. డిసెంబరుతో ముగిసిన తృతీయ త్రైమాసికంలో అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ నికర లాభం ఏకంగా 174 శాతం వృద్ధితో రూ.92 కోట్ల నుంచి రూ.252 కోట్లకు చేరుకుంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ కూడా 26 శాతం పెరుగుదలతో రూ.1,415 కోట్ల నుంచి రూ.1,778 కోట్లకు పెరిగింది. త్రైమాసిక కాలంలో కీలకమైన సీడీఎంఓ ప్రాజెక్టులను వ్యూహాత్మకంగా నిర్వహించటంతో పాటు కొత్త ఔషధాల విడుదల, యాంటీరెట్రోవైరల్ విభాగంలో అగ్రస్థానాన్ని కొనసాగించటంతో ప్రోత్సాహకర ఫలితాలను నమోదు చేయగలిగినట్లు లారస్ ల్యాబ్స్ ఫౌండర్, సీఈఓ సత్యనారాయణ చావా అన్నారు.

మార్కెట్లలో అమ్మకాల హోరు

- సెన్సెక్స్ 770 పాయింట్లు డౌన్
- మళ్లీ 82,000 దిగువకు సూచీ
- మదుపరులకు రూ.6.95 లక్షల కోట్ల నష్టం

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లలో మరోసారి అమ్మకాలు వెల్లువెత్తాయి. డాలర్ మారకంలో రూపాయి ఆల్‌టైమ్ కనిష్ఠానికి పతనమవటం, మదుపరులు పెద్దఎత్తున అమ్మకాలకు దిగటంతో పాటు విదేశీ నిధులు తరలిపోవటంతో శుక్రవారం బెంచ్‌మార్క్ సూచీలు 1 శాతం మేర పతనమయ్యాయి. ఇంట్రాడేలో బీఎస్ఈ సెన్సెక్స్ 835.55 పాయింట్లు పతనమై 81,471.82 పాయింట్లను తాకి చివరకు 769.67 పాయింట్ల (0.94%) నష్టంతో 81,537.70 పాయింట్ల వద్ద క్లోజైంది. బీఎస్ఈలో మొత్తం 2,989 స్టాక్స్ నష్టపోగా 1,220 స్టాక్స్ లాభాల్లో ముగియగా 143 స్టాక్స్ యథాతథంగా ఉన్నాయి. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ 241.25 పాయింట్లు (0.95%)నష్టంతో 25,048.65 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా, దేశీయంగా సానుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ రూపాయి పతనం, ఎఫ్ఐఐల అమ్మకాలు, వాల్యుయేషన్స్ అధికంగా ఉండటంతో మదుపరులు అమ్మకాలు దిగటంతో వారాంతంలో సూచీలు భారీగా పతనమయ్యాయని మార్కెట్ విశ్లేషకులు వెల్లడించారు. కాగా బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్ శుక్రవారం ఒక్కరోజే రూ.6.95 లక్షల కోట్లు తగ్గి రూ.451 లక్షల కోట్ల (4.93 లక్షల కోట్ల డాలర్లు)కు పడిపోయింది. ఈ వారంలో సెన్సెక్స్ మొత్తం 2,032 పాయింట్లు (2.43%), నిఫ్టీ 645.7 (2.51%) పాయింట్ల మేరకు నష్టపోయాయి. మరోవైపు ఈ వారంలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ ఏకంగా 16.28 లక్షల కోట్లు క్షీణించింది.

కుప్పకూలిన అదానీ గ్రూప్ షేర్లు

అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన బంధువు సాగర్ అదానీలకు లంచాల కేసులో అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) సమన్లు జారీ చేసేందుకు కోర్టు అనుమతి కోరినట్లు వార్తలు రావటంతో శుక్రవారం అదానీ గ్రూప్ షేర్లు కుప్పకూలాయి. దీంతో గ్రూప్ మార్కెట్ క్యాప్ సుమారు రూ.1.15 లక్షల కోట్లు హరించుకుపోయింది. గ్రూప్ ఫ్లాగ్‌షిప్ కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 9.38% (రూ.1,891.60) పతనమవగా అదానీ పవర్ షేరు 8.84% (రూ.128.35), అదానీ పోర్ట్స్ షేరు 7.81% (రూ.1,303.25), అదానీ టోటల్ గ్యాస్ షేరు 7.55% (రూ.507), అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ షేరు 13.20% (రూ.785), అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ షేరు 10.57% (రూ.827.50), ఎన్‌డీటీవీ 5.31% (రూ.80.72), ఏసీసీ 2.76% (రూ.1,680), అంబుజా సిమెంట్ 5.98% (రూ.513.50), సంఘీ ఇండస్ట్రీస్ 5.96% (రూ.60.06) మేరకు క్షీణించాయి.

నేడు బీఎస్ఈలో అప్‌టిక్ సదస్సు: హైదరాబాద్‌కు చెందిన గ్రోక్యాప్ ఫిన్‌టెక్ సంస్థ అప్‌టిక్.. శనివారం నాడు ముంబైలోని బీఎస్ఈ స్టాక్ ఎక్స్ఛేంజీలో ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ గ్లోబల్ అఫైర్స్‌పై అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తోంది. ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్స్, అంతర్జాతీయ క్యాపిటల్ అలోకేషన్ ట్రెండ్స్‌పై ఈ సదస్సులో చర్చించనున్నారు.

బులియన్ జిగేల్



- 10 గ్రాముల పసిడి రూ.1.58 లక్షలకు
- కేజీ వెండి రూ.3.29 లక్షలకు..

న్యూఢిల్లీ: రూపాయి మారకం రేటు పిల్లి మొగ్గలేస్తుంటే పసిడి, వెండి ధరలు మాత్రం చుక్కలంటుతున్నాయి. శుక్రవారం కూడా ఈ మార్కెట్లో ర్యాలీ కొనసాగింది. శుక్రవారం ఢిల్లీ స్పాట్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం రూ.1,500 లాభంతో రూ.1.58 లక్షల రికార్డు స్థాయి వద్ద ముగిసింది. కిలో వెండి ధర కూడా రూ.9,500 లాభంతో రూ.3,29,500కు చేరి మరో ఆల్‌టైమ్ హైకి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లోనూ పసిడి, వెండి ధరలు సెగలు కక్కుతున్నాయి. శుక్రవారం ఔన్స్ బంగారం 4,967.41 డాలర్లు, ఔన్స్ వెండి 99.78 డాలర్లకు చేరి రికార్డు సృష్టించాయి.

ఫ్యూచర్స్ మార్కెట్లోనూ: ఫ్యూచర్స్ మార్కెట్లోనూ బంగారం, వెండి ధరల రికార్డుల హోరు కొనసాగుతోంది. మార్చిలో డెలివరీ ఇచ్చే కిలో వెండి ఎంసీఎక్స్‌లో శుక్రవారం రూ.12,638 లాభంతో రూ.3,39,927 రికార్డు స్థాయికి చేరింది. ఫిబ్రవరిలో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల మేలిమి పసిడి ధర ఎంసీఎక్స్‌లో శుక్రవారం రూ.2,885 పెరిగి రూ.1,59,226కు చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది. వచ్చే కేంద్ర బడ్జెట్‌లో వెండిపై దిగుమతి సుంకం పెంచుతారనే పుకార్లు వెండి ధర అసాధారణ పెరుగుదలకు కారణమని నగల వ్యాపారులు ఆరోపిస్తున్నారు.

జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ రూ.2,100 కోట్ల సమీకరణ

ముంబై: జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (జీహెచ్ఐఏఎల్).. వడ్డీ చెల్లింపులు, కరెన్సీ మారక రేటు ఆటుపోట్ల భారం తగ్గించుకుంటోంది. ఇందులో భాగంగా వచ్చే నెల చెల్లించాల్సిన 28.7 కోట్ల డాలర్ల విదేశీ కరెన్సీ రుణాలు చెల్లించేందుకు.. దేశీయ మార్కెట్లో రుణ పత్రాలు జారీ చేయడం ద్వారా రూ.2,100 కోట్లు సమీకరించింది. పదిహేనేళ్ల కాలపరిమితి ఉండే ఈ రుణ పత్రాలపై కంపెనీ 7.82 శాతం వడ్డీ చెల్లించనుంది. గతంలో 4.75 శాతం వడ్డీ రేటుతో సమీకరించిన విదేశీ కరెన్సీ రుణాలపై ప్రస్తుత రూపాయి ఆటుపోట్లతో 9.5 శాతం వరకు వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. ఈ భారాన్ని తగ్గించుకునేందుకు దేశీయ మార్కెట్లోనే రూపాయల్లో చెల్లించే రుణ పత్రాలు జారీ చేసి కంపెనీ రూ.2,100 కోట్లు సమీకరించింది.

తుది దశకు ఆస్టర్ డీఎం, క్వాలిటీ కేర్ విలీనం

ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ లిమిటెడ్, క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ విలీనం తుది దశకు చేరింది. ఇందుకు వాటాదారులు, అన్‌సెక్యూర్డ్ రుణదాతల ఆమోదం అవసరమని ఎన్‌సీఎల్‌టీ, హైదరాబాద్ బెంచ్ స్పష్టం చేసింది. ఇందుకోసం వచ్చే నెల 27న వాటాదారుల సమావేశం, మార్చి 13న అన్‌సెక్యూర్డ్ రుణదాతల సమావేశం నిర్వహించి ఆమోదం తీసుకోవాలని ఆదేశించింది. ఈ విలీనానికి సీసీఐ, స్టాక్ ఎక్స్ఛేంజీలు ఇప్పటికే ఆమోదం తెలిపాయి.

స్పోర్ట్స్

అటు సూర్య.. ఇటు ఇషాన్

తుఫాన్ ఇన్నింగ్స్‌తో అదుర్స్ ● రెండో టీ20లో కివీస్‌పై భారత్ ఘనవిజయం



ఇషాన్ కిషన్ (76)

3 పవర్‌ప్లేలోనే హాఫ్ సెంచరీ చేసిన మూడో నాన్ ఓపెనర్‌గా ఇషాన్. గతంలో డియాన్ మైర్స్, ఇన్‌గ్లిస్ ఉన్నారు.

1
- టీ20ల్లో తమ అత్యధిక ఛేదన (209)ను పూర్తి చేసిన భారత్. 2023లోనూ ఇన్నే రన్స్‌ను ఛేదించింది.
- టీ20 ఇన్నింగ్స్ మొదటి ఓవర్‌లో ఎక్కువ (18) పరుగులిచ్చుకున్న భారత బౌలర్‌గా భువనేశ్వర్‌తో సమంగా నిలిచిన అర్ష్‌దీప్.
- అంతర్జాతీయ టీ20ల్లో 25 అంతకంటే తక్కువ బంతుల్లోనే ఎక్కువ (8) ఫిఫ్టీలు సాధించి అభిషేక్‌తో సమంగా నిలిచిన సూర్యకుమార్.
- 200, ఆపై పరుగుల ఛేదనను వేగంగా పూర్తి చేసిన జట్టుగా భారత్ (15.2 ఓవర్లలో 209 రన్స్). ఈ క్రమంలో పాకిస్థాన్ (2025లో న్యూజిలాండ్‌పై 16 ఓవర్లలో 205 రన్స్)ను అధిగమించింది.

రాయ్‌పూర్: ఎన్నాళ్లకెన్నాళ్లకు.. టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ (37 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 82 నాటౌట్) ఏడాదిన్నర తర్వాత తన సహజశైలిలో చెలరేగగా, వన్‌డౌన్ బ్యాటర్ ఇషాన్ కిషన్ (32 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్సర్లతో 76) మెరుపు బ్యాటింగ్‌తో సత్తా చాటుకున్నాడు. దీంతో శుక్రవారం న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20లో భారత్ 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. అలాగే సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలో నిలవగా, మూడో మ్యాచ్ ఆదివారం గువాహటిలో జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 208 పరుగులు చేసింది. కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (27 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 47 నాటౌట్), రచిన్ రవీంద్ర (26 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 44), సీఫర్ట్ (13 బంతుల్లో 5 ఫోర్లతో 24) వేగంగా ఆడారు. కుల్దీప్‌నకు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత్ 15.2 ఓవర్లలోనే 3 వికెట్లకు 209 పరుగులు చేసి గెలిచింది. 23 ఇన్నింగ్స్ (468 రోజులు) తర్వాత సూర్య హాఫ్ సెంచరీ సాధించగా, శివమ్ దూబే (18 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 36 నాటౌట్) సహకరించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ఇషాన్ నిలిచాడు.

పరుగుల వరద: భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే గట్టి ఝలక్ తగిలింది. ఇన్నింగ్స్ తొలి రెండు ఓవర్లలోనే ఓపెనర్లు శాంసన్ (6), అభిషేక్ (0) పెవిలియన్‌కు చేరారు. అప్పటికి స్కోరు ఆరు పరుగులు మాత్రమే. కానీ కివీస్ సంతోషాన్ని ఆవిరి చేస్తూ ఇషాన్, సూర్యకుమార్ మైదానంలో డైనమైట్లలా పేలారు. ఆరంభంలో ఇషాన్ స్ట్రయికింగ్ ఎక్కువగా తనే తీసుకుంటూ బౌండరీల వర్షాన్ని కురిపించాడు. బౌలర్ ఎవరైనా బంతి గాల్లోనే కనిపించాలన్న కసితో ఇషాన్ చెలరేగగా, పక్కన సూర్య ప్రేక్షక పాత్రకే పరిమితం కావాల్సి వచ్చింది. మూడో ఓవర్‌లో ఇషాన్ 4,4,4,6తో 24 పరుగులు రాగా, శాంట్నర్ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లు బాదాడు. ఇక ఆరో ఓవర్‌లో 6,4,4తో 21 రన్స్ రాబట్టడంతో పాటు 21 బంతుల్లోనే ఫిఫ్టీని కూడా పూర్తి చేశాడు. ఈ ధాటికి పవర్‌ప్లేలో భారత్ 75/2 స్కోరుతో పటిష్ఠ స్థితిలో నిలిచింది. ఇక ఇషాన్ జోష్‌తో సూర్య కూడా బ్యాట్ ఝుళిపించి తొమ్మిదో ఓవర్‌లో 4,4,4,4,6,2 ఓ వైడ్‌తో ఏకంగా 25 రన్స్ అందించాడు. కానీ స్పిన్నర్ సోధీ తర్వాతి ఓవర్‌లోనే ఇషాన్ వికెట్ తీయడంతో మూడో వికెట్‌కు 49 బంతుల్లోనే 122 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇందులో ఇషాన్‌వే 76 రన్స్ ఉండడం విశేషం. ఇక ఆ తర్వాత సూర్య విధ్వంసంతో కివీస్ కకావికలమైంది. అప్పర్ కట్, స్వీప్, డ్రైవ్ షాట్లతో యధేచ్ఛగా చెలరేగడంతో పాటు 11వ ఓవర్‌లో 6,4తో 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అలాగే 14వ ఓవర్‌లో 6,4,4 రాబట్టి విజయాన్ని సులువు చేశాడు. అటు దూబే సైతం భారీ షాట్లతో చెలరేగగా, మరో 28 బంతులుండగానే భారత్ మ్యాచ్‌ను ముగించింది. ఈ జోడీ మధ్య నాలుగో వికెట్‌కు అజేయంగా 81 పరుగులు నమోదయ్యాయి.

ఆరంభం అదిరినా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ ఇన్నింగ్స్ తొలి బంతి నుంచే ఎదురుదాడి లక్ష్యంగా సాగింది. క్రీజులోకి వచ్చిన ప్రతీ బ్యాటర్ వేగంగా ఆడేందుకు ప్రయత్నించారు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ కాన్వే (19) 4,4,6,4తో విరుచుకుపడగా, అర్ష్‌దీప్ ఏకంగా 18 రన్స్ ఇచ్చుకున్నాడు. మరో ఓపెనర్ సీఫర్ట్ సైతం అతడి రెండో ఓవర్‌లో వరుసగా 4 ఫోర్లు బాది 18 రన్స్ రాబట్టాడు. కానీ వరుస ఓవర్లలో కాన్వేను హర్షిత్, సీఫర్ట్‌ను వరుణ్ అవుట్ చేయడంతో మొదటి వికెట్‌కు 43 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయినా రచిన్ వచ్చీరాగానే ఆరో ఓవర్‌లో 6,4,6తో 19 రన్స్ రాబట్టగా పవర్‌ప్లేలో కివీస్ 64/2 స్కోరుతో నిలిచింది. మరో ఎండ్‌లో కుల్దీప్‌ను ఫిలిప్స్ (19) లక్ష్యంగా చేసుకుని 6,4,4తో ఆకట్టుకున్నాడు. అయితే అదే ఓవర్‌లో హార్దిక్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఇక మిచెల్ (18) రెండు ఫోర్లతో జట్టు పదో ఓవర్‌లోనే వంద రన్స్ దాటేసింది. మిచెల్, రచిన్‌లను కూడా వరుస ఓవర్లలో దూబే, కుల్దీప్ అవుట్ చేయడంతో కివీస్ 129 రన్స్ దగ్గర 4 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో మధ్య ఓవర్లలో స్పిన్నర్లు పరుగులను నియంత్రించారు. చాప్‌మన్ (10) రన్స్ తీసేందుకు ఇబ్బందిపడ్డాడు. శాంట్నర్ మాత్రం మరో ఎండ్‌లో బౌండరీలతో జోరు చూపాడు. చివరి 3 ఓవర్లలో ఫౌక్స్ (15 నాటౌట్) సహాయంతో 47 రన్స్ రాబట్టడంతో స్కోరు 200 దాటింది.



సూర్యకుమార్ (82 నాటౌట్)

స్కోరుబోర్డు

న్యూజిలాండ్: కాన్వే (సి) హార్దిక్ (బి) హర్షిత్ 19, సీఫర్ట్ (సి) ఇషాన్ (బి) వరుణ్ 24, రచిన్ (సి) అర్ష్‌దీప్ (బి) కుల్దీప్ 44, ఫిలిప్స్ (సి) హార్దిక్ (బి) కుల్దీప్ 19, మిచెల్ (సి) హార్దిక్ (బి) దూబే 18, చాప్‌మన్ (సి) అభిషేక్ (బి) హార్దిక్ 10, శాంట్నర్ (నాటౌట్) 47, ఫౌక్స్ (నాటౌట్) 15; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 20 ఓవర్లలో 208/6. వికెట్ల పతనం:** 1-43, 2-43, 3-98, 4-125, 5-129, 6-161. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-53-0, హార్దిక్ 3-0-25-1, హర్షిత్ 3-1-35-1, వరుణ్ 4-0-35-1, కుల్దీప్ 4-0-35-2, అభిషేక్ 1-0-12-0, దూబే 1-0-7-1.

భారత్: శాంసన్ (సి) రచిన్ (బి) హెన్రీ 6, అభిషేక్ (సి) కాన్వే (బి) డఫీ 0, ఇషాన్ (సి) హెన్రీ (బి) సోధీ 76, సూర్య (నాటౌట్) 82, దూబే (నాటౌట్) 36; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 15.2 ఓవర్లలో 209/3. వికెట్ల పతనం:** 1-6, 2-6, 3-128. **బౌలింగ్:** హెన్రీ 3-0-41-1, డఫీ 4-0-38-1, ఫౌక్స్ 3-0-67-0, శాంట్నర్ 2-0-27-0, సోధీ 3-0-34-1, మిచెల్ 0.2-0-2-0.



ఢిల్లీ జట్టులో సృజన

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ఢిల్లీ X బెంగళూరు (రా. 7.30)

న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో హైదరాబాద్ పేసర్ ఎడ్ల సృజనకు చోటు దక్కింది. ఈమేరకు ఆ ఫ్రాంచైజీ శుక్రవారం ప్రకటించింది. ఆ జట్టు బ్యాటర్ దియా యాదవ్, వికెట్ కీపర్ మమత గాయాలతో టోర్నీకి దూరమయ్యారు. వారి స్థానాలలో కుడి చేతి మీడియం పేసర్ సృజనతోపాటు ఆల్‌రౌండర్ ప్రగతిలను ఢిల్లీ తీసుకుంది.

మంకుపట్టు వీడని బంగ్లా

- డీఆర్‌సీ చెంతకు బీసీబీ
- ఐసీసీ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని వినతి
- స్కాట్లాండ్ రాక ఇక లాంఛనమే
- నేడు అధికారిక ప్రకటన

న్యూఢిల్లీ: తమ వరల్డ్ కప్ మ్యాచ్‌లను బంగ్లాదేశ్ నుంచి తరలించాలన్న డిమాండ్‌కు ఐసీసీ నసేమిరా అనడంతో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) చివరి యత్నంగా మరో దారిని ఎంచుకుంది. తమ మ్యాచ్‌లను భారత్‌లోనే కొనసాగించాలన్న ఐసీసీ నిర్ణయాన్ని తోసిపుచ్చాలని ఐసీసీ వివాద పరిష్కార కమిటీ (డీఆర్‌సీ)ని అభ్యర్థించింది. అయితే ఆ విషయం తన పరిధిలోకి రానందున బీసీబీ విన్నపాన్ని డీఆర్‌సీ పట్టించుకొనే అవకాశాలు లేవు. నిబంధనల ప్రకారం ఐసీసీ తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకొనే అధికారం డీఆర్‌సీకి ఎంతమాత్రమూ లేదు. డీఆర్‌సీ చైర్మన్‌గా ఇంగ్లండ్‌కు చెందిన న్యాయవాది మైకేల్ బెలాఫ్ వ్యవహరిస్తున్నాడు. 'ఆఖరి యత్నంగా డీఆర్‌సీని ఆశ్రయించాం. డీఆర్‌సీ కూడా వ్యతిరేక తీర్పు ఇస్తే మాకు మిగిలిన ఏకైక ప్రత్యామ్నాయం స్విట్జర్లాండ్‌లోని క్రీడా వివాదాల పరిష్కార కోర్టు మాత్రమే' అని బీసీబీ అధికారి తెలిపాడు.

కఠిన చర్యలకు జై షా యోచన!


భారత్‌లో టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లను బహిష్కరిస్తే బంగ్లా క్రికెట్ బోర్డుపై కఠిన చర్యలు చేపట్టాలని ఐసీసీ అధ్యక్షుడు జై షా యోచిస్తున్నాడట. బంగ్లాదేశ్ వివాదంపై చర్చించేందుకు జై షా శుక్రవారం ప్రత్యేకంగా దుబాయ్ వెళ్లాడు. ఇక..బంగ్లా స్థానంలో స్కాట్లాండ్‌ను ఎంపిక చేయనున్న విషయాన్ని ఐసీసీ అధికారికంగా శనివారం ప్రకటించనున్నట్టు సమాచారం.

సింధు, లక్ష్య పరాజయం


జకార్తా: ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్స్‌లో స్టార్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్యసేన్ పరాజయం పాలయ్యారు. మహిళల సింగిల్స్‌లో సింధు 13-21, 17-21తో వరుస గేముల్లో చెన్ యు ఫీ (చైనా) చేతిలో ఓడింది. ఇక పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ 18-20, 20-22తో పనిచపోన్ (థాయ్‌లాండ్)పై పోరాడి ఓడాడు.

ఆంధ్ర 228 ఆలౌట్

అనంతపురం (క్లాక్‌టవర్-ఆంధ్రజ్యోతి): ఓపెనర్ అభిషేక్ రెడ్డి (73), సౌరబ్ కుమార్ (62) అర్ధ శతకాలతో ఆదుకోవడంతో విదర్భతో రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర మొదటి ఇన్నింగ్స్‌లో 228 పరుగులకు ఆలౌటైంది. ఫలితంగా పర్యాటక జట్టుకు 67 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ చేపట్టిన విదర్భ రెండో రోజు ఆఖరికి వికెట్ నష్టపోకుండా నాలుగు పరుగులు చేసింది. దాంతో విదర్భ జట్టు మొత్తంగా 71 పరుగులు ముందంజలో నిలిచింది. అంతకుముందు ఓవర్‌నైట్ 267/7 స్కోరుతో, శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ 295 పరుగులకు ఆలౌటైంది. కలిదిండి రాజు ఐదు వికెట్లు తీశాడు.



పౌలిని



ఇవా జొవిక్

పౌలినికి షాక్

ప్రీక్వార్టర్స్‌లో అల్కారజ్, జ్వెరెవ్, సబలెంక, గాఫ్
ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: సాఫీగా సాగుతున్న ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సంచలనం చోటు చేసుకుంది. ఏడో సీడ్ జాస్మిన్ పౌలినికి మూడో రౌండ్‌లో చుక్కెదురైంది. ఇక టాప్ సీడ్ అల్కారజ్, మూడో సీడ్ జ్వెరెవ్, ఆరో సీడ్ డిమినార్, 11వ సీడ్ మెద్వెదెవ్, వరల్డ్ నెం.1 సబలెంక, మూడో సీడ్ కొకొ గాఫ్, ఎనిమిదో సీడ్ ఆండ్రీవా ప్రీక్వార్టర్ ఫైనల్లో ప్రవేశించారు. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో అమెరికన్ టీనేజర్ ఇవా జొవిక్ 6-2, 7-6 (3)తో ఇటలీకి చెందిన పౌలినికి షాకిచ్చింది. మరో మ్యాచ్‌లో సబలెంక 7-6 (4), 7-6 (9) అనస్టాసియా పొటపోవాపై, కొకొ గాఫ్ 3-6, 6-0, 6-3తో బాప్టిస్ట్‌పై, ఆండ్రీవా 6-3, 6-4తో రుసెనిపై, 12వ సీడ్ స్విటోలినా 7-6 (4), 6-3తో ష్నేడిర్‌పై, ముచోవా 6-1, 6-1తో లినెట్టిపై నెగ్గారు. పురుషుల నెం.1 అల్కారజ్ 6-2, 6-4, 6-1తో మౌటెట్‌పై అలవోకగా గెలిచి ప్రీక్వార్టర్ ఫైనల్‌కు చేరాడు. జ్వెరెవ్ 7-5, 4-6, 6-3, 6-1తో కామెరూన్ నోరీపై నెగ్గేందుకు శ్రమించాడు. ఆరో సీడ్ డిమినార్ 6-3, 6-4, 7-5తో 29వ సీడ్ టియఫోపై గెలుపొందగా, మెద్వెదెవ్ 6-5 (7), 4-6, 7-5 6-0, 6-3తో మరోజన్‌పై ఐదు సెట్లు పోరాడి రౌండ్-16కి ముందంజ వేశాడు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 24-1-2026

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ



గణతంత్ర వేడుకలను తిలకించేందుకు వచ్చే ప్రజల కోసం ఏర్పాటు చేసిన గ్యాలరీ

గణతంత్ర వేడుకలకు 12

అసెంబ్లీ, సచివాలయం ముస్తాబు

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నారాయణ

సైనైడ్ కిల్లర్‌కు జీవిత ఖైదు 10

ప్రసాదంలో సైనైడ్ కలిపి పది మంది హత్య

ఆపై బంగారం, నగదుతో ఉడాయింపు

సహకరించిన మరొకరికి పదేళ్ల జైలు శిక్ష

ఏలూరు 8వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు



శుక్రవారం అమరావతి సచివాలయంలో జరిగిన ఎస్ఎల్‌బీసీ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఉదారంగా రుణాలివ్వండి

ప్రైవేట్ వ్యక్తుల వద్ద తీసుకునే పరిస్థితి వద్దు

వ్యవసాయం సహా ఏ అవసరం వచ్చినా బ్యాంకుల్లో రుణాలు తీసుకునేలా ఉండాలి

డ్వాక్రాల తరహాలోనే రైతులకు ప్రోత్సాహం

ఎంఎస్ఎంఈ రంగానికి మరింత ఊతమివ్వాలి

బీసీ, ఎస్సీ, ఎస్టీ వ్యాపారులకు చేయూతనివ్వాలి

డ్వాక్రా సంఘాల ఖాతాలపై చార్జీలు తగ్గించండి

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

2 లక్షల కోట్ల రుణాల్లో 49 వేలకోట్లు రీ-షెడ్యూల్

దీనివల్ల 1,108 కోట్లు ఆదా అయ్యాయి

రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో చంద్రబాబు

ఎంఎస్ఎంఈలకు రూ.95,714 కోట్ల రుణాలు

'సాగు'కు 2.96 లక్షల కోట్లు ఇచ్చాం: బ్యాంకర్లు

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల తరహాలోనే రైతులకు ప్రోత్సాహం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు బ్యాంకర్లను కోరారు. డ్వాక్రా సంఘాల మాదిరిగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలన్నారు. ప్రకృతి సేద్యం మరింత విస్తరించేందుకు బ్యాంకర్లు ప్రోత్సాహం అందించాలన్నారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం సీఎం అధ్యక్షతన జరిగింది. దావోస్ పర్యటన ముగించుకుని ఉదయాన్నే

మిగతా 11వ పేజీలో...

రాయలసీమకు జల సిరులు 11

హంద్రీ-నీవా నుంచి రికార్డు స్థాయిలో

40.109 టీఎంసీల జలాలు తరలింపు

50 టీఎంసీలు తీసుకెళ్లడమే లక్ష్యం: సీఎం

అది నెయ్యే కాదు!

పామాయిల్, కెమికల్ కలిపిన ద్రవం!

లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కేసులో సిట్ స్పష్టీకరణ

నెల్లూరు కోర్టులో తుది చార్జిషీటు దాఖలు

12 మంది టీటీడీ ఉద్యోగులు సహా 36 మందిపై అభియోగాలు

భోలేబాబా డెయిరీ కేంద్రంగా కల్తీ దందా

ఆ డెయిరీకి అసలు ఆవులే లేవు

బయటి నుంచి కూడా పాలు కొనలేదు

టీటీడీ పెద్దలు, సరఫరాదారులు కుమ్మక్కు

2019-24 మధ్య 60.10 లక్షల కిలోల నెయ్యి సరఫరా

కల్తీ అని తెలిసీ అనుమతించిన అధికారులు

టీటీడీకి రూ.250 కోట్లు నష్టం

కల్తీ నెయ్యి కేసులో ముగిసిన దర్యాప్తు

చార్జిషీటులో ప్రతి అంశానికీ ఆధారాలు

నిందితుల జాబితాలో 5 డెయిరీలు, 31 మంది వ్యక్తులు

చార్జిషీట్లో వివరించిన సిట్ అధికారులు



తిరుపతి/అమరావతి/నెల్లూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి సరఫరా అయింది అసలు నెయ్యే కాదని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) స్పష్టంచేసింది. పామాయిల్‌లో రసాయనాలు కలిపి కల్తీ నెయ్యి తయారుచేశారని నిగ్గుతేల్చింది. నెయ్యి సరఫరా చేసిన భోలే బాబా డెయిరీకి అసలు ఆవులే లేవని, బయటి నుంచి పాల సేకరణ కూడా చేయలేదని పేర్కొంది. టెండర్ దక్కించుకున్న సరఫరా సంస్థలకు నెయ్యి ఉత్పత్తి చేసే సామర్థ్యమే లేదన్న చేదు నిజాన్ని బయటపెట్టింది. కెమికల్స్, ముడి పదార్థాలు కలిపి భోలే బాబా డెయిరీ తయారుచేసిన నకిలీ నెయ్యి.. ఏఆర్ డెయిరీ, వైష్ణవీ డెయిరీ ద్వారా టీటీడీకి

మిగతా 12వ పేజీలో...

మద్యం స్కాం గురించి తెలీదు!

దానితో నాకు సంబంధంలేదు

అదాన్ డిస్టిలరీలో భాగస్వామ్యమా!?

అది మా ఆడిటర్ చూసుకుంటారు

డిస్టిలరీల నుంచి పీఎల్ఆర్‌లోకి వచ్చిన డబ్బులు వెనక్కి ఇచ్చేశాం

ఈడీ విచారణలో ఎంపీ మిథున్ రెడ్డి

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): 'మద్యం కుంభకోణం గురించి నాకేమీ తెలియదు. దాంతో నాకు ఎలాంటి సంబంధమూ లేదు' అని వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి స్పష్టం చేసినట్లు తెలిసింది. రాజకీయ కక్షతోనే ప్రభుత్వం తనపై కేసులు పెట్టిందని ఆరోపించినట్లు సమాచారం. జగన్ హయాంలో

మిగతా 11వ పేజీలో...



ఇరాన్ వైపు అమెరికా సేనలు

పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామన్న ట్రంప్

యుద్ధ విమాన వాహక నౌకలు సహా భారీ స్థాయిలో బలగాలను పంపినట్టు వెల్లడి

ఇరాన్, అమెరికా పరస్పర హెచ్చరికలతో ఉద్రిక్తత

డబ్ల్యూహెచ్‌వో నుంచి వైదొలగిన అమెరికా

వాషింగ్టన్, జనవరి 23: ఇరాన్‌పై అమెరికా దాడికి రంగం సిద్ధమవుతోందా? సైనిక చర్య ఇప్పట్లో ఉండబోదన్న ట్రంప్ తన నిర్ణయాన్ని మార్చుకున్నారా? ఏ క్షణమైనా ఇరాన్‌పై భారీ స్థాయిలో విరుచుకుపడే అవకాశం ఉందా? ట్రంప్ ప్రకటనలు, పశ్చిమాసియా, గల్ఫ్ ప్రాంతాల్లో అమెరికా సైన్యం కదలికలు ఈ ప్రశ్నలకు అవుననే సమాధానమే ఇస్తున్నాయి. ఇరాన్‌లో చెలరేగిన ఆందోళనలను ఖమేనీ ప్రభుత్వం పాశవికంగా అణచివేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ట్రంప్.. ఆందోళనకారులకు సహాయం వస్తోందని, దాడికి సిద్ధమని వారం క్రితమే

మిగతా 2వ పేజీలో...



అనంతపురం జిల్లా కేంద్రంలో మంత్రి నారా లోకేశ్ కటౌట్‌పై పూల వర్షం

ఉప్పొంగిన అభిమానం!

ఘనంగా మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు

తిరుమలలో ఒకరోజు 'భాష్యం' అన్నప్రసాదం

రూ.44 లక్షలు విరాళం ఇచ్చిన రామకృష్ణ

మడకశిరలో పదివేల మందికి ఇంటి పట్టాలు అందజేత

అనాథ పిల్లలకు వాసంశెట్టి దుస్తుల పంపిణీ

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు వేడుకలు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టీడీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు ఆయన పేరిట ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. పలుచోట్ల సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. వాడవాడలా భారీ కేక్‌లు కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. లోకేశ్ జన్మదినం సందర్భంగా తిరుమలలో భక్తులకు ఒకరోజు అన్నప్రసాద వితరణ కోసం భాష్యం సంస్థల అధినేత రామకృష్ణ రూ.44 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ విరాళంతో భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాన్ని వెంగమాంబ అన్నప్రసాద భవనంలో

మిగతా 11వ పేజీలో...

పదే పదే అదే విషం!

అమరావతిపై ఆగని జగన్ అబద్ధాలు

చదరపు అడుగు నిర్మాణానికి రూ.10-13 వేల ఖర్చట!

రాష్ట్రానికి పెనుభారమంటూ గగ్గోలు.. వాస్తవానికి టవర్ల నిర్మాణంలో

ఎస్ఎఫ్‌టీకి 5 వేలే.. నివాసాల్లో గరిష్ఠంగా రూ.6,884..

ఆయన హయాంలో 'రుషికొండ' నిర్మాణంలో చ.అడుగుకు 15,293 ఖర్చు

తప్పుడు లెక్కల విన్యాసాలు.. మాయమాటలతో ప్రజలను నమ్మించే ఎత్తుగడ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



రాజధాని అమరావతిపై వైసీపీ అధినేత జగన్ మరోసారి అక్కసు వెళ్లగక్కారు. గత ఏడాది ఆగస్టులో గాలిపోగేసి అబద్ధాలతో అమరావతిపై దాడి చేసిన ఆయన.. తాజాగా అసత్య గణాంకాలతో విషం చిమ్మాలని చూశారు. రాజధానిలో జరుగుతున్న నిర్మాణాల్లో అవినీతి జరిగిపోతోందని... అడ్డగోలుగా ఖర్చుపెట్టేస్తున్నారని.. ప్రభుత్వంపై పెనుభారం పడుతోందని.. కళ్లముందు అవినీతి జరిగిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని.. తాను మాట్లాడితే తప్ప ఏదీ బయటకు రావడం లేదని గగ్గోలు పెట్టారు. అమరావతిలో సచివాలయం, విభాగాధిపతుల ఆఫీసులు, అధికారుల నివాస సముదాయాల నిర్మాణం చేస్తున్న సంగతి తెలిసిందే. చదరపు అడుగు నిర్మాణానికి రూ.10 వేల నుంచి 13వేల దాకా ఖర్చుపెడుతున్నారని జగన్ తాజాగా ఆరోపించారు. అయితే ఏ భవనంపైనా అంత ఖర్చు లేనే లేదు. అధికారిక లెక్కల ప్రకారం, సవరించిన ధరల మేరకు చదరపు అడుగు నిర్మాణానికి కనిష్ఠంగా రూ.5 వేలు, గరిష్ఠంగా 6,884 మాత్రమే వ్యయమవుతోంది. సచివాలయం 1, 2 టవర్లలో నిర్మాణం, వసతులు, ఫర్నిచర్, ఇతర సదుపాయాలతో కలిపి చదరపు అడుగుకు అవుతున్న ఖర్చు గరిష్ఠంగా 5 వేలు. 2014-19 నడుమ ప్రతిపాదించిన నిర్మాణ వ్యయం రూ.3,200గా ఉంటే.. ఇప్పుడు మారిన

మిగతా 2వ పేజీలో...

ఓట్ల శాతం ఆధారంగా పార్టీలకు ప్రాతినిధ్యం ఉండాలి: ఎస్‌వై ఖురేషీ

చెన్నై, జనవరి 23: ఎన్నికల్లో పార్టీలకు వచ్చిన ఓట్ల శాతం ప్రాతిపదికన కూడా పార్లమెంట్‌లో సీట్లు ఉండాలని కేంద్ర మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్‌వై ఖురేషి అభిప్రాయపడ్డారు. దీనికోసం దేశంలో మిశ్రమ ఎన్నికల విధానాన్ని తెచ్చే దిశగా ఆలోచన చేయాలని సూచించారు. ప్రతి ఓటరుకు రెండు ఓట్లు ఇవ్వాలని, ఒకటి పార్టీకి, రెండోది అభ్యర్థికి ఇవ్వాలన్నారు. అనుగుణంగా లోక్‌సభ సీట్లను 543 నుంచి 800 పెంచాలన్నారు. "2014 సాధారణ ఎన్నికల్లో యూపీలో బీఎస్పీకి 20% ఓట్లు వచ్చాయి. అయినా ఆ పార్టీ ఒక్క స్థానంలో కూడా గెలవలేదు' అని ఖురేషి చెప్పారు.

విమానయాన రంగ బలోపేతానికి సహకరించండి

▸▸ ఎయిర్‌బస్, బోయింగ్ ప్రతినిధులతో రామ్మోహన్‌నాయుడు

న్యూఢిల్లీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు దావోస్‌లో ప్రముఖ విమానతయారీ సంస్థలు ఎయిర్‌బస్, బోయింగ్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. దేశీయ విమానయాన రంగ బలోపేతానికి సహకరించాలని కోరారు. మేకిన్ ఇండియాలో భాగంగా విమానాలను కొనడమే కాకుండా, వాటి విడిభాగాలను భారతదేశంలోనే తయారు చేసేలా కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

కేంద్ర రంగ సంస్థల్లో వేతనాలు, పింఛన్ల పెంపు

న్యూఢిల్లీ, జనవరి 23: ప్రభుత్వ రంగంలోని జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు, నాబార్డు, రిజర్వ్ బ్యాంకు ఉద్యోగులకు, పెన్షనర్లకు వేతనాలు, పింఛను పెంపుదలకు కేంద్ర ప్రభుత్వం అధికారిక ముద్ర వేసింది. ఈ నిర్ణయంతో 46,322 మంది ఉద్యోగులు, 46 వేల మంది పెన్షనర్లు, కుటుంబ పింఛనుదారులు లబ్ధి పొందనున్నారు. బీమా ఉద్యోగులకు వేతనాల్లో పెరుగుదల 2022, ఆగస్టు 1 నుంచి అమలుకానున్నది. ఏప్రిల్, 2010 తరువాత చేరిన బీమా ఉద్యోగులకు ఎన్‌పీఎస్ కంట్రిబ్యూషన్‌ను 10% నుంచి 14%కి పెంచింది. నాబార్డు ఉద్యోగులకు జీతము, అలవెన్సుల్లో 20% పెరిగింది. ఈ పెంపు నవంబరు 1, 2022 నుంచి అమలులోకి వస్తుంది. ఈ పెంపుదల గ్రూపు ఏ, బీ, సీ ఉద్యోగులకు వర్తిస్తుంది.

మహాత్మాగాంధీ పేరునే కొనసాగించాలి

▸▸ ఉపాధి హామీ పేరు మార్పుపై తమిళనాడు అసెంబ్లీ తీర్మానం

చెన్నై, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి మహాత్మాగాంధీ పేరునే కొనసాగించాలని తమిళనాడు అసెంబ్లీ శుక్రవారం ఏకగ్రీవ తీర్మానం చేసింది. సీఎం స్టాలిన్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద కేంద్రం తమిళనాడుకు అందించాల్సిన రూ.1,026 కోట్ల నిధులు విడుదల చేయలేదని తెలిపారు.

తట్టు మళ్లీ వస్తోంది.. తస్మాత్ జాగ్రత్త!

వాషింగ్టన్, జనవరి 23: తట్టు (మీజిల్స్) వ్యాధి మళ్లీ కోరలు చాస్తోంది. ప్రధానంగా పిల్లలకు సంక్రమించే తట్టు కేసులు పలు దేశాల్లో నమోదవుతున్నాయి. అమెరికా దక్షిణ కాలిఫోర్నియాలోని స్పార్టన్‌బర్గ్‌లో.. స్వల్పంగా మొదలైన కేసులు ఈ నెలకు 550కి చేరుకున్నాయి. దీంతో పాఠశాలలు మూసివేశారు. మెక్సికో, కెనడా దేశాల్లో కూడా తట్టు కేసులు గణనీయంగా నమోదవుతున్నాయి. ఇండొనేషియాలో 14 వేల కేసులు నమోదయ్యాయి. పాకిస్థాన్, యెమెన్‌లలోనూ కేసులు వెలుగులోకి వస్తున్నాయి. 2022లో మహారాష్ట్ర, కేరళ, ఝార్ఖండ్, గుజరాత్‌లలో 32 వేల కేసులు నమోదయ్యాయి. దీనికి ప్రధాన కారణం.. కొవిడ్ అని నిపుణులు చెబుతున్నారు. కొవిడ్ సమయంలో చాలా దేశాల్లో పిల్లలకు వ్యాక్సిన్లు వేయించలేదని, అదే తట్టు మళ్లీ తలెత్తటానికి కారణమైందని చెబుతున్నారు.

800 గ్రాముల బంగారం.. 15 కిలోల వెండి..

▸▸ రేకుల గదిలో 1.5 కోట్ల విలువైన ఆభరణాలు, నగదు

▸▸ తెనాలిలో టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో భారీగా వెలుగులోకి

తెనాలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అదో చిన్న రేకుల గది. అందులో ఉండే వృద్ధురాలు రోజువారీ పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటుంది. కానీ.. ఆమె ఇంట్లో తనిఖీ చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ.1.5 కోట్ల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు చూసి షాకయ్యారు. గుంటూరు జిల్లా తెనాలి పట్టణం బాలాజీరావుపేటకు సమీపంలోని మహేంద్ర కాలనీలో పేరిబోయిన గురవమ్మ నివాసం ఉండే రేకుల ఇంట్లో కోటిన్నర విలువైన ఆభరణాలు, నగదు బయటపడటం సంచలనంగా మారింది. డీఎస్పీ జనార్ధనరావు చెప్పిన వివరాల మేరకు.. రైస్ పుల్లింగ్ చేస్తున్నారంటూ ఎస్పీ వకుల్ జిందాల్‌కు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం తెల్లవారుజామున టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురవమ్మ ఇంట్లో తనిఖీలు చేపట్టారు. 15 కిలోల వెండి, 800 గ్రాముల బంగారం, 5.65 లక్షల నగదు గుర్తించారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.1.5 కోట్లు ఉంటుందని అంచనా. ఇంత మొత్తంలో ఆభరణాలు ఎందుకున్నాయని పోలీసులు గురవమ్మను ప్రశ్నించగా.. తన అల్లుడు దాచుకున్నాడని చెప్పింది. తన అల్లుడు విజయవాడలో ఉంటాడని, భవానీపురంలోని ఓ చాక్లెట్ ఫ్యాక్టరీలో పనిచేస్తాడని చెప్పింది. ఫ్యాక్టరీలో పనిచేసేవారికి ఇంత బంగారం ఎక్కడిదని ప్రశ్నించడంతో.. ఆ ఫ్యాక్టరీలో భాగస్వామి అని, బాగా ఆస్థిపరులని చెప్పింది. దీంతో టాస్క్‌ఫోర్స్ బృందం విజయవాడలోని ఆమె అల్లుడి ఇంటికి వెళ్లగా.. అతడు పారిపోయాడని పోలీసులు చెప్పారు. ఆ బంగారం అతనిదేనా! లేక పారిశ్రామికవేత్తలెవరైనా అతడ్ని బినామీ కింద ఉపయోగించుకుంటున్నారా? లేదంటే అక్రమమార్గంలో సంపాదించాడా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

కాంగ్రె‌స్‌కు శశి థరూర్ దూరం!

▸▸ పార్టీ కీలక సమావేశానికి డుమ్మా

న్యూఢిల్లీ, జనవరి 23: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేరళ కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ ఆపార్టీకి దూరమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. త్వరలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి శుక్రవారం ఏఐసీసీ చీఫ్ ఖర్గే నేతృత్వంలో నిర్వహించిన ముఖ్య సమావేశానికి ఆయన డుమ్మాకొట్టారు. అయితే, కొజికోడ్‌లో జరిగే 'కేరళ సాహిత్య ఉత్సవానికి' హాజరుకావాల్సి ఉన్నందునే థరూర్ రాలేకపోయారని ఎంపీ కార్యాలయం తెలిపింది. కానీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తనను అవమానించారని శశిథరూర్ భావిస్తున్నారు. ఈ నెల 19న తిరువనంతపురంలో కాంగ్రెస్ 'మహ పంచాయతీ' కార్యక్రమం నిర్వహించింది. దీనిలో పాల్గొన్న రాహుల్.. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన వారిని సన్మానించారు. వేదికపై శశిథరూర్ ఉన్నప్పటికీ.. ఆయనను పలకరించకపోవడం, ఇతర నేతల పేర్లను ప్రస్తావించి.. ఆయనను విస్మరించడంతో శశి అలకబూనారని తెలుస్తోంది.

డీఎంకే టైమైపోయింది!

ఇక తమిళనాడు ఎన్‌డీఏతోనే: మోదీ.. తమిళనాడు, కేరళలో ప్రచారానికి ప్రధాని శ్రీకారం

చెన్నై-ఆంధ్రజ్యోతి/తిరువనంతపురం, జనవరి 23: దక్షిణాదిన ఇంతవరకు బీజేపీని ఆదరించని తమిళనాడు, కేరళల్లో ప్రధాని మోదీ శుక్రవారం అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించారు. పాలక పార్టీలు/కూటములపై విరుచుకుపడ్డారు. ప్రధానంగా తమిళనాడులో డీఎంకే టైమైపోయిందన్నారు. అవినీతి డీఎంకే ప్రభుత్వానికి వీడ్కోలు పలకాలని రాష్ట్ర ప్రజలు నిర్ణయించేశారని తెలిపారు. ఇక తమిళనాడు ఎన్‌డీఏతోనే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. చెన్నై సమీపంలోని మదురాంతకంలో జరిగిన భారీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. 'డీఎంకే ప్రభుత్వ నిష్క్రమణకు కౌంట్‌డౌన్ మొదలైంది. ఇది అవినీతి, మాఫియా, నేరాల (కరప్షన్-మాఫియా-క్రైం(సీఎంసీ) సర్కారు. అది ఒక కుటుంబాన్ని మాత్రమే సేవిస్తోంది. ఈ పార్టీలో ఎదగాలంటే.. వారసత్వం, అవినీతి, మహిళలపై అసభ్య వ్యాఖ్యలు, భారత సంస్కృతిని తూలనాడడం.. ఇవే మార్గాలు' అని ధ్వజమెత్తారు. సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ పేరు ప్రస్తావించకుండా ఈ వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు అభివృద్ధికి కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఎంతో చేసిందని ప్రధాని అన్నారు. 2014కి ముందు కేంద్ర ప్రభుత్వంలో కాంగ్రెస్, డీఎంకే భాగస్వాములుగా ఉన్నప్పుడు విడుదలైన నిధుల కంటే 3 రెట్ల నిధులను తన ప్రభుత్వం తమిళనాడుకు ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో ఎంత అవినీతి జరుగుతోందో, ఆ డబ్బు ఎవరి జేబుల్లోకి చేరుతోందో చిన్నపిల్లలకు కూడా తెలుసన్నారు. స్టాలిన్ జమానాలో డ్రగ్స్, మద్యం మాఫియా మాత్రమే పురోగతి సాధించాయని చెప్పారు. రాష్ట్ర ప్రజలు డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మిత్రపక్షం అన్నాడీఎంకే అధినాయకురాలు, దివంగత మాజీ సీఎం జయలలితను ప్రశంసించారు. ఆమె హయాంలో శాంతిభద్రతలు భేషుగ్గా ఉండేవని.. మహిళలకు సంపూర్ణ రక్షణ ఉండేదని తెలిపారు. మదురైలో తిరుప్పన్‌కుండ్రం కొండపై దీపోత్సవానికి సంబంధించిన వివాదాన్ని కూడా ప్రధాని ప్రస్తావించారు. భక్తులకు బీజేపీ మద్దతుగా నిలువగా.. డీఎంకే మాత్రం ఓటుబ్యాంకు రాజకీయాలకు ప్రాధాన్యమిచ్చిందని విమర్శించారు. ఈ సభలో అన్నాడీఎంకే అధినేత పళనిసామి, ఏఎంఎంకే చీఫ్ టీటీవీ దినకరన్, పీఎంకే అధినేత అన్బుమణి రామ్‌దాస్ తదితర మిత్రపక్షాల నేతలు పాల్గొన్నారు.



తమిళనాడులోని మదురాంతకంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మోదీ, అన్నాడీఎంకే నేత పళనిస్వామి

'ముస్లింలీగ్ మావోయిస్టు కాంగ్రెస్'!

మొదట కేరళ వెళ్లిన మోదీ.. తిరువనంతపురం పుత్తారికందం మైదానంలో జరిగిన సభలో ప్రసంగించారు. సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటములపై విరుచుకుపడ్డారు. కాంగ్రె‌స్‌కు అభివృద్ధి ఎజెండాయే లేదన్నారు. ఆ పార్టీ మావోయిస్టులను మించిన కమ్యూనిస్టుగా.. ముస్లింలీగ్ కంటే ఎక్కువ మతతత్వవాదిగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. 'ముస్లింలీగ్ మావోయిస్టు కాంగ్రెస్ (ఎంఎంసీ)'గా తయారైందన్నారు. 'వచ్చే అసెంబ్లీ ఎన్నికలు కేరళ భవిష్యత్‌ను నిర్ణయించనున్నాయి. ఎల్డీఎఫ్, యూడీఎఫ్ రెండు కూటములూ అవినీతి, దుష్పరిపాలనలో కూరుకుపోయాయి. బుజ్జగింపు రాజకీయాలతో రాష్ట్రాన్ని నాశనం చేశాయి' అని ధ్వజమెత్తారు. ఎన్‌డీఏ రూపంలో ప్రజలకు మూడో ప్రత్యామ్నాయం ఉందన్నారు. తిరువనంతపురంలో 25 వేల మందితో జరిగిన ఈ సభలో.. ఓ చిన్నబాలుడు మోదీ చిత్రాన్ని పట్టుకుని నిలబడ్డాడు. దీనిపై ఆయన స్పందిస్తూ.. పలు సందర్భాల్లో ప్రజలు తనపై వివిధ రూపాల్లో తమ ప్రేమను ప్రదర్శిస్తుంటారని.. కానీ విపక్షాలు దానిని డ్రామాగా, ముందస్తు పథకంగా ఆరోపిస్తుంటాయని ఆక్షేపించారు.

చర్లపల్లి సహా 3 అమృత్ భారత్ రైళ్లకు పచ్చజెండా

తిరువనంతపురంలో ప్రజలనుద్దేశించి ప్రసంగించే ముందు ప్రధాని 3 అమృత్ భారత్ రైళ్లను పచ్చజెండా ఊపి ప్రారంభించారు. వీటిలో తిరువనంతపురం-చర్లపల్లి, తిరువనంతపురం-తాంబరం, నాగర్‌కోయిల్-మంగళూరు రైళ్లతో పాటు త్రిసూర్-గురువాయూర్ ప్యాసింజర్ కూడా ఉన్నాయి. అలాగే పీఎం స్వానిధి క్రెడిట్ కార్డును కూడా ప్రారంభించి.. లక్ష మంది లబ్ధిదారులకు పీఎం స్వానిధి రుణాలను పంపిణీ చేశారు. ఈ క్రెడిట్ కార్డు ఐదేళ్ల కాలానికి ఉంటుంది. రూ.30 వేల వరకు రుణపరిమితి ఉంటుంది. ఓపెనింగ్ లిమిట్ రూ.10 వేలే. కార్డు వాడకాన్ని బట్టి క్రమేపీ పెంచుతూ పోతారు. దీనిని యూపీఐ ఐడీకి కూడా లింకు చేసుకోవచ్చు. ఈ కార్యక్రమంలో కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, సీఎం పినరయి విజయన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్, డిప్యూటీ మేయర్ ఆషానాథ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు తాంపనూర్ ఓవర్ బ్రిడ్జి నుంచి పుత్తారికందం మైదానం వరకు ఆయన రోడ్‌షో నిర్వహించారు. దారిపొడవునా బీజేపీ కార్యకర్తలు, అభిమానులు 'వికసిత కేరళం' ప్లకార్డులను ప్రదర్శించారు.

లోకం తీరు



మోదీపై స్టాలిన్, విజయన్ ఆగ్రహం

మోదీ ప్రసంగాలపై తమిళనాడు, కేరళ సీఎంలు స్టాలిన్, విజయన్ మండిపడ్డారు. రాష్ట్రానికి ద్రోహాలు మాత్రమే చేసే బీజేపీ కూటమిని తమిళనాడు ఎప్పుడూ ఓడిస్తుందని స్టాలిన్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'ఎన్నికల సీజన్ వచ్చినప్పుడు మాత్రమే తరచూ రాష్ట్రానికి వచ్చే ప్రధాని మోదీ గారూ! తమిళనాడుకు రావలసిన రూ.3,458 కోట్ల సమగ్ర శిక్షా విద్యా నిధి ఎప్పుడు వస్తుంది? డీలిమిటేషన్‌లో తమిళనాడు సీట్లు తగ్గించబోమని హామీ ఎప్పుడిస్తారు? బీజేపీ ఏజెంట్‌గా వ్యవహరించే గవర్నర్ అరాచకం ఎప్పుడు అంతమవుతుంది? మదురై ఎయిమ్స్ నిర్మాణం ఎప్పుడు సాకారమవుతుంది? హోసూరు విమానాశ్రయం, కోయంబత్తూర్, మదురై మెట్రో ప్రాజెక్టులకు ఎప్పుడు ఆమోదం లభిస్తుంది? 'నీట్ మినహాయింపు' ఎప్పుడు అమల్లోకి వస్తుంది' అని నిలదీశారు. బీజేపీ పాలిత ఒడిశాలో ఇటీవల పాస్టర్‌పై జరిగిన దాడిని విజయన్ 'ఎక్స్'లో ప్రస్తావించారు. ఇది సంఘ్‌పరివార్ దేశంలో పెంచి పోషిస్తున్న హింసా విద్వేష వాతావరణానికి నిదర్శనమన్నారు. సీపీఎంతో అపవిత్ర పొత్తుతో కేరళను మత ప్రాతిపదికన విభజించాలని చూస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ఆరోపించారు.

పదే పదే అదే విషం!

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితులు, పెరిగిన ధరలతో రూ.5 వేలకు చేరింది. అంటే సగటున రూ.1,800 పెరిగింది. ఇందుకు కారణం కూడా జగనే. సీఎంగా ఉన్న ఐదేళ్లలో రాజధాని పనులను ఆపేశారు. అప్పుడు ఈ పనులన్నీ చేసి ఉంటే ఈ పాటికి సచివాలయం బ్లాకుల నిర్మాణం జరిగేది. అదనపు ఖర్చు భారం పడేదికాదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అఖిల భారత సర్వీసు అధికారుల నివాసాల కోసం పెద్ద ఎత్తున భవన నిర్మాణాలు చేపడుతున్నారు. జగన్ చెబుతున్న వ్యయం ఇక్కడా లేదు. ఇందులో కనిష్ఠంగా చదరపు అడుగుకు రూ.6,884 ఖర్చుచేయనున్నారు. గతంలో దీని అంచనా రూ.4,200. ఇవేవీ కనికట్టు లెక్కలు కావు. రాజధాని నిర్మాణ పనుల అధికారిక గణాంకాలు. మరి జగన్ చెబుతున్న ఖర్చు ఎక్కడ పెడుతున్నారు?

రుషికొండ ప్యాలెస్ ఖర్చు గుర్తుందా..?

ఆయన సీఎంగా ఉండగా విశాఖలోని రుషికొండపై రాజసౌధం నిర్మించుకున్నారు. అక్కడ రూ.450 కోట్లతో నిర్మాణం చేపట్టారు. ముందు టూరిజం రిసార్ట్ అని చెప్పి, చివరకు దానిని సీఎం క్యాంపు కార్యాలయంగా చేద్దామనుకున్న ఘనత ఆయనదే. రుషికొండ ప్యాలెస్‌ను ప్రభుత్వ ఖర్చుతోనే నిర్మించారు. సగటున ఒక్కో చదరపు అడుగు నిర్మాణానికి అయిన ఖర్చు రూ.15,293. ఆ ప్యాలెస్‌లో ఒక బాత్‌రూం ఇంటీరియర్ ఖర్చే రూ.16 లక్షలు. ఇంటీరియర్ టెండర్‌ను ఆయన తన సొంత మనుషులకు, బంధువులకు కట్టబెట్టిన ఉదంతమూ వెలుగులోకి వచ్చింది. అమరావతిలో కూడా అచ్చం ఇలాగే జరుగుతోందని ఆయన భ్రమపడి ఉంటారని అధికార వర్గాలు ఎద్దేవాచేస్తున్నాయి.

ఆ అధికారి మౌనముద్ర..

జగన్ ప్రభుత్వంలో రుషికొండ ప్యాలెస్ నిర్మాణం సమయంలో టూరిజం శాఖలో కీలక పోస్టులో ఉన్న అధికారే ఇప్పుడు సీఆర్‌డీఏలో ఉన్నారు. చట్టాలు, నిబంధనలు ఉల్లంఘించి ఆ ప్యాలెస్ ఎలా కట్టారు... ప్రజాధనం ఎంతలా దుర్వినియోగం చేశారో ఆ అధికారికి బాగా తెలుసు. ఇప్పుడు సీఆర్‌డీఏలో ఉన్న అదే అధికారి.. అమరావతి నిర్మాణంపై జగన్ చేసిన ఆరోపణలపై పల్లెత్తు మాటనలేరు. ప్రభుత్వానికి నిజాలు చెప్పలేరు. చెబితే గతం బయటకు వస్తుందన్న భయంతోనే ఆ అధికారి మౌనముద్రవహించారా? ఈ పరిణామం కూడా ప్రభుత్వ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

టెంట్ సిటీలు.. హోం స్టేలు

▸▸ మహాకుంభమేళాను తలపించేలా గోదావరి పుష్కరాలు

▸▸ సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళాను తలపించేలా గోదావరి పుష్కరాలు నిర్వహించాలని, ఇందుకు ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధం కావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అమరావతిలోని సచివాలయంలో శుక్రవారం గోదావరి పుష్కరాల పనులపై తొలి అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్కర ఏర్పాట్లపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకూ 12రోజుల పాటు గోదావరి పుష్కరాలు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రంలో గోదావరి నది ప్రవహించే 212 కిలోమీటర్ల పొడవునా పోలవరం, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో పుష్కర స్నానాలకు ఇబ్బంది లేకుండా చూడాలని స్పష్టం చేశారు. నిధుల కోసం ఇప్పటి నుంచే కేంద్రంతో సంప్రదింపులు జరపాలన్నారు. పుష్కరాలకు ఇంకా 18నెలల సమయమే ఉన్నందున, పనులు వెంటనే ప్రారంభించి వేగంగా కొనసాగించాలని సూచించారు. పుష్కర స్నానం ఆచరించేందుకు సుమారు 10 కోట్ల మంది యాత్రికులు, భక్తులు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో రద్దీకి తగ్గట్లు మౌలిక సదుపాయాలు, ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వసతికి సమస్య లేకుండా టెంట్ సిటీలు, హోం స్టేలు అందుబాటులోకి తేవాలన్నారు. ఘాట్లలో రద్దీని ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించేలా రూట్ మేనేజ్‌మెంట్‌ను రూపొందించాలన్నారు. ప్రస్తుతం ఉన్న ఘాట్ల సామర్థ్యాన్ని పెంచాల్సి ఉందన్నారు. వాహనాలు ఘాట్లవరకు రాకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందుకోసం ఏఐ ఆధారిత క్రౌడ్ మేనేజ్‌మెంట్‌ని, ఆర్టీజీఎస్ సేవలను వినియోగించుకోవాలన్నారు. భద్రతా చర్యలు, సేవల విషయంలో ఎక్కడా ప్రయత్నం లోపం ఉండకూడదని స్పష్టం చేశారు. భక్తులు వచ్చేందుకు వీలుగా రహదారులన్నీ అభివృద్ధి చేయాలని, పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి కావాలని ఆదేశించారు.



రాజమండ్రిలో మోడల్ ఘాట్

ప్రస్తుతం ఉన్న 234 స్నానఘాట్లతో పాటు కొత్తగా మరో 139 ఘాట్లను ఏర్పాటు చేస్తామని అధికారులు సీఎంకు వివరించారు. మొత్తం 373 ఘాట్లు 9,918 మీటర్ల పొడవున అభివృద్ధి చేసేలా ప్రణాళికలు వేసినట్లు తెలిపారు. రాజమండ్రిలో మోడల్ ఘాట్‌ను నిర్మించి, ఆ డిజైన్ల ఆధారంగా మిగిలిన ఘాట్ల నిర్మాణం చేపట్టాలని సీఎం సూచించారు. పుష్కరాలకు సన్నద్ధతగా ఈవెంట్లు నిర్వహించాలని చెప్పారు. ఇదే సమయంలో ఆరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన సీఎం.. అఖండ గోదావరి పేరుతో గోదావరి పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు పర్యాటక, చారిత్రక ప్రదేశాలకు ప్రాచుర్యం కల్పించాలన్నారు. యాత్రికులకు ఆతిథ్యం ఇచ్చేలా స్థానిక ప్రజల సహకారం తీసుకోవాలని చెప్పారు. జిల్లా, మండలంతో పాటు ప్రతి ఘాట్‌కు నోడల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. ఇటీవల జరిగిన మహాకుంభమేళాలో వినియోగించినట్లే ఏఐ టెక్నాలజీని గోదావరి పుష్కరాల్లో వినియోగించాలని సీఎం ఆదేశించారు. భాషిణి యాప్ ద్వారా అన్ని భాషల భక్తులకు సేవలు అందించాలన్నారు. పారిశుధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పుష్కరాలకు వచ్చే వారి కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని, కేంద్రంతో మాట్లాడి రైళ్లు, విమాన సర్వీసులు కూడా నడపాలన్నారు. పుష్కరాలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కనకదుర్గమ్మ దేవస్థానం వేద పండితులు సీఎంకు ఆశీర్వచనం అందించారు.

ట్యాపింగ్ ఎందుకు చేశారు?

▸▸ రూ.కోట్ల బాండ్లు ఎలా వచ్చాయి?

▸▸ కేటీఆర్‌ను ప్రశ్నించిన సిట్ అధికారులు




హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు కోట్లాది రూపాయల ఎలక్టోరల్ బాండ్లు ఎలా వచ్చాయి? పారిశ్రామికవేత్తలు, వ్యాపారుల ఫోన్లను ట్యాప్ చేసి.. వారి కాల్ రికార్డుల ఆధారంగా బెదిరించి పార్టీకి బాండ్లు వచ్చేలా చేశారా? ఎన్నికల సమయంలో వార్‌రూమ్స్ పేరిట ఫోన్ ట్యాపింగ్ ఎందుకు చేశారు? ప్రైవేటు వ్యక్తి అయిన చానల్ ఎండీ శ్రవణ్‌రావు ఆధ్వర్యంలో ఫోన్ ట్యాపింగ్ ఎలా చేస్తారు? అనధికారికంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడటం, ఆ సమాచారం ఆధారంగా లబ్ధి పొందడం నేరమవుతుందని తెలియదా? ట్యాపింగ్ చేయాలంటూ ఫోన్ నంబర్లు పంపిన పెద్దాయన కేసీఆరేనా? అంటూ సిట్ అధికారులు.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి శుక్రవారం విచారణకు హాజరైన కేటీఆర్‌ను వారు సుదీర్ఘంగా విచారించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6గంటల దాకా సుమారు ఏడు గంటలపాటు ప్రశ్నించారు. అవసరమైతే మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని చెప్పి పంపించివేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఫోన్ ట్యాపింగ్ ద్వారా తెలుసుకున్న విషయాలు, కాల్ రికార్డులను ఆధారంగా చేసుకుని, వాటిని ఆయుధంగా మలచుకుని పలువురు పారిశ్రామికవేత్తలను, సెలబ్రిటీలను బెదిరించి బీఆర్ఎస్ పార్టీకి కోట్లాది రూపాయల ఎలక్టోరల్ బాండ్లు తెప్పించుకున్నారన్న విషయాలపై సిట్ ఎక్కువగా ఫోకస్ చేసింది. గతంలో రాధాకిషన్‌రావు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కేటీఆర్‌ను సిట్ అధికారులు ప్రశ్నించారు. సీఎం కేసీఆరే పెద్దాయన కదా అంటూ కేటీఆర్‌ను సిట్ ప్రశ్నించినట్లు తెలిసింది. శుక్రవారం రాధాకిషన్‌రావును కూడా పిలిపించిన సిట్ అధికారులు.. ఆయనను, కేటీఆర్‌ను వేర్వేరుగా ఒకే ప్రశ్న అడిగారు. ఇద్దరి నుంచి పరస్పర విరుద్ధమైన సమాధానాలు వచ్చాయని, దీంతో మరలా ఆయా ప్రశ్నలకు సంబంధించి తమ వద్ద ఉన్న సాక్ష్యాధారాలతో కేటీఆర్‌ను ప్రశ్నించినట్లు సమాచారం. నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబసభ్యుల ఫోన్లనూ ట్యాపింగ్ చేయించారా? అని ప్రశ్నించినట్లు సమాచారం. చాలా ప్రశ్నలకు కేటీఆర్ తనకు తెలియదనే సమాధానమే ఇచ్చినట్లు తెలిసింది.

ఇరాన్ వైపు అమెరికా సేనలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. కానీ చివరి నిమిషంలో దాడిని వాయిదా వేశారు. కానీ కొన్ని రోజులుగా ట్రంప్, ఇరాన్ నేతల మధ్య మాటల యుద్ధం ముదిరింది. ఖమేనీ పాలనకు అంతం తప్పదని ట్రంప్ పేర్కొనడం, ఖమేనీ జోలికి వస్తే ట్రంప్‌ను చంపేస్తామని ఇరాన్ ఉన్నతాధికారులు ప్రకటించడం, తన జోలికి వస్తే ఇరాన్ అసలు భూమ్మీదే లేకుండా పోతుందని ట్రంప్ హెచ్చరించడం.. ఇలా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇలాంటి తరుణంలో ట్రంప్ కీలక ప్రకటన చేశారు. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక యుద్ధ నౌక సహా భారీ స్థాయిలో నౌకా దళం గల్ఫ్ వైపు ప్రయాణిస్తోందన్నారు. ఇరాన్‌లో పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. దావోస్ సదస్సు నుంచి అమెరికాకు తిరిగి వెళుతూ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ట్రంప్ మీడియాతో మాట్లాడారు. "పశ్చిమాసియా వైపు చాలా నౌకలు వెళుతున్నాయని మీకు తెలుసు. చాలా పెద్ద బలగం ఇరాన్ వైపు వెళుతోంది. అయితే దాన్ని వినియోగించాల్సిన అవసరం రాకపోవచ్చు" అని చెప్పారు. అమెరికా ఒత్తిడితోనే 837 మంది ఆందోళనకారులను ఉరితీయకుండా ఇరాన్ ఆపిందని పేర్కొన్నారు. కాగా, ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ మొవహెది ఖండించారు. ఆందోళనకారులను ఉరితీయాలన్న నిర్ణయమేదీ ప్రభుత్వం, న్యాయవ్యవస్థ తీసుకోలేదని, ట్రంప్ ఆరోపణలు అవాస్తవమని పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్ ఆందోళనల్లో మృతి చెందినవారి సంఖ్య 5 వేలు దాటిందని అమెరికాకు చెందిన హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది.



అబ్రహం లింకన్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్

వైమానిక దళమేదీ?

అమెరికాకు చెందిన భారీ విమాన వాహక యుద్ధ నౌక యూఎస్ఎస్ లింకన్, దానికి అనుబంధంగా ఉండే పలు యుద్ధ నౌకలు, ఒక జలాంతర్గామితో కూడిన బృందం రెండు, మూడు రోజుల క్రితమే.. దక్షిణ చైనా సముద్రం నుంచి గల్ఫ్ వైపు ప్రయాణం మొదలుపెట్టింది. ప్రస్తుతం ఆ నౌకలు హిందూ మహా సముద్ర ప్రాంతంలోకి ప్రవేశించాయి. ఒకట్రెండు రోజుల్లో పర్షియన్, గల్ఫ్ ప్రాంతానికి చేరుకోనున్నాయి. లింకన్ నౌకపై ఎఫ్-15ఈ, ఎఫ్-35సీ, ఎఫ్/ఏ -18 వంటి ఫైటర్లు సిద్ధంగా ఉన్నాయి. మరోవైపు వెనెజువెలా అధ్యక్షుడిని ఎత్తుకొచ్చే ముందు కరీబియన్ సముద్ర ప్రాంతంలో మోహరించిన బలగాల్లోని.. సీ-17 సైనిక రవాణా విమానాలు, పేట్రియాట్, థాడ్ క్షిపణి వ్యవస్థలు, ఆయుధాలను కూడా ఇరాన్ వైపు తరలిస్తున్నారు. అయితే ట్రంప్ ప్రకటించినట్టుగా భారీ స్థాయిలో బలగాల మోహరింపు ఏదీ కనబడటం లేదని రక్షణ రంగ విశ్లేషకులు శుక్రవారం పేర్కొన్నారు. తాము శాటిలైట్ చిత్రాలను పరిశీలించామన్నారు. ఇరాన్ చుట్టూ ఉన్న అమెరికా ఎయిర్‌బేస్‌లలో యుద్ధ విమానాల మోహరింపు పెద్దగా కనబడటం లేదని.. హిందూ మహా సముద్రంలోని డీయెగో గార్సియా స్థావరంలో మాత్రం బీ2 బాంబర్లు, యుద్ధ విమానాలు ఉన్నాయని ది వార్‌జోన్ వెబ్‌సైట్ పేర్కొంది. అయితే ఈ బలగాలు భారీ స్థాయి దాడికి సరిపోతాయా అన్నది ప్రశ్నార్థకమేనని వెల్లడించింది.

అమెరికా దయతోనే కెనడా మనుగడ: ట్రంప్

ఎవరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడలేదు: కార్నీ

వాషింగ్టన్, జనవరి 23: ప్రపంచవేదికపై అగ్రరాజ్యం అమెరికా, దాని పొరుగు దేశం కెనడాల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. అంతర్జాతీయ వేదికపై కెనడా ప్రధాని మార్క్ కార్నీ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్, తన ప్రతిష్ఠాత్మక 'శాంతి మండలి'లో చేరాల్సిందిగా కెనడాకు పంపిన ఆహ్వానాన్ని వెనక్కు తీసుకున్నారు. అంతకుముందు, దావోస్ వేదికగా జరిగిన అంతర్జాతీయ ఆర్థిక సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ.. అమెరికా అండ వల్లే కెనడా మనుగడ సాగిస్తోందన్నారు. ఆ విషయాన్ని కార్నీ గుర్తుంచుకోవాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలపై కెనడా ప్రధాని దీటుగా స్పందించారు. ఆయన క్యూబెక్ సిటీలో జరిగిన ఓ సమావేశంలో మాట్లాడుతూ.. 'మేము ఎవరి మీద ఆధారపడి బతకడం లేదు. స్వతంత్ర గుర్తింపుతోనే అభివృద్ధి చెందుతున్నాం" అని స్పష్టం చేశారు. ఇరుదేశాల మధ్య అద్భుతమైన భాగస్వామ్యం ఉందని అంటూనే, కెనడా సార్వభౌమత్వాన్ని తక్కువ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

డబ్ల్యూహెచ్‌వో నుంచి తప్పుకొన్న అమెరికా

వాషింగ్టన్, జనవరి 23: ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నుంచి అమెరికా గురువారం అధికారికంగా వైదొలిగింది. 1948లో ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థగా ప్రారంభమైనప్పటి నుంచి డబ్ల్యూహెచ్‌వోలో 78 ఏళ్లపాటు అమెరికా కీలక భాగస్వామిగా ఉంటూ వచ్చింది. ఈ సంస్థకు అత్యధిక విరాళాలు ఇచ్చే దేశం కూడా అమెరికానే. ఈ సంస్థ మొత్తం వార్షిక బడ్జెట్ 5.8 బిలియన్ డాలర్లు కాగా, అందులో దాదాపు పావు వంతు నిధులు అమెరికా ఒక్కటే అందిస్తోంది. డబ్ల్యూహెచ్‌వో నుంచి అమెరికా తప్పుకొంటున్నట్లు గతేడాది జనవరిలో ట్రంప్ ప్రకటించారు. ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై కూడా నాడే సంతకం చేశారు. డబ్ల్యూహెచ్‌వో రాజ్యాంగం ప్రకారం ఒకదేశం తన సభ్యత్వాన్ని రద్దుచేసుకోవాలంటే సంవత్సరం ముందుగా నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. అమెరికా నోటీసు ఇచ్చి ఏడాది పూర్తి కావటంతో గురువారం అధికారికంగా సంస్థ నుంచి బయటకు వచ్చింది. కాగా, సభ్యదేశాలు ఇచ్చే విరాళాలతోనే డబ్ల్యూహెచ్‌వో నడుస్తోంది. అయితే, అందరికంటే ఎక్కువ విరాళాలు ఇస్తున్న తమకు సంస్థలో తగిన గౌరవం లభించటంలేదని ట్రంప్ విమర్శించారు. సంస్థలో అవినీతి పెరిగిపోయిందన్నారు. అమెరికా వైదొలగటంతో డబ్ల్యూహెచ్‌వోకు నిధుల కటకట ఏర్పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఆ దేశం 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ సంస్థకు దాదాపు 130 మిలియన్ డాలర్లు బకాయి ఉంది. ఇకపై ఆ నిధులు కూడా వచ్చే అవకాశం లేదని సమాచారం. 2022-23లో అమెరికా మొత్తం 1.284 బిలియన్ డాలర్లు విరాళంగా ఇచ్చింది. సంస్థ అందుకున్న మొత్తం విరాళాల్లో ఇది దాదాపు 19 శాతం. 2024-25లో 958.5 మిలియన్ డాలర్లు ఇచ్చింది.



ఎగిరిపోయిన చిలుక

రామ్మా.. చిలుకమ్మా!

ఎగిరిపోయిన పెంపుడు చిలుక కోసం యజమాని ఆవేదన

కాట్రేనికోన, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మక్కువగా పెంచుకున్నారు.. మాటలు నేర్పారు.. చిలుక పలుకులు వింటూ మురిసిపోయారు.. మురిపెంగా పెంచుకుంటున్న ఆ చిలుక ఓ రోజు బైట ఎగిరిపోవడంతో యజమాని ఆవేదన వర్ణనాతీతమైంది. గ్రామంలోనే మరొకరి ఇంట్లో చిలుక బందీగా ఉందని తెలిసి ఆ ఆవేదన మరింత ఎక్కువైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన కొత్త పాలెం నివాసి బందారు దొరబాబు ఓ పక్షి ప్రేమికుడు. స్థానికంగా వస్త్రాల వ్యాపారం చేసే ఆయన రూ. 80,000 పెట్టి ఆఫ్రికన్ గ్రే పార్రెట్ జాతి చిలుకను కొని ప్రేమగా పెంచుకుంటున్నాడు. ఇటీవల ఆ చిలుక పంజరం నుంచి ఎగిరిపోయింది. చిలుక కోసం అన్వేషిస్తుండగా, తమ గ్రామంలోనే వేరొకరి ఇంట్లో ఉన్నట్టు సమాచారం వచ్చింది. ఆ ఇంటికి వెళ్లి చిలుకను ఇవ్వాలంటూ ప్రాధేయపడ్డా, కొంత నగదు సైతం ఇస్తానంటూ చెప్పినా ఆ ఇంటి యజమాని స్పందించడంలేదు. తమ వద్ద లేదంటూ ఆ ఇంటి యజమాని చెబుతున్నారు. దీంతో చేసేది లేక చిలుక యజమాని పోలీసులను ఆశ్రయించాలని నిర్ణయించుకున్నాడు.



నాగులగూడెం పొలాల్లో సీసీ కెమెరాకు చిక్కిన పులి

సీసీ కెమెరాకు చిక్కిన కదలికలు.. నాగులగూడెం పరిసరాల్లోనే సంచారం

బుట్టాయగూడెం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఏజెన్సీ వాసులకు నాలుగు రోజులుగా కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న పెద్దపులి కదలికలు అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాకు చిక్కాయి. బుట్టాయగూడెం మండలం నాగులగూడెం, అంతర్వేదిగూడెంలో గురువారం ఒక్క రోజే ఈ పులి ఐదు ఆవులను చంపేసింది. ఈ నేపథ్యంలో నాగులగూడెంలో రెండు ఆవులను చంపిన ప్రాంతంలో అటవీ శాఖ అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆవుల మృత కళేబరాల వద్దకు శుక్రవారం తెల్లవారుజామున పులి వచ్చి తింటున్న దృశ్యాలు ఈ కెమెరాలో రికార్డు అయ్యాయి. దీంతో పులి పాదముద్రల ఆధారంగా దాని ఆచూకీ కనిపెట్టేందుకు చుట్టుపక్కల ప్రాంతాల్లో అటవీ శాఖ అధికారులు శుక్రవారం గాలింపు చేపట్టారు. పశువులు ఉంటున్న పరిసర ప్రాంతాల్లోనే పులి సంచరిస్తున్నట్టు అనుమానిస్తున్నారు. పులి భయంతో రైతులు, కూలీలు పొలాలకు వెళ్లడం లేదు. దానిని త్వరగా బంధించాలని కోరుతున్నారు.

అభిషేక సేవలో జస్టిస్ గోపాలకృష్ణ



తిరుమల ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో జస్టిస్ గోపాలకృష్ణ

తిరుమల, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణ శుక్రవారం వేకువజామున అభిషేక సేవలో పాల్గొని తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

దక్షిణ కోస్తాలో చెదురుమదురు వర్షాలు

విశాఖపట్నం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం నుంచి వీస్తున్న తూర్పుగాలుల ప్రభావంతో శుక్రవారం తమిళనాడు, దానికి ఆనుకుని దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. మిగిలినచోట్ల పొడి వాతావరణం నెలకొంది. ఉత్తరకోస్తా, ఏజెన్సీ ప్రాంతాలు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఉదయం పది గంటల వరకు దట్టంగా మంచు కురిసింది. చలి తీవ్రత కొనసాగింది. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 6.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉత్తరకోస్తాలో పొగమంచు కురుస్తుందని, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు మూడు డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.

ఐటీఐ, డిప్లొమా అభ్యర్థులకు రష్యాలో ఉద్యోగాలు

- ప్రకటించిన నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఐటీఐ, డిప్లొమా కోర్సులు చేసినవారికి రష్యాలో షీట్ మెటల్ వర్కర్, ఫిట్టర్, మెషినిస్ట్, వెల్డర్ ఉద్యోగాకాశాలు కల్పిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.మనోహర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక సంవత్సరం ఒప్పందంతో ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నారని, తర్వాత ఒప్పందాన్ని పొడిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ ఉద్యోగాలతో అంతర్జాతీయ అనుభవం కూడా లభిస్తుందని తెలిపారు. నెలకు 60వేల రూబుళ్లు (సుమారు రూ.72వేలు) జీతం వస్తుందని, అదనంగా ఆహార భత్యం కింద మరో 10 వేల రూబుళ్లు ఇస్తారని తెలిపారు. ఉచిత వసతి కల్పిస్తారని, విమాన ప్రమాణ ఖర్చులు, తిరిగి వచ్చేటప్పుడు ప్రయాణ ఖర్చులు కంపెనీయే భరిస్తుందన్నారు. ఉచిత వైద్య బీమా సౌకర్యం కూడా ఉంటుందని వివరించారు. ఐటీఐ, డిప్లొమా అభ్యర్థులు 'ఏపీనైపుణ్యం' వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9988853335, 8712655686 నంబర్లలో సంప్రదించాలని మనోహర్ సూచించారు.

అడ్డగోలుగా నిధులు డ్రా చేస్తే వేటే

పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం ఆదేశం

పంచాయతీల ఖాతాలపై నిఘా

- 4 రకాల పనులకే ఆర్థిక సంఘం నిధుల ఖర్చు
- గ్రీన్ అంబాసిడర్ల జీతాలు, విద్యుత్ బిల్లులు పారిశుధ్యం, తాగునీటి పనులకే వాడాలని నిర్దేశం
- మార్చిలో ముగియనున్న సర్పంచ్‌ల పదవీకాలం
- ఎడాపెడా నిధులు డ్రా చేసేందుకు కొందరి ప్రయత్నాలు
- వైసీపీ సర్పంచ్‌ల గోల్‌మాల్‌కు అడ్డుకట్ట
- ప్రతిపైసా గ్రామాభివృద్ధికి, గ్రామీణ సౌకర్యాలకు అందేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ ఆదేశం

సాధారణ నిధులపైనా నిఘా



రాష్ట్రంలో వందకు పైగా గ్రామ పంచాయతీల్లో ఆర్థిక సంఘం నిధుల కంటే రాబడి ఎక్కువగా ఉంది. ఈ సాధారణ నిధులను విచ్చలవిడిగా ఖర్చు చేస్తుండటంతో పంచాయతీరాజ్ శాఖ దానిపై కూడా నిఘా పెట్టింది. బ్లీచింగ్, విద్యుత్ దీపాలు, ఇతర మెటీరియల్ కొనుగోలు విషయంలో పలు నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించింది. ఆడిట్ విషయంలో కూడా పంచాయతీలపై నిఘా పెట్టనుంది. మొక్కుబడిగా పంచాయతీల ఆడిట్ జరుగుతుండటంతో నిధుల వినియోగంపై చిత్తశుద్ధి లేకుండా పోయిందని అధికారులు గుర్తించారు. ఇక నుంచి ఆడిట్ విషయంలో నిఘా పెట్టాలని పంచాయతీరాజ్ శాఖ యోచిస్తోంది.

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల ఖాతాలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిఘా పెట్టింది. మార్చి నెలాఖరుకు సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుండటంతో 15వ ఆర్థిక సంఘం నిధులను అడ్డగోలుగా విడుదల చేయకుండా అధికారులు తాళం బిగించారు. నాలుగు రకాల పనులను మాత్రమే ఈ నిధులతో చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఏ పంచాయతీలోనైనా నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా చేస్తే ఆ పంచాయతీ కార్యదర్శికి శంకరగిరిమాన్యాలేనని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల ఖాతాల పట్ల అలర్ట్ పెరిగింది. గ్రీన్ అంబాసిడర్ల జీతాలు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, పారిశుధ్యం, అత్యవసర తాగునీటి పనులకే 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఈ నిధుల వాడకంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఉన్నతాధికారులు సూచించారు. గ్రామ పంచాయతీల్లో ప్రతిపైసా గ్రామాభివృద్ధికి, గ్రామీణ సౌకర్యాలకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. 10 వేలమంది పంచాయతీరాజ్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అదే రీతిలో వారి నుంచి పారదర్శక పాలన ఆశిస్తోంది. వివిధ దశల్లో పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులపై నిఘా పెట్టింది. ఎక్కడైనా ఉద్యోగులు గాడి తప్పితే వారిపై వేటుకు ఉపక్రమిస్తోంది. గతంలో ఓసారి స్వర్ణ పంచాయతీలకు సంబంధించి ఆస్తుల అసెస్‌మెంట్‌పై తప్పుడు ఫోన్ నంబర్లు లింక్ చేసినందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సీరియస్ అయ్యారు. ప్రతి జిల్లా నుంచి ఒకరిని సస్పెండ్ చేశారు.

టీడీపీ కేడర్ అప్రమత్తం

వైసీపీ హయాంలో నిర్వహించిన సర్పంచ్‌ల ఎన్నికల్లో ఎక్కువ మంది ఆ పార్టీకి చెందినవారే ఎన్నికయ్యారు. గ్రామాల్లో వారి పాలన పట్ల ఇప్పటికే టీడీపీ కేడర్ నిఘా వేసి అప్రమత్తంగా ఉంది. గ్రామ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం జరిగిన చోట్ల అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో పలు జిల్లాల్లో పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం పట్ల విచారణలు అధికమయ్యాయి. మార్చి నెలాఖరులోపు పంచాయతీల్లో ఉన్న నిధులను ఎలాగైనా వ్యయం చేసినట్లు చూపించి రికార్డులు సృష్టించే పనిలో సర్పంచ్‌లు ఉండగా.. టీడీపీ కార్యకర్తల ఫిర్యాదులతో పంచాయతీ కార్యదర్శులు అడ్డుకుంటున్నారు. కొన్ని చోట్ల టీడీపీకి సానుభూతిపరులుగా మారిపోయిన సర్పంచ్‌లు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారు. దీంతో పలు పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపడింది. వైసీపీ సర్పంచ్‌లు కొందరు పారిశుధ్యం పనులకు నిధులు ఖర్చు చేయడం పట్ల విముఖత వ్యక్తం చేయడంతో పంచాయతీ కార్యదర్శులే చొరవ తీసుకుని పారిశుధ్యానికి నిధులు వాడుతున్నారు. కొన్ని పంచాయతీల్లో రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న కార్యదర్శులు మరింత అప్రమత్తంగా ఉంటున్నారు. ఆఖరి రోజుల్లో పంచాయతీ నిధుల వ్యయంలో తేడాలొస్తే రిటైర్మెంట్ తర్వాత విచారణలు ఎదుర్కోవాల్సి వస్తుందని జాగ్రత్త పడుతున్నారు. అయితే కొంతమంది కార్యదర్శులు బరితెగించి పంచాయతీ ఖాతాల్లో నిధులను సర్పంచ్‌లతో కలిసి పంచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో పాత పనులకు సంబంధించినవాటికి ఎంబుక్‌లను చేసి ఇప్పుడు చెల్లింపులు చేయాలంటూ ముందుకు తీసుకొస్తున్నారు. తాగునీటి పనులకు సంబంధించి ఆర్థిక సంఘం నిధులు వాడుకోవచ్చని పంచాయతీరాజ్ శాఖ స్పష్టత ఇచ్చింది. దీంతో కొంత మంది సర్పంచ్‌లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలతో కుమ్మక్కై మోటార్లు కాలిపోకుండానే కాలిపోయినట్లు బిల్లులు పెట్టి నిధులు డ్రా చేసే ప్రయత్నాలు ప్రారంభించారు. దీనిపై కచ్చితమైన నిఘా లేకపోవడంతో నీటి సమస్యల పేరుతో నిధులను మంచినీళ్లలా ఖర్చు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రతిష్ఠాత్మక కంపెనీలతో విజ్ఞాన్ ఒప్పందాలు



బెంగళూరుకు చెందిన అమకే సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటున్న విజ్ఞాన్ ప్రతినిధులు

గుంటూరు(విద్య), జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఒక్క క్షణం అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం నిలిచిపోతే.. కమ్యూనికేషన్ వ్యవస్థ, బ్యాంకింగ్, రవాణా, వ్యవసాయం, చివరికి టీవీ చానల్స్ కూడా మూతపడతాయని డీఆర్‌డీవో మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక సలహాదారు డాక్టర్ జి.సతీశ్ రెడ్డి తెలిపారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్ సమ్మిట్-2026 రెండో రోజు శుక్రవారం ఘనంగా కొనసాగింది. ఈ సందర్భంగా సతీశ్ రెడ్డి మాట్లాడుతూ, సాధారణంగా అంతరిక్షం అనగానే ఇస్రో ప్రయోగాలు, ఉపగ్రహాల గురించి మాట్లాడుకుంటామని, కానీ రక్షణ రంగంలో దీని పాత్రను విస్మరించలేమన్నారు. నేటి కాలంలో దేశాల మధ్య ఉద్రిక్తతలు మొదలవ్వగానే.. మొదటగా నిర్దేశిత ప్రాంతాలపై నిఘా పెట్టేందుకు ప్రత్యేక ఉపగ్రహాలను ప్రయోగిస్తారని తెలిపారు. సమ్మిట్‌లో భాగంగా విజ్ఞాన్ యూనివర్సిటీతో దేశంలోని పలు ప్రతిష్ఠాత్మక కంపెనీలు అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో అనంత్ టెక్నాలజీస్ సీఎండీ డాక్టర్ పావులూరి సుబ్బారావు, ఏపీ స్పేస్ సిటీ సీఈవో కేశినేని వెంకటేశ్వర్లు, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి ప్రాణం తీసిన జింక బొమ్మ!

- ఆడుకుంటుండగా పైన పడి.. ఏడేళ్ల చిన్నారి మృతి
- కోనసీమ జిల్లా గంటిపెదపూడి పాఠశాలలో ఘటన



జాహ్నవి



ప్రమాదానికి కారణమైన జింక బొమ్మ

పి.గన్నవరం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ఆ విద్యార్థిని స్నేహితులతో కలిసి సరదాగా ఆడుకుంటోంది! స్కూల్ ఆవరణలో సిమెంట్‌తో తయారుచేసిన ఓ జింక బొమ్మపై ఎక్కి ఆడుకుని, దిగే సమయంలో ప్రమాదవశాత్తూ ఆ బొమ్మ పైన పడడంతో పాప మృత్యువాత పడింది. ఈ విషాదకర ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం గంటి పెదపూడి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మాచవరం గ్రామానికి చెందిన దివి దుర్గాప్రసాద్, సుజాతకు జాహ్నవి, తేజశ్రీ ఇద్దరు కుమార్తెలు. దంపతులు ఉపాధి నిమిత్తం విజయవాడలో ఉంటూ, కుమార్తెలను గంటిపెదపూడిలో అమ్మమ్మ వద్ద ఉంచి చదివిస్తున్నారు. రోజూ లాగే జాహ్నవి, తేజశ్రీ శుక్రవారం పాఠశాలకు వెళ్లారు. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం రెండో తరగతి చదువుతున్న జాహ్నవి (7) తోటి విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో ఉన్న జింక బొమ్మపై ఎక్కి ఆడుకుంటోంది. జింక బొమ్మపై ఊగుతూ.. దిగే సమయంలో ఆ బొమ్మ పైన పడడంతో జాహ్నవి స్పృహ తప్పింది. దీంతో ఉపాధ్యాయులు 108లో కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. పాప అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో తన మనువరాలు ఆడుకుంటూనే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయిందని అమ్మమ్మ బోరున విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సత్యదేవుడి ప్రసాదంపై ఎలుకల విహారం!

- అన్నవరంలోని ప్రసాద విక్రయ కేంద్రంలో మూషికాలు
- వీడియో తీసిన భక్తులు.. సిబ్బందిపై చర్యలు



అన్నవరం సత్యదేవుడి ప్రసాదం విక్రయ కేంద్రంలో ఎలుకలు

అన్నవరం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భక్తులు ఎంతో పవిత్రంగా భావించే అన్నవరం సత్యదేవుని ప్రసాదంపై ఎలుకలు తిరుగాడటం కలకలం రేపింది. సాక్షాత్తూ ప్రసాద విక్రయ కేంద్రంలో కళ్లెదురుగా ఎలుకలు ఇష్టారీతిన తిరుగుతున్నా సిబ్బంది ఉదాసీనంగా వ్యవహరించారు. ఈ విషయాన్ని ప్రశ్నించిన భక్తులకు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. ఈ వ్యవహారాన్ని వారు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. దీంతో ఆలయ ఈవో త్రినాథరావు తక్షణం చర్యలకు ఆదేశించారు. పాత నమూనాలయం వద్ద పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులను విధుల నుంచి తాత్కాలికంగా తొలగించాలని ఆదేశించారు.



అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం డీడీలు అందజేస్తున్న పీఎల్ రాజు కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి రాజగోపాలరాజు

టీటీడీ ట్రస్టులకు రూ.2.5 కోట్ల విరాళం

తిరుమల, జనవరి 23(ఆంధ్రజ్యోతి): టీటీడీ ట్రస్టులకు శుక్రవారం రూ.2.50 కోట్లు విరాళంగా అందింది. హైదరాబాద్‌కు చెందిన పీఎల్ రాజు కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ సంస్థ ఈ విరాళాన్ని ఇచ్చింది. ఆ సంస్థ ప్రతినిధి రాజగోపాలరాజు శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం డీడీలను అందజేశారు. ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.75 లక్షలు, విద్యాదానం ట్రస్టుకు రూ.75 లక్షలు, బర్డ్ ట్రస్టుకు రూ.50 లక్షలు, ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.25 లక్షలు, గోసంరక్షణ ట్రస్టుకు రూ.25 లక్షలు వినియోగించాలని టీటీడీని కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

గోరీలదిబ్బపై కొత్త గాజా!

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, పశ్చిమాసియా సలహాదారుగా ఉన్న అల్లుడు జరాడ్ కుష్నర్ ఆరంభించిన ఆ భారీ రియలెస్టేట్ ప్రాజెక్టులో పాలుపంచుకోవాలా వద్దా అని కొన్ని దేశాలు ఇంకా మల్లగుల్లాలు పడుతున్నాయి. మామ కలల ప్రాజెక్టును ఎంతవేగంగా సాకారం చేయబోతున్నానో వ్యాపారవేత్త అయిన ఈ అల్లుడుగారు గురువారం ఇచ్చిన ప్రదర్శన చూసినవారికి కళ్ళు చెదిరిపోయాయి. శవాలదిబ్బమీద కట్టబోతున్న ఆ ఆకాశహర్మ్యాలను, బాంబర్లు భస్మీపటలం చేసిన ఇళ్ళూ ఆస్పత్రుల స్థానంలో పుట్టుకొచ్చే బడా ఇండస్ట్రియల్ కాంప్లెక్సులను ఆయన చిత్రాలు కళ్ళకుకడుతున్నాయి. గాజాను సమూలంగా పెకిలించివేసి, మనిషన్నవాడిని లేకుండా చేసి దానిని ఓ అంతర్జాతీయస్థాయి రిసార్టుగా మార్చేయాలన్న మామ అలనాటి ఆకాంక్ష నెరవేర్చడానికి కుష్నర్ యుద్ధ సన్నద్ధతతో ఉన్నాడు. అది తమ సొంత ఆస్తిలాగా, ఏదో వారసత్వంగా వచ్చిన ఓ పాతకొంప కూల్చుకొని స్వస్థలంలో కొత్త భవనం కట్టుకుంటున్నట్టుగా వీరిద్దరూ ఆవిష్కరించిన ఆ ప్రాజెక్టుకు అస్మదీయులంతా జేజేలు పలుకుతున్నారు. ఊపిరితీసినవారే ఉద్ధారకులుగా అవతరించి, తాము వల్లకాడుగా మార్చిన దానిని భూతలస్వర్గంగా తీర్చిదిద్దుతామంటూ శాంతిని పైపూతగా వాడుతున్నారు.

బోర్డ్ ఆఫ్ పీస్ తొలి సమావేశంలో కుష్నర్ ప్రదర్శించిన ఈ రోడ్‌మ్యాప్ ట్రంప్ మనసు దోచుకుంది. ఏవో రెండు వాక్యాలు మర్యాదగా అన బోయాడు కానీ, ఆ చిత్రాలు చూడగానే ఆయనలో ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారి బయటకు వచ్చేశాడు. అద్భుతం, మహాద్భుతం, బ్యూటిఫుల్ పీస్ ఆఫ్ ప్రాపర్టీ..పక్కనే ఆ సముద్రం ఓహ్.. ఎంత అందంగా ఉందో అంటూ పరవశుడైపోయాడు. ఇప్పుడంటే ఆప్తమిత్రుడు కాకపోవచ్చును కానీ, ట్రంప్ మనసెరిగిన ఎలాన్‌మస్క్ అందుకే డావోస్‌లోనే ట్రంప్ ప్రవచిస్తున్నది శాంతిలో 'పీస్' కాదని, ప్రాపర్టీలో 'పీస్' అని వెంటనే జోకేశాడు. ఇంతకంటే అన్యాయం ఉంటుందా, గాజావాసులను ఊచకోతకోయడమే కాక, దాని చారిత్రక, సాంస్కృతిక మూలాలు కూడా చెరిపివేసి, ఆ మానవ నివాసాన్ని ఒక పారిశ్రామికవాడలాగా, పర్యాటకస్థలంలాగా మార్చివేస్తున్న ఈ అమానుషకార్యానికి ప్రపంచదేశాలు తలూపడం సరైనదేనా అంటూ కొందరు ఛాందసులు ఇంకా ఏదో మిగిలివున్నట్టుగా తెగ బాధపడిపోతున్నారు. తమ సొంతభూమిలో చవుకకార్మికులుగా మారబోతున్న పాలస్తీనియన్లు ఈ ఆకాశహర్మ్యాల్లో ఉండబోరనీ, గోడలకు ఆవల, గేట్ల వెనుక బతుకీడుస్తారన్నది నిజం. పునర్నిర్మాణంకోసం రాళ్ళెత్తిన ఈ కూలీలూ రాబోయే తరాలూ దురాక్రమణదారులకు సేవకులుగా తరించడం వినా చేయగలిగేదేమీ లేదు. తమది కాకుండా పోయినచోట ఆ స్వస్థలంలో నిరంతర నిఘాలో వెలివాడకు పరిమితం కావాల్సిందే.

ఐక్యరాజ్యసమితి పర్యవేక్షణ, భాగస్వామ్యం ఇత్యాది చాదస్తపు ఆలోచనలు పొరపాటున కూడా ఎవరి మనసులోకీ రాకుండా ఉండేందుకు ట్రంప్ ఆ అంతర్జాతీయ వేదిక చచ్చుదీ, పుచ్చుదీ, చేతకానిదీ అని ఢంకా బజాయించారు. సదరు సంస్థ ఏదో చేయాలని అనుకుంటూ, ఏమీ చేయకుండా ప్రపంచానికి ఓ భారంగా పరిణమించిందనీ, దాని బదులు ఎనిమిది యుద్ధాలు ఆపిన తన మార్గదర్శకత్వంలో నడవడం యావత్ ప్రపంచానికి క్షేమకరమని ఆయన ఉపన్యాసం సారాంశం. రెండో ప్రపంచయుద్ధం తరువాత మానవజాతికి కాస్తంత జ్ఞానం కలిగి ఏర్పాటు చేసుకున్న ఈ సమష్టివేదికమీద తనకున్న ఆగ్రహాన్ని, ఏవగింపునూ ఈ ప్రసంగంలో పూర్తిగా దట్టించారాయన. సమితికి చిల్లిగవ్వ ఇవ్వకుండా, ముప్పైఒక్క విభాగాలనుంచి తనదేశాన్ని ఉపసంహరించుకున్న ట్రంప్, దానిని పూర్తిగా తుడిచిపెట్టేసి, ఆ స్థానంలో కూర్చోవాలనుకుంటున్నారు. ఆయనకు అంతర్జాతీయ చట్టాలంటే చిన్నచూపు. ఏడాదిలో ఏడుదేశాలమీద బాంబులు వేసి కూడా తనకు నోబెల్‌శాంతి ఎందుకు ఇవ్వలేదని నార్వేను బెదిరించగలడు. అది ఇవ్వనందుకు శాంతి అంటేనే విరక్తి కలిగిందనీ, గ్రీన్‌ల్యాండ్‌ను లాక్కుంటానని నాటోను వొణికించగలడు. చివరకు తూచ్ అనేసి, భయపడ్డారు కదూ...బలే బలే అంటూ ఆప్తమిత్రులనే అవమానించగలడు. ప్రపంచపెద్దగా, సమస్యల పరిష్కర్తగా, తీర్పరిగా ఉండాలనుకుంటున్న తన పక్షాన ఎవరెవరున్నారో ఈ గాజా తొలి అడుగులో ఆయన పరీక్షిస్తున్నాడు. పీస్ బోర్డు సభ్యులుగా ఉన్నవారిలో అత్యధికులు ఆయన బంధుజనం, పెట్టుబడిదారులు, పార్టీ విరాళాల దాతలు, వందిమాగధులే. విలువలతో మనకు పనేమిటని అనుకున్నవారు బిలియన్ డాలర్ల ఖరీదైన సభ్యత్వం కొనుక్కొని ఆయన ఔదార్యానికి పాత్రులు కావచ్చు.

పనగారియా సలహాలను పాలకులు పాటిస్తారా?

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆత్మీయంగా అభిమానించే ఆర్థికవేత్త ప్రొఫెసర్ అరవింద్ పనగారియా. ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో ఇరువురి మధ్య భావ సమైక్యత ఉన్నది. ప్రొఫెసర్ పనగారియా నీతి ఆయోగ్‌కు మొదటి ఛైర్మన్ (జనవరి 2015–ఆగస్టు 2017). భారత్ తరఫున జీ–20 షెర్పా (2015–17)గా కూడా ఆయన వ్యవహరించారు. ఏప్రిల్ 2023లో నలందా విశ్వవిద్యాలయం ఛాన్సలర్‌గా ఆయన నియమితులయ్యారు. డిసెంబర్ 2023లో 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం నియమించిన అనేక టాస్క్‌ఫోర్స్‌లకు పనగారియా నేతృత్వం వహించారు. ఎన్డీఏ ప్రభుత్వంలో పనగారియా సుదీర్ఘకాలం వివిధ పదవులు నిర్వహించడం విశేష ప్రాధాన్యమున్న విషయం. డాక్టర్ పనగారియా కొలంబియా విశ్వవిద్యాలయంలో శాశ్వత ఆచార్యుడు. తన మెంటార్ డాక్టర్ జగదీశ్ భగవతి వలే పనగారియా కూడా స్వేచ్ఛా వాణిజ్యవాది. స్వేచ్ఛా వాణిజ్యం, మూలధన ప్రవాహాలను అనుమతించే బహిరంగ ఆర్థిక వ్యవస్థలను ఎటువంటి మినహాయింపులు లేకుండా ఇరువురూ సమర్థిస్తారు. ఇందుకు వారిపట్ల నాకు ఎంతో గౌరవ భావమున్నది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

డాక్టర్ పనగారియా ఇటీవల ఒక వ్యాసంలో ప్రభుత్వాన్ని ఇలా అభినందించారు: '2025వ సంవత్సరం చరిత్రలో ఆర్థిక సంస్కరణల సంవత్సరంగా నిలిచిపోతుంది'. అది నిజం కాదని పనగారియాకు బాగా తెలుసు. 2025లో చాలా స్వల్ప సంస్కరణలు మాత్రమే జరిగాయి. మీడియా కథనాలు, పార్లమెంటరీ చర్చలను పరిశీలిస్తే 2025 సంవత్సరంలో 'ఆర్థిక సంస్కరణలు'గా చెప్పదగినవి ఏవీ అమలు కాలేదని స్పష్టమవుతుంది. వస్తుసేవల పన్ను రేట్ల సరళీకరణ, తగ్గింపు– జూలై 2017లో చేసిన అసలు పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవడమే; కస్టమ్స్ సుంకాల హేతుబద్ధీకరణ కూడా దేశీయ పరిశ్రమల సంరక్షణ చర్యల కింద ఆ సుంకాలను పెద్ద ఎత్తున పెంచడం, అలాగే యాంటీ–డంపింగ్, భద్రతా సుంకాలను పెంచుతూ తీసుకున్న నిర్ణయాలను సరిదిద్దుకోవడమే; కార్మిక చట్టాలను పటిష్ఠపరచడం ఇప్పటికే బాగా ప్రయోజనం పొందుతున్న పెట్టుబడిదారులకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయమే. నోరు తిరగని పేరు (వీబీ–జీ–రామ్–జీ) మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో ప్రవేశపెట్టిన కొత్త ఉపాధి చట్టం ప్రపంచ అతిపెద్ద ఉపాధి–సంక్షేమ పథకాన్ని కూల్చివేసింది. ప్రొఫెసర్ పనగారియా మీద పరిపూర్ణ గౌరవంతోనే గణనీయమైన ఆర్థిక సంస్కరణల సంవత్సరంగా 2025 చరిత్ర కెక్కదని నేను గట్టిగా భావిస్తున్నాను. నిజానికి 2026లో ప్రభుత్వం విధిగా ఆరు చర్యలు చేపట్టాలని పనగారియా సిఫారసు చేశారు. అవి, ఆర్థిక సంస్కరణలను ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రభుత్వానికి ఆయన ఇచ్చిన సలహాలు అనడంలో సందేహం లేదు.



ప్రొఫెసర్ అరవింద్ పనగారియా ఇటీవల రాసిన ఒక వ్యాసం, 2026–27 కేంద్ర బడ్జెట్ నుంచి మనం ఏమి ఆశించవచ్చో సూచిస్తోంది. పనగారియా సిఫారసులను మోదీ ప్రభుత్వం ఆమోదిస్తే నేను అమితంగా సంతోషిస్తాను. ఒక భద్ర భవిష్యత్తుకు భారత్ ఇంకా చాలా దూరం ప్రయాణించవలసి ఉన్నది. ఇది మనం సదా జ్ఞాపకం ఉంచుకోవల్సిన వాస్తవం.

ఆ ఆరు సిఫారసులు ఏమిటో చూద్దాం: కస్టమ్స్ సుంకాలను వెనక్కి తీసుకోవడం. దిగుమతి సుంకాలను తగ్గించడం లేదా తొలగించాలని పనగారియా నిష్కర్షగా చెప్పారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే దిగుమతులకు వర్తించే సగటు టారిఫ్ రేటును తగ్గించి తీరాలి. ప్రతి సుంకాన్ని నిర్దిష్ట శ్రేణి సరుకుల వాస్తవ పరిమాణం లేదా వాటి వాస్తవ వాణిజ్య విలువ ప్రాతిపదికన లెక్కించాలి. ఈ మేరకు అన్ని సరుకులపై సుంకాన్ని 6.34శాతానికి యూపీఏ ప్రభుత్వమే తగ్గించింది. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ఈ సగటు దిగుమతి సుంకం దాదాపు 12 శాతానికి పెరిగింది. అన్ని రకాల దిగుమతులపై ఏకరీతిగా 7శాతం సుంకాన్ని విధించాలని పనగారియా సిఫారసు చేశారు.

నాణ్యత నియంత్రణ ఉత్తర్వుల (క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్స్– క్యూసీఓ) ఉపసంహరణ పూర్తి చేయాలి అన్నది రెండో సిఫారసు. ఇవి దిగుమతులకు సుంకాలేతర అవరోధాలు. అవే నాణ్యతా ప్రమాణాలను భారతీయ ఉత్పత్తులకు కూడా వర్తింపజేస్తే మన ఉత్పత్తులు ఎన్ని నిలుస్తాయి? 2025లో 22 క్యూసీఓలను ఉపసంహరించినందుకు ప్రభుత్వాన్ని పనగారియా అభినందించారు. అయితే ఈ 22 క్యూసీఓలను మొదట ఉపసంహరించింది ఎవరు?; వాణిజ్య ఒప్పందాల గురించి ప్రస్తావిస్తూ 'దిగుమతుల సరళీకరణను మనం స్వతస్సిద్ధంగా ప్రతిఘటిస్తున్నామని' పనగారియా వ్యాఖ్యానించారు. 'మనం' అంటే ఎవరు? ఎన్డీఏ ప్రభుత్వమే కాదూ? రెండు దశాబ్దాల దిగుమతి సరళీకరణ విధానాన్ని వ్యతిరేకించింది. విదేశీ వాణిజ్య విధానాన్ని కఠినం చేసింది. 2018లో సీపీటీపీపీపై సంతకం చేసేందుకు అందిన ఆహ్వానాన్ని ఆమోదించలేదు. 2019లో ఆర్‌సీఈపీ నుంచి ఉపసంహరించుకున్నది. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల పట్ల విముఖత చూపింది; డీజీటీఆర్ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమెడీస్)ను సంయమనపరచాలని పనగారియా సిఫారసు చేశారు. ప్రపంచ సరుకుల వాణిజ్యంలో భారత్ వాటా కేవలం 2.8 శాతం మాత్రమే. అయినా వివిధ సరుకులపై మన దేశం 250 యాంటీ డంపింగ్ సుంకాలు విధించింది.

రూపాయి విలువను అధికం చేయవద్దని పనగారియా సిఫారసు చేశారు. మారకం రేటు చాలా సున్నితమైన అంశం. విదేశీ మారక ద్రవ్యం ప్రవాహం, ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు మొదలైన విషయాలతో అది ప్రభావితమవుతుంది. అధిక విలువ రూపాయి ఎగుమతులను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. కనుక రూపాయి విలువ విషయాన్ని మార్కెట్‌కు వదిలివేయడం మంచిది; ఎగుమతుల పర్యవేక్షణకు విధానపరమైన సవాళ్లు ఎదురవుతున్నాయి. సవాలక్ష నిబంధనలు, ఆదేశాలు, వాణిజ్య మంత్రిత్వ శాఖకు దరఖాస్తుల వ్యవహారం, అనుమతులు సాధించడం మొదలైనవి ఎగుమతులకు ప్రతిబంధకమవుతున్నాయి.

16వ ఆర్థిక సంఘం ఛైర్మన్‌గా అరవింద్ పనగారియా విధాన వైఖరి 2026–27 కేంద్ర బడ్జెట్‌కు కీలకమైనది. రాబోయే కొత్త బడ్జెట్ నుంచి మనం ఏమి ఆశించవచ్చో పనగారియా వ్యాసం సూచిస్తోంది. అలాగే ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం నిర్వహిస్తోన్న తీరు తెన్నుల పట్ల ఆయన అసంతృప్తిని ఆ వ్యాసం వ్యక్తం చేసిందని కూడా భావించవచ్చు. ఆయన సిఫారసులను మోదీ ప్రభుత్వం ఆమోదిస్తే నేను అమితంగా సంతోషిస్తాను. పనగారియాను అభినందిస్తాను. ఆయన సిఫారసుల అమలు తరువాత తీసుకోవల్సిన ఆరు లేదా అరవై చర్యలను సైతం సూచించాలని ఆయనకు విజ్ఞప్తి చేస్తాను. ఒక భద్ర భవిష్యత్తుకు భారత్ ఇంకా చాలా దూరం ప్రయాణించవలసి ఉన్నది. ఇది మనం సదా జ్ఞాపకం ఉంచుకోవల్సిన వాస్తవం.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

అరుణ హరితం నియోగి జీవితం

స్వతంత్ర భారతదేశ చరిత్రలో పలువురు ప్రముఖ రాజకీయవేత్తల జీవితాలు హింసాత్మక మరణాలతో ముగిశాయి. తన తుది అరవైలలో ఇందిరాగాంధీ, తన నడిమి నలభైలలో రాజీవ్‌గాంధీ, తన మధ్య యాభైలలో ప్రమోద్ మహాజన్ దురంతాల పాలయ్యారు. సంజయ్‌గాంధీ, రాజేశ్ పైలట్, మాధవరావు సింధియా, వైఎస్ రాజశేఖరరెడ్డి జీవితాలు విమాన లేదా రోడ్డు ప్రమాదాలలో అర్థంతరంగా ముగిశాయి. ఈ దురదృష్ట నాయకులు మరో ఇరవై సంవత్సరాలు జీవించి ఉన్న పక్షంలో వారి రాజకీయ జీవితాలు ఎటువంటి మలుపు తిరిగి ఉండేవో కదా!

ఈ ప్రస్తావిత రాజకీయ నాయకుల మరణాల కంటే, మన వ్యవస్థలోని దౌష్ట్యానికి అకాల మరణం పాలైన మౌలిక చింతనాశీలి, కార్మిక సంఘనాయకుడు శంకర్ గుహ నియోగి మృతితో భారతదేశానికి ఎక్కువ నష్టం వాటిల్లిందని నేను గట్టిగా అభిప్రాయపడుతున్నాను. నియోగి మరణం మన దేశంలో పౌర సమాజ ఉద్యమానికి చావుదెబ్బ అయింది. బహుశా, అది ఆ విఘాతం నుంచి ఇప్పటికీ కోలుకోనే లేదు.



■ రామచంద్ర గుహ

నియోగి 1991లో 48 ఏళ్ల వయసులో పెట్టుబడిదారుల కిరాయి గూండాల కిరాతకానికి బలయ్యారు. కార్మికుల్లో ఆత్మగౌరవాన్ని మేల్కొలిపి, తమ యజమానుల వలే తామూ ఈ దేశ సమాన పౌరులమనే చైతన్యాన్ని వారిలో రగుల్కొలిపిన నియోగి ఉనికిని ఆ ధనస్వాములు భరించలేకపోయారు. తమకు అడ్డుగా ఉన్న నియోగిని క్రూరంగా తొలగించుకున్నారు.

గతంలో నేను ఇదే కాలమ్‌లో నియోగి గురించి రాశాను. అయినా మళ్లీ రాసి తీరాల్సిన సందర్భమిది. సామాజిక శాస్త్రవేత్త రాధికా కృష్ణన్ పుస్తకం 'Shankar Guha Niyogi : A Politics in Red and Green' వెలువడిన తరుణమిది. నియోగి పోరాట, త్యాగమయ జీవితం, ఇప్పటికీ ఆయన కృషి ప్రాధాన్యం ఏమిటో స్ఫూర్తిదాయకంగా రాధిక తన పుస్తకంలో వివరించారు.


> అట్టడుగు వర్గాల క్రియాశీలతకు స్ఫూర్తినిచ్చిన ఉదాత్తుడు శంకర్ గుహ నియోగి. పర్యావరణవాదాన్ని కార్మిక హక్కులతో అనుసంధానించిన కర్మయోగి. ఆయన జీవిత కృషి వర్తమాన భారతదేశానికి సందర్భోచితమైనది. ఆయన వలే స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం విలువలు మూర్తీభవించిన వ్యక్తులు మన రిపబ్లిక్ చరిత్రలో చాలా చాలా తక్కువ మంది ఉన్నారు.

1943లో ఒక బెంగాలీ కుటుంబంలో జన్మించిన నియోగి 19 ఏళ్ల వయసులో భిలాయి ఉక్కు కర్మాగారంలో కార్మికుడుగా జీవితాన్ని ప్రారంభించారు. ఆధునికత దిశగా భారతదేశ ప్రస్థానాన్ని వేగవంతం చేసిన ఆ సంస్థ ఉద్యోగం నుంచి చాలా త్వరగానే వైదొలిగి ప్రజాహిత క్రియాశీలతలో నియోగి నిమగ్నమయ్యారు. ఒక ఆదివాసీ మహిళను వివాహం చేసుకున్నారు. మైనింగ్ కార్మికులను సంఘటితం చేయడం ప్రారంభించారు. పర్యావరణ సుస్థిరత సంబంధిత విషయాలలో కూడా ఆయన మొదటి నుంచీ శ్రద్ధ చూపుతూ వచ్చారు. వ్యాపార, పారిశ్రామికవర్గాల ప్రయోజనాల పరిపూర్తికి కాకుండా స్థానిక రైతులు, ఆదివాసుల సంక్షేమానికి దోహదం చేసేలా అటవీ, జల విధానాలను రూపొందించాలని ప్రభుత్వాన్ని నియోగి కోరారు.

1977లో 'ఛత్తీస్‌గఢ్ మైన్స్ శ్రామిక్ సంఘ్' (సీఎమ్ఎస్ఎస్) వ్యవస్థాపనకు నియోగి తోడ్పడ్డారు. రెండు సంవత్సరాల అనంతరం మరింత విశాల కార్యక్రమం ప్రాతిపదికన 'ఛత్తీస్‌గఢ్ ముక్తి మోర్చా' (సీఎమ్ఎమ్) ఉనికిలోకి రావడంలో ఆయన ప్రత్యేక కృషి చేశారు. కార్మిక సంఘం సీఎమ్ఎస్ఎస్‌తో పాటు సీఎమ్ఎమ్‌లో మహిళా, యువజన, సాంస్కృతిక విభాగాలు కూడా ఉన్నాయి. గని కార్మికుల ఆర్థిక సహకారంతో ఆరోగ్య భద్రతలో ఒక పథ నిర్దేశక ఆస్పత్రిని కూడా సీఎమ్ఎమ్ నిర్వహించింది. నియోగి మరణం నాటి నుంచీ సీఎమ్ఎమ్, సీఎమ్ఎస్ఎస్ రెండూ కూడా కార్మిక హక్కుల సాధన, సామాజిక న్యాయం, పర్యావరణ సుస్థిరతకు కృషి చేస్తున్నాయి. ఆదర్శవాదులైన మధ్యతరగతి భారతీయ యువజనులు తమ లాభదాయక వృత్తి జీవితాలకు స్వస్తి చెప్పి, శ్రామిక జనావళి సంక్షేమం కోసం నియోగితో చేతులు కలిపి, ఆయన సంస్థల్లో పనిచేశారు. నియోగి బాటలో నడిచిన ప్రముఖులలో వెల్లూరులోని ప్రతిష్ఠాత్మక క్రిస్టియన్ మెడికల్ కాలేజీ పట్టభద్రుడు డాక్టర్ వినాయక్ సేన్, కాన్పూరు ఐఐటీ విద్యార్థికురాలు సుధా భరద్వాజ్ తదితరులు ఉన్నారు.

నియోగి సీఎమ్ఎమ్ సంప్రదాయక కార్మిక సంఘాల వలే వేతన పెరుగుదల, సరైన పని పరిస్థితులు, సెలవు దినాలు, పీఎఫ్ సదుపాయాలు మొదలైన అంశాలకే పరిమితం కాకుండా ఒక కొత్త మార్గంలో పయనించింది. కార్మికుల వృత్తి సంబంధ ఆరోగ్య భద్రతకు విశేష కృషి చేసింది. నియోగి మౌలిక చింతకుడు. అయితే నిత్యం పోరాటాలలో నిమగ్నమయి ఉండవలసి రావడంతో అరుదుగా మాత్రమే తన భావాలకు లిఖిత రూపమిచ్చేవారు. 'హమారా పర్యావరణ్' అనే వ్యాసం సుప్రసిద్ధమైనది. వాయు, జల కాలుష్యాలు, నేల క్రమ క్షయం మొదలైనవి మానవ జీవితాలకు, జీవనాధారాలకు చాలా హాని కలిగిస్తున్నాయని, లాభార్జనే లక్ష్యంగా పనిచేస్తున్న పారిశ్రామికవేత్తలే ఆ నష్టాలకు ప్రధాన కారకులని సీఎమ్ఎమ్ డాక్యుమెంట్లలో స్పష్టంగా ఉందని రాధికా కృష్ణన్ తన పుస్తకంలో వివరించారు.

భారతదేశ పరిస్థితులకు సరిపడే ఉత్పత్తి సంబంధిత సాంకేతికతల విషయంలో నియోగి విశేష శ్రద్ధాసక్తులు చూపేవారు. ఐరోపా, అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్న భారీ యంత్రాలు సమాజంలో వర్గం,



జెండర్ ప్రాతిపదికన అసమానతలు సృష్టిస్తాయని ఆయన తరచూ విమర్శిస్తుండేవారు. యాంత్రీకరణకు ఎక్కువగా నష్టపోతుంది మహిళలేనని సీఎమ్ఎమ్ గుర్తించిందని రాధిక రాశారు. దల్లీ గనులలో పని చేసే కార్మికులలో సగం మంది మహిళలేనని, అయితే పూర్తిగా యాంత్రీకరణ అయిన గనులలో మహిళలను అనిపుణ కార్మికులుగా భావిస్తూ వారి శ్రమను ఉపయోగించుకోవడానికి యజమానులు నిరాకరిస్తున్నారని ఆమె రాశారు. ఇలా మహిళా కార్మికులకు ఉపాధిని నిరాకరించడం వారి ఆర్థిక స్వేచ్ఛ, మహిళా అస్తిత్వ గౌరవంపై దాడి చేయడమేనని సీఎమ్ఎమ్ గట్టిగా అభిప్రాయపడిందని రాధిక వెల్లడించారు. జీవనాధారాలకు భద్రత కల్పించి, కార్మికుల కొనుగోలు సామర్థ్యం పెంపొందించడం ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించే ప్రత్యామ్నాయ ఉత్పత్తి కార్యకలాపాల నమూనాను రూపొందించేందుకు నియోగి, ఆయన నాయకత్వంలోని సీఎమ్ఎమ్ కృషి చేశాయని రాధికా కృష్ణన్ పేర్కొన్నారు.

నియోగి తన సమకాలీన ఉద్యమం ఒకదాని గురించి రాసిన మాటలను కూడా రాధిక ఉటంకించారు: 'చిప్కో ఉద్యమం మమ్మలను ఉత్తేజపరిచింది. అది ఒక విప్లవాత్మక ఉద్యమంగా మేము గుర్తించాము'. ఆమె పుస్తకం చదువుతుంటే నియోగి, చిప్కో ఉద్యమ నేత చండీప్రసాద్ భట్‌ల మధ్య ఉన్న సామ్యాలు నన్ను చకితపరిచాయి. నియోగి హరిత మార్క్సిస్టు. భట్ (ఇంకా మన మధ్య నడయాడుతున్నారు) ఒక వామపక్ష గాంధేయవాది. ఇరువురూ పర్యావరణ స్థిరత్వాన్ని సామాజిక న్యాయంతో అనుసంధానించారు. ఇరువురూ సమాజంలో అట్టడుగు స్థాయి ప్రజల సంక్షేమాన్ని కాంక్షించిన మేధావులు. ఆ ఆదర్శాన్ని ఆచరణలోకి తీసుకురావడమే తమ జీవితధ్యేయంగా చేసుకున్న ఉదాత్తులు. సదా శ్రామికులు, రైతుల మధ్య కృషి చేస్తూనే దేశాభ్యున్నతికి, ప్రపంచ శ్రేయస్సుకు విస్తృత దృక్పథాన్ని వ్యక్తం చేసినవారు.


శంకర్ గుహ నియోగి మూడున్నర దశాబ్దాల క్రితం మైనింగ్ మాఫియా ఘాతుకానికి బలయ్యారు. అయినప్పటికీ ఆయన జీవిత కృషి వర్తమాన భారతదేశానికి చాలా సందర్భోచితంగా ఉన్నది. అది నేటి భారతదేశంతో కనీసం ఐదు ప్రధాన మార్గాలలో శక్తిమంతంగా మాట్లాడుతున్నది. అవి: (అ) అసంఘటిత రంగ కార్మికుల అనిశ్చిత పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రాధాన్యమిచ్చింది (నిర్మాణ రంగంలోను, గిగ్ ఎకానమీలోను లక్షలాది కార్మికుల జీవన పరిస్థితులు ఎంత దుర్భరంగా ఉంటున్నాయో మరి చెప్పనవసరం లేదు); (ఆ) ప్రజాస్వామ్య సుస్థిరతలో స్వతంత్ర పౌరసమాజ సంఘాల పాత్రకు ప్రాధాన్యం. తన హిందూత్వ భావజాలంతో ఏకీభవించని పౌర సమాజ బృందాలను బీజేపీ పలు విధాలా బెదిరింపులు, వేధింపులకు గురి చేస్తున్న ప్రస్తుత తరుణంలో స్వతంత్ర పౌర సమాజ సంఘాల అవసరం మరింతగా ఉంది; (ఇ) అభివృద్ధి సాధనతో పర్యావరణ సుస్థిరతను సమ్మిళితపరచవలసిన ఆవశ్యకత. మన నగరాలలో పెరిగిపోతున్న వాయు కాలుష్యం భూగర్భ జలాలు అంతకంతకూ తరిగిపోతుండడం, నదులు కాలుష్య కాసారాలుగా మారిపోతుండడం, హిమాలయాలు, పశ్చిమ కనుమలు, ఆరావళి పర్వతాలను మౌలిక సదుపాయాల, మైనింగ్ కంపెనీలు విచక్షణారహితంగా దుర్వినియోగం చేస్తున్నాయి. అధికారంలో ఉన్నవారి అండదండలు వాటికి లభిస్తున్నాయి. పర్యావరణ విధ్వంసానికి వ్యతిరేకంగా శంకర్ గుహ నియోగి, ఇంకా చండీప్రసాద్ భట్ హెచ్చరికలను విస్మరించడం వల్ల సంభవిస్తున్న ఈ హాని అంతా ఇంతా కాదు; (ఈ) నియోగి జీవిత కృషి మరింత అర్థవంతమైన అంటే తక్కువ దోపిడీదాయక, తక్కువ విధ్వంసక అభివృద్ధి నమూనాను సూచిస్తుంది. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్ లాంటి చిన్న రాష్ట్రాలు అవశ్యం అనుసరించాల్సిన అభివృద్ధి నమూనా అది; (ఉ) 'అధునాతన' సాంకేతికతల దీర్ఘకాలిక ప్రభావాల గురించి మితిమీరిన ఆశావహ దృక్పథం శ్రేయస్కరం కాదు. ఆటోమేషన్, కృత్రిమ మేధ వల్ల లక్షలాది భారతీయులు ఉద్యోగాలు కోల్పోతున్నారు. పనిలేకపోవడంతో పురుషులు తమ స్మార్ట్ ఫోన్లలో అనునిత్యం అశ్లీల సినిమాలను వీక్షించడంలో నిమగ్నమవుతున్నారు! నవీన సాంకేతికతల దుష్ప్రభావాలను మరెవరి కంటే కూడా మెరుగ్గా నియోగి అర్థం చేసుకున్నారు. ఆ సాంకేతికతలు ప్రైవేట్ కంపెనీలకు అపరిమిత లాభాలను సమకూర్చవచ్చుగానీ సమాజానికి, ప్రకృతికి ఎనలేని హాని చేస్తాయని నియోగి దశాబ్దాల క్రితమే హెచ్చరించారు.

77వ భారత గణతంత్ర రాజ్య దినోత్సవ శుభ సందర్భంలో ఈ కాలమ్ ప్రచురితమవనున్నది. ఇది యాదృచ్ఛికంగా జరుగుతున్నది కాదు. శంకర్ గుహ నియోగి వలే స్వేచ్ఛ, సమానత్వం, (మరీ ముఖ్యంగా) సౌభ్రాతృత్వం వంటి ఉదాత్త విలువలు మూర్తీభవించిన వ్యక్తులు మన సమున్నత భారత గణతంత్ర రాజ్య చరిత్రలో చాలా చాలా తక్కువమంది ఉన్నారు.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

'కర్పూరి' స్ఫూర్తితో కొత్తతరం కదలాలి

'దేశానికి స్వాతంత్ర్యం వస్తే మా బడుగుజీవుల బతుకుల మార్పునకు ఏం చేస్తారో చెప్పండ'ని స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే తన దార్శనిక ఆలోచనలతో ప్రశ్నించారు జ్యోతిరావు పూలే. ఆ ఆలోచనల కొనసాగింపుగానే కర్పూరి ఠాకూర్ ఓబీసీల హక్కుల సాధనకు, సామాజిక న్యాయం కోసం నిలిచి పోరాడారు. ఓబీసీల సామాజిక ఉద్యమం దేశవ్యాప్తంగా ఒక నినాదమై మారుమోగుతున్న సందర్భంలో దేశంలో బీసీ రిజర్వేషన్లకు శ్రీకారం చుట్టిన మహోన్నతుడిగా ఆయనను బీసీలోకం మననం చేసుకుంటుంది. కర్పూరి ఠాకూర్‌కున్న దార్శనికతే సామాజిక దృక్పథంగా నిలిచి మండల్ కమిషన్ అమలుకు దోహదకారి అయ్యింది.



భూస్వామ్యం, ధనస్వామ్యం, ఫ్యూడల్ వ్యవస్థ యథేచ్ఛగా రాజ్యమేలుతున్న కాలాన్ని ఒక నిరాడంబరుడిగా, ఒక సత్యాగ్రహిగా ఆత్మస్థైర్యంతో నిలిచి గెలవటం చరిత్రలో నూతన అధ్యాయం. కర్పూరి ఠాకూర్ నిరుపేద మంగలి కుటుంబం నుంచి వచ్చినా, కింది కులాల హక్కుల కోసం నిలిచి, ఓబీసీలకు దేశంలోనే తొలిసారిగా రిజర్వేషన్లు ఇచ్చారు. బుద్ధుడు జన్మించిన నేలలో పుట్టిన ఆయన సామాజిక ఉద్యమకారుడుగా బడుగుల పక్షాన పోరాడారు. రెండు సార్లు ముఖ్యమంత్రి అయినా ఆయన నివాసం మాత్రం పూరిపాకే. చితికిపోయిన బతుకుల కోసం, ఛిద్రమైన పేదల భవిత కోసం నిరంతరం తపించారు. మారుమూల గ్రామాలలో బడులు, కాలేజీలు కట్టించారు. మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రి పూలేల దారిలో నడుస్తూ బడుగుల భవితను మార్చేది జ్ఞానమేనని నమ్మి సేవలందించారు. వెనుకబడిన కులాలకు, అత్యంత వెనుకబడిన బీసీలు, సంచార, అర్ధసంచార జాతుల విముక్తికై 1997లో ముంగేరిలాల్ కమిషన్‌ను నియమించి, అదే ఏడాది బీసీలకు 26శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. అగ్రవర్ణాల నుంచి తీవ్ర నిరసనలు వచ్చినా జంకలేదు, వెనుకడుగు వేయలేదు. అయితే ఓబీసీలకు రిజర్వేషన్లు ఇచ్చినందువల్ల కలిగిన రాజకీయ సంక్షోభంలో ఆయన ముఖ్యమంత్రి పదవిని వదులుకుని, బడుగుల పక్షమే నిలిచారు. ఆయన ఇచ్చిన రిజర్వేషన్లు దేశవ్యాప్తంగా ఓబీసీలకు రిజర్వేషన్లు పొందటానికి పునాది అయ్యింది.

కర్పూరి ఠాకూర్‌లాగా నేడు నిరాడంబరంగా జీవించే నాయకులు దేశమంతా వెతికినా కనిపించరు. నిజాయితీతో పనిచేయటమే గీటురాయి అన్నది చెరిగిపోయి, కోట్లాది రూపాయలు గుమ్మరిస్తే తప్ప ఎన్నికల్లో నిలిచే పరిస్థితి లేదు. దేశంలో ప్రజాస్వామ్యాన్నే వేలం వేసి కొనుక్కునే దశలో నిరాశవాదంలోకి వెళ్ళిన సమాజం మళ్లీ ఆశావాదం వైపునకు మళ్లటానికి కర్పూరి ఠాకూర్ లాంటి నాయకుడు చీకటిలో దీపంగా వెలుగునిస్తున్నారు. ఈ నేపథ్యం నుంచి కర్పూరి ఠాకూర్‌ను నేటి యువతరం అధ్యయనం చేయాలి. ఆయన నుంచి నిరాడంబరతను, నిజాయితీని, ధైర్యాన్ని నేర్చుకోవాలి. కింది కులాల నుంచి ఎదుగుతున్న నేతలు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి. బహుజన తాత్త్వికతను, సోషలిస్టు భావజాలాన్ని గుండెనిండా నింపుకున్న కొత్త తరం రాజకీయ వేదిక మీదకు వచ్చినప్పుడే దేశానికి అన్ని రకాల ఆధిపత్యాల నుంచి విముక్తి లభిస్తుంది.

దేశంలో 788 పార్లమెంట్ సభ్యుల్లో 306 మందిపై క్రిమినల్ కేసులు, 194మంది మీద సీరియస్ కేసులు ఉన్నాయి. దేశం మొత్తమ్మీద 4,131 మంది ఎమ్మెల్యేలలో 1,746 మందిపై (2023లో) క్రిమినల్ కేసులున్నాయి. 2024 నాటికి పాతవి, కొత్తవి కలిపి 4,474 మందిపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి– అంటే 44శాతం మందిపై క్రిమినల్ కేసులన్నమాట. ఏ పని మీద పోయినా ఎంత లంచమిస్తావనేది సర్వనామంగా మారింది. అవినీతి నుంచి దేశాన్ని కాపాడాలంటే కర్పూరి ఠాకూర్‌లు కావాలి. ఆయన 50 ఏళ్ల క్రితం మారుమూల ప్రాంతాలలో స్కూళ్లు, కాలేజీలు కట్టించారు. ఇప్పుడు ఆ ప్రభుత్వ బడులను, విద్యార్థుల సంఖ్య లేదని మూసేస్తున్నారు. నిరుద్యోగం పెచ్చరిల్లిపోయింది. ప్రజల ప్రయోజనాలను, అణగారిన వర్గాలను కాపాడేందుకు కర్పూరి లాంటి నేతలు రావాలి. ప్రభుత్వ రంగాలన్నీ నిర్వీర్యమైపోతున్నాయి. ప్రజల జీవన విధానం చిన్నాభిన్నమైంది. హింస పెరుగుతోంది. ద్వేషభావాలు పేట్రేగుతున్నాయి. ప్రజల పక్షాన నిలవాల్సిన నేతలు ఏం చేస్తున్నారని కర్పూరి ఠాకూర్ స్ఫూర్తిగా కొత్తతరం ప్రశ్నించేందుకు ముందుకు రావాలి.

భూస్వాముల వద్ద భూములు, ప్రభుత్వం వద్ద భూములు పేదలకు పంచితేనే ఆర్థిక, సామాజిక సమానత్వం వస్తుందని నమ్మి, కర్పూరి ఠాకూర్ అందుకు శ్రీకారం చుట్టారు. గౌతమబుద్ధుడు పుట్టిన నేల నుంచి సామాజిక ఉద్యమ సూర్యుడిగా కర్పూరి ప్రభవించారు. ఆయనకు 'భారతరత్న' ఇవ్వడం బడుగు జీవులందరినీ గౌరవించడమే.

● జూలూరు గౌరీశంకర్

(నేడు కర్పూరి ఠాకూర్ జయంతి)

విద్యతోనే అభివృద్ధి!

మానవుల జీవితాన్ని మార్చడానికి విద్య ఒక ముఖ్య సాధనం. ఒక వ్యక్తి జీవన ప్రమాణాన్ని, నాణ్యతను, జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని, మంచి దృక్పథాన్ని విద్య మెరుగుపరుస్తుంది. మనుగడ కోసం, ఉపాధి కోసం, మంచి జీవనం సాగించేందుకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకునేందుకు విద్య అవసరం. అలాగే మంచి మానవ సంబంధాలను అభివృద్ధి చేసుకొనేందుకు, గౌరవప్రదమైన జీవితం గడిపేందుకు, ఆమోదయోగ్యమైన నడవడికలు నేర్చుకునేందుకు, వ్యక్తిత్వ వికాసానికి విద్య ఉత్తమ సాధనం. విద్య లేకుండా ఏ దేశం అభివృద్ధి సాధించలేదు. ప్రపంచవ్యాప్తంగా మెరుగైన ఉత్తమమైన విద్యా సంస్కరణల అమలు కోసం ప్రచారం కల్పించడానికి, సామాన్యుడికి సైతం విద్య అందుబాటులో ఉండడానికి ప్రతి దేశంలో విద్యా దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు.

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 25 కోట్ల మంది పిల్లలు, యువకులు పాఠశాలకు వెళ్లి చదువుకోలేకపోతున్నారు. సుమారు 76.5 కోట్ల మంది పెద్దలు నిరక్షరాసులుగా ఉన్నారు. భారతదేశంలో తల్లిదండ్రులు సగటున ఒక విద్యార్థిపై 18,479 రూపాయలు ఖర్చు చేస్తున్నారు. మన కేంద్ర ప్రభుత్వం 2025–26 బడ్జెట్‌లో విద్యకు నిధులు పెంచినా, ప్రపంచ సగటుతో పోలిస్తే తక్కువే. విద్యపై ప్రపంచ సగటు 4.48శాతమైతే, భారత సగటు మాత్రం నాలుగు శాతమే. మన దేశంలో విద్యను బాలల ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ విద్యాహక్కు చట్టం చేశారు. 6–14 ఏళ్ల మధ్య వయసు బాలబాలికలందరూ తప్పనిసరిగా పాఠశాలల్లో చేరి చదువుకునేలా చూస్తూ, వారికి ఉచిత విద్య అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాల మీద ఉంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ వయసు పిల్లలు 92 లక్షల మంది పాఠశాల వెలుపలే ఉండిపోతున్నారు. పాఠశాలల్లో చేరని, లేదా మధ్యలోనే చదువు మానేసిన వీరందరినీ తిరిగి చదువుల బాట పట్టించటం విద్యాహక్కు చట్టం ముఖ్యోద్దేశం. మన దేశంలో కావచ్చు ప్రపంచవ్యాప్తంగా కావచ్చు ఉన్నత విద్యకు కూడా నిధులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. చాలా దేశాలలో విద్యార్థులు ఉన్నత విద్యలో చేరలేకపోతున్నారు, కారణం అది ఖరీదైనది కావటమే. ఉపాధ్యాయులపై ఇతర పనుల ప్రభావాన్ని తగ్గించి వారిని బోధనలో మాత్రమే నిమగ్నం చేయాలి. విలువలతో కూడిన విద్యను అందించడంలో, చదువుకున్న ప్రతి వాడికి ఉపాధి దొరికేటట్లు చూడాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజంపై ఉన్నది.

– కావలి చెన్నయ్య ముదిరాజ్

(నేడు అంతర్జాతీయ విద్యా దినోత్సవం)





గుంటూరులో లోకేశ్ జన్మదిన కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్, మేయర్ రవీంద్ర, ఏపీటీస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, డిప్యూటీ మేయర్ సజీల తదితరులు



టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లాడ్జి సెంటర్‌లో జరిగిన లోకేశ్ జన్మదిన వేడుకల్లో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి, ఏపీఐడీసీ చైర్మన్ డేగల



చిలకలూరిపేటలో కేక్ కట్ చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే పుల్లారావు

ఘనంగా లోకేశ్ జన్మదినోత్సవం

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను శుక్రవారం జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణంలో నిర్వ హించారు. టీడీపీ ప్రజాప్రతినిధులతో పాటు జనసేన, బీజేపీ నాయకులు కూడా ఈ వేడుకల్లో భాగస్వాములయ్యారు. యువనేత పుట్టిన రోజును పార్టీ శ్రేణులు ఉత్సాహంగా జరు పుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామ గ్రామాన కేక్ కటింగ్‌లతో యువనేతకు పుట్టిన రోజు శు భాకాంక్షలు తెలిపారు.

- గుంటూరు, ఆంధ్రజ్యోతి



ప్రాణాలు తీస్తోన్న లైట్లు

వాహనాలకు అదనంగా వినియోగం

- ఎదుటి వాహనదారుడి కళ్లపైకి లైట్ల ఫోకస్
- ఎల్‌ఈడీ లైట్లతో పెరుగుతోన్న రోడ్డు ప్రమాదాలు

లైట్లు.. ప్రాణాలు తీస్తున్నాయి. రోడ్డు ప్రమాదాలకు కారణాలవుతున్నాయి. ఇటీవల కాలంలో వాహనాలకు ఎల్‌ఈడీ లైట్ల వినియోగం అధికమైంది. ద్విచక్ర వాహనాల నుంచి లారీలు, బస్సుల వరకు ప్రభుత్వం అనుమతించిన దానికంటే అత్యధి కంగా వాట్ లైట్లను వినియోగిస్తున్నారు. నిబం ధనలకు విరుద్ధంగా లైట్లు వేసుకుని దూసుకు వచ్చే ఆయా వాహనాల ఫోకస్ ఎదుటి వాహన దారులపై పడటంతో కళ్లు బైర్లు కమ్మి ప్రమా దాలకు గురవుతున్నారు. రోడ్డు కనిపించేలా ఉండాల్సిన లైట్లు ఎదురుగా వచ్చే వాహన చోద కులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. వాహనాల చట్టం లైట్ల వినియోగంపై ప్రత్యేక నిబంధనలు విధించి నా అమలుపై రవాణాశాఖ, పోలీసులు అధికా రులు పట్టించుకోవడం లేదు. ఇదే అవకాశంగా వాహనదారులు ఇష్టం వచ్చినట్లుగా లైట్లు బిగించి రోడ్లపై దూసు కెళ్తూ.. పలువురి ప్రాణాలు తీస్తున్నారు. పైగా ఈ ఎల్‌ఈడీ వెలుగులు ఎదుటి వాహనదారుడి కళ్లలో పడుతుండటంతో చూపు కోల్పోయే ప్రమాదం కూడా ఉందని వైద్యులు చెబుతున్నారు.

- పట్టించుకోని రవాణాశాఖ..
- ఇష్టారీతిన వాహనదారులు
- ఎల్‌ఈడీ వెలుగులతో కంటి చూపు కోల్పోయే ప్రమాదమని హెచ్చరికలు

వాహనాల చట్టం 1988 ప్రకారం అనుమతించని మార్పుల్లో ఎల్‌ఈడీ లైట్లు వినియోగం ముఖ్యమైంది. ఈ చట్టంలోని సెక్షన్ 52 ప్రకారం వాహనాల నిర్మాణం,



ఫీచర్లలో అనుమతి లేకుండా మార్పులు చేయడం చట్ట విరుద్ధం. కారుకు 75 వాట్స్, లారీకు 100, ద్విచక్ర వాహనాలకు 10 వాట్స్‌లోపు మాత్రమే లైట్ల వినియోగం ఉండాలి. ఎల్‌ఈడీ లైట్లు వినియోగించే వాహనం సీజ్ చేయవచ్చు. రూ.వెయ్యి నుంచి రూ.పది వేల వరకు జరిమానా విధించవచ్చు. లైట్ల వినియోగం మితిమీరితే వాహనదారుడికి జైలు శిక్ష విధించే అవకాశం ఉంది.

గుంటూరు(తూర్పు), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విశాలంగా ఉన్నా.. వెలుగులు ప్రసరిస్తున్నా.. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎల్‌ఈడీ లైట్లు హాలోజెన్ లైట్ల కంటే అధికంగా వెలుగును ప్రసరింపజేయడమే ఈ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఈ లైట్ల వెలుగులతో ఎదురుగా వచ్చే వాహన డ్రైవర్ల కళ్లు బైర్లు కమ్మి గందరగోళంతో ప్రమాదానికి గురవు తున్నారు. మిగిలిన రాష్ట్రాలలో అధికారులు వీటి విక్రయాలపై కఠిన వైఖరిని అవలం భిస్తున్నారని, మన రాష్ట్రంలో మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇతరుల ప్రాణాలకు ముప్పు తెస్తున్నామన్న స్పృహ లేకుండా తమ వాహనాలకు పలువురు అదనపు హంగులు, ఆర్భాటాల కోసం ఇష్టం (మిగతా 8వ పేజీలో)





ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ త్రిపాఠి, కలెక్టర్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్ తదితరులు

నేడు గణతంత్ర వేడుకల రిహార్సల్స్

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ అన్సారియా, ఐజీ త్రిపాఠి, ఎస్పీ జిందాల్

తుళ్లూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న రాజధాని అమరావతిలో తొలిసారి రాష్ట్రస్థాయిలో జరగనున్న గణతంత్ర్య దినోత్సవానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గణతంత్ర వేడుకలకు సంబంధించి శనివారం ఉదయం రిహార్సల్స్ జరగనున్నది. రాయపూడిలో జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఐజీ త్రిపాఠి, ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. వేడుకల్లో ఏ ఒక్క చిన్న అవాంఛనీయ ఘటనకు ఆస్కారమివ్వొద్దని అధికారులను వారు ఆదేశించారు. గవర్నర్, ముఖ్య మంత్రి, మంత్రులు విచ్చేసే మార్గాలు, కూర్చునే ప్రదేశాలు, పరేడ్ పక్రియ తదతర అంశాలను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు ఉండరాదని స్పష్టం చేశారు. శాఖల వారీగా అభివృద్ధిని తెలియజేసే శకటాల రూపకల్పన వేగవంతం చేయాలని చెప్పారు. 900 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తుకు కేటాయించామని ఎస్పీ చెప్పారు. వేడుకలకు హాజరయ్యే వారు ఉదయం 8 గంటల కంటే ముందుగా తమకు కేటాయించిన సీట్లలో ఆశీనులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జేసీ శ్రీవాస్తవ, ఎస్పీ ఆరిఫ్, ఏఎస్పీలు ఏటీవీ రవికుమార్, హనుమంతు, ఆర్డీవో శ్రీనివాసరావు, ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు గుంటూరుకి అమృత్ భారత్ రైలు

రైల్వే స్టేషన్‌లో స్వాగత కార్యక్రమాలు

గుంటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించిన తిరువనంతపురం నార్త్ - చర్లపల్లి అమృత్ భారత్ ప్రత్యేక రైలు శనివారం గుంటూరు రైల్వే స్టేషన్‌కి రానున్నది. ఈ రైలుని శుక్రవారం తిరువనంతపురం రైల్వేస్టేషన్‌లో ప్ర ధాని మోదీ పచ్చజెండా ఊపి ప్రారం భించారు. శనివారం ఉదయం 8.30కి బాపట్ల, 9.38కి తెనాలి, 10.20కి గుంటూరు, 11.23కి సత్తెనపల్లి, సాయంత్రం 4.30కి చర్లపల్లికి ఈ రైలు చేరు కుంటుంది. ఈ నేపథ్యంలో గుంటూరుస్టేషన్‌లో రైలుకు ఘనంగా స్వాగతం పలకాలని వివిధ రైల్వే వినియోగదారుల సంఘాలు నిర్ణయించాయి.





30 గుడ్లు.. రూ.150

- దిగొచ్చిన కోడిగుడ్ల ధరలు
- రిటైల్‌మార్కెట్‌లో రూ.5కే విక్రయం

గుంటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కోడి గుడ్ల ధరలు దిగిచ్చాయి. ఉత్పత్తి పెరగడంతో కొందరు వ్యాపారులు పోటీలు పడి 30 గుడ్ల ట్రే రూ.150కి విక్రయిస్తున్నారు. గత నెలలో ఇదే ట్రే రూ.220 వరకు కూడా విక్రయించారు. నెల క్రితం వరకు గుడ్డు ధర రూ.7కిపైగా చేరగా రిటైల్ మా ర్కెట్లో రూ.8 వరకు విక్రయించారు. తాజాగా ధరలు తగ్గడంతో రూ.5కి చేరింది. మార్కెట్లో డిమాండ్‌కు అనుగుణంగా కోడిగుడ్ల ఉత్పత్తి పెరగటమే ప్రధాన కారణంగా పౌల్ట్రీ వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తు తం కోడిగుడ్లు 100 రూ.505గా ప్రకటించారు. గత నెలలో ఇదే తేదీల్లో 100 కోడి గుడ్ల ధర రూ.720గా నమోదైంది. దాంతో రిటైల్ మార్కెట్లో కోడి గుడ్డు రూ.8 వరకు విక్రయించారు. దీంతో సా మాన్య వినియోగదారులు సైతం కోడిగుడ్లు కొనుగోలు చేయాలంటేనే ఆందోళన చెందాల్సి వచ్చింది. కోడిగుడ్లు కంటే కూరగాయల ధరలే మేలు అనుకోవాల్సిన పరిస్థితులు నెలకున్నాయి. నెలరోజుల వ్యవధిలోనే కోడిగుడ్ల ధరలు క్రమంగా తగ్గుతూ వచ్చాయి. వాస్తవానికి కోడిగుడ్ల ఉత్పత్తి కొంత మెరుగు పడటంతో పాటు ఎగుమతుల్లో స్వల్పంగా తగ్గుదల కలిగిందని వ్యాపారులు చెబుతున్నారు. అయితే కోడిగుడ్లు కొందరు చిల్లర వర్తకులు గుడ్డు రూ.7, మూడు గుడ్లు రూ.20 వరకు విక్రయిస్తున్నారు.

ఏసీబీ వలలో డీఆర్వో మురళి

రూ.37 లక్షల బిల్లుకు రూ.3 లక్షలు డిమాండ్

నరసరావుపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భోజన బిల్లుకు సంబంధించి బిల్లు ఇచ్చేందుకు రూ.3 లక్షలు లంచం డిమాండ్ చేసి ఆ మొత్తం తీసుకుంటూ డీఆర్వో ఏకా మురళి శుక్ర వారం ఏసీబీకి చిక్కాడు. ఏకంగా కలెక్టరేట్‌లోనే లంచం నగదు తీసుకుంటూ జిల్లా స్థాయి అధికారి పట్టుబడటం కలకలం సృష్టించింది. ఇందుకు సంబంధించి ఏసీబీ ఏఎస్పీ మహేంద్ర మత్తే వెల్లడించిన వివరాలు.. మాచర్లలో 2023లో జరిగిన అప్పటి సీఎం వైఎస్ జగన్ పర్యటనకు నరసరావుపేటకు చెందిన సాగర్ మాత క్యాటరింగ్ నిర్వహకుడు కరిముల్లా 41,500 భోజన ప్యాకెట్లను సరఫరా చేశారు. ఇందుకు అడ్వాన్స్‌గా అప్పట్లో రూ.10 లక్షలు చెల్లించారు. మిగతా బిల్లు రూ.37 లక్షలు చెల్లించేందుకు డీఆర్వో లంచం డిమాండ్ చేశాడు. సదరు చెక్కు ఇవ్వాలంటే రూ.3 లక్షలు లంచం ఇవ్వాలని కరిముల్లాను కోరాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించి డీఆర్వోపై ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కలెక్టరేట్‌లోని డీఆర్వో తన ఛాంబర్‌లో కరిముల్లా నుంచి రూ.3 లక్షలు నగదు తీసుకుంటుండగా అవినీతి నిరోధకశాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికాడు. సదరు నగదును స్వాధీనం చేసుకుని డీఆర్వో మురళిపై కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టుకు తరలించారు. ఈ దాడిలో సీఐలు నాగరాజు మన్మధరావు, సురేష్‌బాబు, సుబ్బారావు, ఎస్ఐలు జయభరత్‌రెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.




రూ. 3 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన డీఆర్వో మురళి

అంతర్జాతీయ నగరంగా.. అమరావతి

- రాజధానికి సీఆర్‌డీఏ సమీకృత మాస్టర్ ప్లాన్
- అనుభవం కలిగిన కన్సల్‌టెంట్ నియామకానికి నోటిఫికేషన్

గుంటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విమానాశ్రయం.. ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ సిటీలుగా అమరావతి అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి అందుకు అనుగుణంగా అడుగులు వేస్తున్నది. ఇప్పటికే రెండో విడత భూసమీకరణ ప్రారంభమైన దృష్ట్యా సమీకృత మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు సీఆర్‌డీఏ శ్రీకారం చుట్టింది. ఇందు కోసం అనుభవం కలిగిన కన్సల్‌టెంట్‌ని నియమించుకోవాలని నిర్ణయించింది. అందులో భాగంగా అంతర్జాతీయంగా టెండర్ నోటిఫికేషన్‌ని జారీ చేసింది. రెండో విడతలో అమరావతి మండలంలోని వైకుంఠపురం, పెదమద్దూరు, యండ్రాయి, కర్లపూడి, లేమల్లె గ్రామాలలో 9,616 ఎకరాలు, తుళ్లూరు మండలం వడ్డమాను, హరిశ్చంద్రా పురం, పెదపరిమి గ్రా మాల్లో 10,878 ఎకరాలను కలిపి మొత్తం 20,494 ఎకరాలను ఎల్‌పీఎస్ ద్వారా సేకరించే ప్రక్రియకి శ్రీకారం చుట్టింది.



50 గ్రామాలు కోర్ స్టడీ ఏరియా

కోర్ స్టడీ ఏరియా కింద మరో 50 చుట్టుపక్కల గ్రామాలను పరిగణిస్తున్నారు. ఏడు గ్రామాల్లో 709.6 చదరపు కిలోమీటర్లకు స్ట్రక్చర్ ప్లాన్ అవసరం అవుతుంది. కోర్ స్టడీ ఏరియాలో భాగంగా గుంటూరు రూరల్ మండలం చినపలకలూరు, జొన్నలగడ్డ, మంగళగిరి మండలం కాజ, మేడికొండూరు మండలం డోకిపర్రు, మంగళగిరిపాడు, మేడికొండూరు, పేరేచర్ల, సిరిపురం, వరగాని, వెలవర్తిపాడు, విశదల, పెదకాకాని మండలం అగతవరప్పాడు, కొప్పురావూరు, నంబూరు, పెదకాకాని, వెనిగండ్ల, తాడికొండ మండలం బండారుపల్లి, బేజాత్‌పురం, దామరపల్లి, కంతేరు, లచ్చన్నగుడిపూడి, లాం, మోతడక, నిడుముక్కల, పాములపాడు, పొన్నెకల్లు, రావెల, తాడికొండ, అమరావతి మండలం అమరావతి, ధరణికోట, లింగాపురం, నరుకుళ్లపాడు, నెమలికల్లు, ఉంగుటూరు, యడ్లపాడు మండలం కొండవీడు, పెదకూరపాడు మండలం బలుసుపాడు, జలాల్‌పురం, కంభంపాడు, లింగంగుంట్ల, ముస్సాపురం, పాటిబండ్ల గ్రామాల్లో 1,54,853.43 ఎకరాలను (626.67 కిలోమీటర్లు) స్టడీ చేసి సమీకృత మాస్టర్‌ప్లాన్‌ని రూపొందించాలన్న నిబంధనని సీఆర్‌డీఏ చేర్చింది.

సర్వే పనులు చెప్పొద్దు..

- వీవీఏలను ఈ-పంట నమోదు చేయనివ్వండి
- కలెక్టర్లకు వ్యవసాయశాఖ డైరెక్టర్ లేఖ
- ఫిబ్రవరి 20వరకు సర్వేలకు వాడొద్దని సూచన
- క్రాప్ బుకింగ్‌పై దృష్టిపెట్టాలని డీఏఓలకు ఆదేశం

పోషకాల పుట్టగొడుగులు

- ప్రజల్లో విపరీతమైన ఆదరణ
- వ్యవసాయకళాశాలలో ప్రత్యేక శిక్షణ
- నిరుద్యోగులకు ఉపాధి మార్గం
- కుటీర పరిశ్రమగా విస్తరణకు అవకాశం

అంతరిక్షమే 'నాలుగో యుద్ధ క్షేత్రం'

- డీఆర్‌డీవో మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి

8



- బాలికల వసతి గృహాల భవనాలు

పట్టాలెక్కనున్న పనులు

- జేఎన్‌టీయూ వసతి గృహాలకు రూ. 10 కోట్లు
- వర్సిటీ పాలకమండలి ఆమోదం
- ఉన్న కాంట్రాక్టర్ల కొనసాగింపు
- వర్సిటీ పెద్దలను కదిలించిన ఆంధ్రజ్యోతి వరుస కథనాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల వసతి కష్టాలు ఎట్టకేలకు తీరనున్నాయి. నిలిచిపోయిన వసతి గృహాల పనులు ప్రారంభం కానున్నాయి. జేఎన్‌టీయూ కాకినాడ పాలక మండలి నిధుల కేటాయింపునకు పచ్చజెండా ఊపింది. పెండింగ్ పనులు పూర్తికి రూ.10 కోట్లు విడుదల చేయనుంది. మే నెలాఖరుకల్లా పనులు పూర్తికి ప్రణాళికను రూపొందించారు. ఉన్న కాంట్రాక్టర్లనే కొనసాగించాలని నిర్ణయించారు. వర్సిటీ అధికారులు కాంట్రాక్టర్లతో సమావేశమయ్యారు. పాత రేట్లకే పనులు పూర్తి చేసేలా ఇరు వురి మధ్య ఒప్పందం కుదిరింది. ఈ మేర కు సదరు కాంట్రాక్టర్లు పనులు చేస్తామని అంగీకార పత్రాలు ఇచ్చారు. కళాశాల వసతి కష్టాలపై ఆంధ్రజ్యోతిలో వెలువడిన వరుస కథనాలు (మిగతా 8వ పేజీలో)



పనులు నిలిచిపోయిన వసతి గృహం భవనం

వేగంగా పనులు

గత రెండేళ్లుగా నిధుల కొరతతో నిలిచిపోయిన పనులు ప్రారంభం కానున్నాయి. ఇంజనీరింగ్ కళాశాలలో 720 మంది వసతి సామర్థ్యం బాలుర, బాలికల వసతి గృహాల నిర్మాణం రూ.64 కోట్ల వ్యయంతో చేపట్టారు. దాదాపు 80 శాతానికిపైగా పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు పూర్తి చేసేందుకు రూ.10 కోట్ల నిధులు అవసరం ఉందని ఇటీవల వర్సిటీ నిపు ణుల కమిటీ నిర్ధారించింది. కమిటీ నివేదిక ఆధారంగా వర్సిటీ నిధులు కేటాయించింది. మే 26 కల్లా పనులు పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నుంచి వసతి గృహాలను వినియోగంలోకి తీసుకురాలని నిర్ణయించింది.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

పనుల తనిఖీలో కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ చేపట్టే అభివృద్ధి పనుల్లో నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు, కాలపరిమితి తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ కె.మయూర్‌అశోక్ స్పష్టం చేశారు. ముత్యాలరెడ్డినగర్, కోదండ రామయ్యనగర్, ఇన్నర్‌రింగ్ రోడ్, నగరాలులో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రతి పనికి థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ సమయాల్లో ఎమినిటి కార్యదర్శి అక్కడే ఉండి, నాణ్యతా ప్రమాణాల మేరకు పనులు జరిగేలా, క్యూరింగ్ చేసేలా పర్యవేక్షణ చేయాలన్నారు. కాంట్రాక్టర్లు నిర్దేశిత నిబంధనల మేరకు పనులు చేయాలన్నారు. రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ సమయాలకు ముందే విద్యుత్ స్తంభాలతో పాటు ఇతర అడ్డంకులను మార్చాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. లాడ్జి సెంటర్‌లోని హెచ్ఎల్ఆర్‌ని పరిశీలించి అక్కడ పరిసరాల అపరిశుభ్రతపై అసహనం వ్యక్తం చేశారు. డ్రెయిన్లు, ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారాలను చూసి పారిశుధ్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు నిర్దేశిత సమయం విధుల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్లక్ష్యం వహిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



డ్రెయిన్ నిర్మాణ కొలతలను పరిశీలిస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

ప్రకాశం జిల్లా పొదిలి దూరవిద్య పరీక్ష కేంద్రం రద్దు

- అవకతవకల నిర్ధారణతో నిర్ణయం
- ఏఎన్‌యూ దూరవిద్య పరీక్షల సమన్వయకర్త రామచంద్రన్
- పీజీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల



పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న సమన్వయకర్త ఆచార్య రామచంద్రన్

ఏఎన్‌యూ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతున్న డిగ్రీ, పీజీ పరీక్షల తీరును సమన్వయకర్త ఆచార్య డి.రామచంద్రన్ శుక్రవారం తనిఖీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని విలియమ్స్, ఆదర్శ కళాశాలలతో పాటు పలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. ప్రకాశం జిల్లా పొదిలిలోని ఓ పరీక్ష కేంద్రంలో దూరవిద్య పరీక్షల నిర్వహణలో పలు అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ కావడంతో ఆ పరీక్ష కేంద్రాన్ని రద్దు చేశామని ఆయన వెల్లడించారు. పరీక్ష నిర్వహణలో విశ్వవిద్యాలయం నిబంధనలను ఉల్లంఘించినట్లు తమ పరిశీలకుడు ఇచ్చిన సమాచారం మేరకు.. వర్సిటీ ఆచార్యులు వి.తులసీదాస్, డాక్టర్ పి.సుధాకర్ నేతృత్వంలోని బృందం కేంద్రాన్ని తనిఖీ చేసి.. నివేదిక ఇచ్చినట్లు వెల్లడించారు. అలాగే పరిశీలకుడి నివేదిక ఆధారంగా పరీక్ష కేంద్రాన్ని వెంటనే రద్దు చేసినట్లు తెలిపారు. విశ్వవిద్యాలయ అధికారులకు ముందస్తు సమాచారం అందించకుండా పరీక్ష కేంద్రాన్ని మార్చడంతో పాటు.. పరీక్షల నిర్వహణాధికారి చీఫ్ సూపరింటెండెంట్ కూడా మార్పుచేసి నిర్దేశించిన సమయపాలనను పాటించకుండా ఇష్టానుసారీతిగా పరీక్షలు నిర్వహించినట్లు తనిఖీ బృందం దర్యాప్తులో నిర్ధారణ అయ్యిందని వివరించారు. ఈ పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాసే విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా శనివారం నుంచి జరిగే పరీక్షలను సమీపంలోని దర్శి అద్దంకి రోడ్డు సమీపంలో ఉన్న శ్రీ కృష్ణచైతన్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ పరీక్ష కేంద్రానికి కేటాయించామని చెప్పారు. పరీక్ష కేంద్రం మార్పునకు సంబంధించిన సమాచారం విద్యార్థులకు కూడా అందించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల నిర్వాహకులు విశ్వ విద్యాలయం నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు చేపడుతామని సమన్వయకర్త ఆచార్య రామచంద్రన్ హెచ్చరించారు.

పీజీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ గతేడాది జులైలో నిర్వహించిన ఎమ్మెస్సీ కాంప్రిహెన్సివ్ డేటా సైన్స్ మొదటి సెమిస్టర్, బోటనీ, కెమిస్ట్రీ సెకండ్ సెమిస్టర్ రీవాల్యుయేషన్ పరీక్ష ఫలితాలను శుక్రవారం సీఈ ఆలపాటి శివ ప్రసాద్ విడుదల చేశారు. ఫలితాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని చెప్పారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి వినతి

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో ఖాళీగా ఉన్న ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీచేయాలని శుక్రవారం దినసరి ఉద్యోగులు వీసీ కె.గంగాధరరావును ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. దినసరి ఉద్యోగుల కార్యదర్శి నంబూరు సాంబయ్య వీసీతో మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం చేసిన వర్గీకరణ జీవో ప్రకారం వర్సిటీ పీజీ ప్రవేశాలు కల్పించాలని కోరారు. అలాగే ఉద్యోగోన్నతులు కూడా జరపాలని, బదిలీల విషయంలో సరియైన ప్రాధాన్యం కల్పించాలన్నారు. దీనికి ఉపకులపతి స్పందిస్తూ రెక్టార్, రిజిస్ట్రార్‌లతో చర్చించి తగు న్యాయం చేస్తామని సమాధానం ఇచ్చారు. వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబరు ఆచార్య కె.సుమంత్‌కుమార్, ఎన్. రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిగ్నేచర్ డైన్..

రెస్టారెంట్ అండ్ కన్వెన్షన్ ప్రారంభం



కన్వెన్షన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రవికుమార్, మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే నసీర్

గుంటూరు (తూర్పు), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని బృందావన్ గార్డెన్స్ మూడో లైన్ మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'సిగ్నేచర్ డైన్' రెస్టారెంట్ అండ్ కన్వెన్షన్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథులు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్ రెస్టారెంట్‌ని ప్రారంభించారు. మంత్రి రవికుమార్ మాట్లాడుతూ నగర నడిబొడ్డున అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో.. 200 నుంచి 600 మంది వరకు అనేక రకాల వేడుకలకు నిర్వహించేందుకు ఈ కన్వెన్షన్ అనువుగా ఉందన్నారు. ఆరోగ్యకరమైన వాతావరణం, అధునాతన సాంకేతిక వసతులతో కన్వెన్షన్ మరింతగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మేయర్ రవీంద్రబాబు మాట్లాడుతూ ఈ ప్రాంత వాసులకు కన్వెన్షన్ అండ్ రెస్టారెంట్ అందుబాటులో ఉండటం సంతోషంగా ఉందన్నారు. గళ్లా మాధవి, నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ఇటువంటి ఆధునిక రెస్టారెంట్లు, కన్వెన్షన్లు నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మన్నవ యుగంధర్ మాట్లాడుతూ సిగ్నేచర్ డైన్ రెస్టారెంట్, కన్వెన్షన్‌ను సరికొత్త హంగులతో వెజ్, నాన్‌వెజ్ రెస్టారెంట్, బాంకెట్, కాన్ఫరెన్స్ హాల్, ఫంక్షన్ హాల్, గ్రాండ్ బెడ్‌రూమ్, గ్రాండ్ కంఫర్ట్ రూమ్స్, ఎగ్జిక్యూటివ్ రూమ్స్, గ్రాండ్ క్లబ్ సూట్ రూమ్స్, సూట్ రూమ్స్ అన్ని రకాల వసతులతో ఏర్పాటు చేశామన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.



జ్యోతిప్రజల్వన చేస్తున్న మంత్రి గొట్టిపాటి, మేయర్, ఎమ్మెల్యేలు నసీర్, మాధవి

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి



బాధిత కుటుంబంతో ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురవాయపాలేనికి చెందిన ఇంటర్ విద్యార్థి మన్నం రాజేష్ గుంటూరు జిల్లా పేరేచర్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతదేహాన్ని శుక్రవారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గ్రామానికి చేరుకుని రాజేష్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున సాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

లాడ్జిలో యువకుడి ఆత్మహత్య

రేపల్లె, జనవరి 23(ఆంధ్రజ్యోతి): భార్యభర్తల మధ్య మనస్పర్థల కారణంగా యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నగరం మండలం చిన్నమట్లపూడి గ్రామానికి చెందిన శ్రీకాంత్ హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల అతనికి వివాహం అయ్యింది. భార్యభర్తల మధ్య తరచూ మనస్పర్థలు పొడచూపడంతో.. శ్రీకాంత్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో పట్టణంలోని నిజాంపట్నంరోడ్డులో ఉన్న ఓ లాడ్జిలో రూమ్ తీసుకుని మద్యం సేవిస్తూ.. అందులో పురుగుమందు కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం రూమ్‌బాయ్ తలుపు కొట్టినప్పటికి తీయకపోవడంతో అనుమానంతో.. తలుపు తీసి చూడగా శ్రీకాంత్ అచేతనంగా పడి ఉండడం గమనించాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. ఎస్ఐ రాజశేఖర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కనగాలలో భారీ దొంగతనం



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

చెరుకుపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): దొంగతనాలకు కొద్ది రోజులు విరామమిచ్చిన దొంగలు మళ్లీ రెచ్చిపోయారు. శుక్రవారం తెల్లవారుజామున కనగాల గ్రామంలో భారీ దొంగతనానికి పాల్పడ్డారు. షేక్ షౌకత్ ఆలీ అనే వ్యక్తి గురువారం రాత్రి తెనాలిలోని బంధువుల పెళ్లికి వెళ్లగా.. ఇదే అదునుగా దొంగలు ఇంటిలో దొంగతనం చేశారు. ఇంటికి వెనుక తలుపులు తొలగించి.. లోపలున్న బీరువాలోని రూ.4లక్షల నగదు, నాలుగు సవర్ల బంగారం, వెండి ఆభరణాలు దొంగిలించారు. ఇరుగుపొరుగు గమనించి ఇంటి యజమానికి సమాచారం ఇచ్చారు. బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ టి.అనిల్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది.

తిరుమలలో భాష్యం రామకృష్ణ అన్నదానం



అన్నదాన సత్రంలో భోజనం వడిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య),జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌కు.. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ ఆకాంక్షించారు. శుక్రవారం లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు.. ఒక రోజు అన్నదానానికి గురువారం భాష్యం రామకృష్ణ రూ.44 లక్షల విరాళమిచ్చారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి డీడీని అందజేశారు. తిరుమలలోని శ్రీతరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రంలో రామకృష్ణ స్వయంగా భక్తులకు వడ్డన చేశారు. భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, టీటీడీ అడిసినల్ ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు దోపిడీ..

- ఎనిమిది సవర్ల బంగారం, రూ.2లక్షల నగదు చోరీ



చోరీ జరిగిన బీరువా

మాచవరం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమవరం గ్రామంలో పట్టపగలు భారీ దోపిడీ జరిగింది. సేకరించిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గుర్రం గురవారెడ్డి గృహంలో బీరువాలో ఉన్న సుమారు ఎనిమిది సవర్ల బంగారం, రూ.2 లక్షల నగదును గుర్తుతెలియని వ్యక్తులు దోపిడీ చేశారు. గురవారెడ్డి పనుల నిమిత్తం పిడుగురాళ్ల వెళ్లగా..అతని భార్య కనకమ్మ పొలానికి వెళ్లింది. ఇదే అదునుగా గుర్తుతెలియని వ్యక్తులు తాళం తీసుకొని లోపలకు వెళ్లి.. బీరువాలో ఉన్న బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. తిరిగొచ్చిన కనకమ్మ ఇల్లు, బీరువా తలుపులు తీసి ఉండటాన్ని గమనించింది. చోరీ జరిగిందని గుర్తించి.. భర్తకు సమాచారం ఇచ్చింది. బాధితులు చోరీపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

టిప్పర్ ఢీకొని మహిళ మృతి



టిప్పర్ ఢీకొని మృతి చెందిన మహిళ, విలపిస్తున్న భర్త

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నడిచి వెళ్తున్న దంపతులపైకి టిప్పర్ లారీ దూసుకు రావడంతో భార్య అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..భట్టిప్రోలు గ్రామానికి చెందిన కుక్కల శ్రీను భార్య రాజకుమారితో (37) కలిసి వెల్లటూరు రహదారి మార్గంలో నడిచి వెళ్తున్నాడు. చెరుకుపల్లి నుంచి ఓలేరు ఇసుక రీచ్‌కు వెళ్తున్న టిప్పర్ లారీ వెనుక నుంచి రాజకుమారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె తల నుజ్జునుజ్జు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. భార్య మృతదేహాన్ని చూసి భర్త విలపించడం అందరినీ కలచి వేసింది. మృతురాలి భర్త శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.శివయ్య తెలిపారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహాన్ని తరలించామన్నారు.

అరాచక శక్తులను అణచివేస్తాం: ఎమ్మెల్యే ధూళిపాళ్ల

- బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా

పొన్నూరు, జనవరి23(ఆంధ్రజ్యోతి): పొన్నూరు ప్రాంతంలో అరాచక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని, దౌర్జన్యకారులను అణచివేస్తామని.. అవసరమైతే బహిష్కరిస్తామని స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ హెచ్చరించారు. పట్టణంలో ఇటీవల అత్యాచారానికి గురైన బాధిత మహిళను శుక్రవారం ఎమ్మెల్యే పరామర్శించి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3 లక్షలు ఎక్స్‌గ్రేషియాను బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం శాంతిభద్రతలు నెలకొల్పడానికి ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అరాచక పాలన, దౌర్జన్యకాండ నేటికీ కొనసాగించాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బలహీనులపై రాజకీయ ముసుగులో దౌర్జన్యాలు చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజల సహకారంతో పొన్నూరు పట్టణంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా నీడలోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీవర్స్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

రుణాల రికవరీలో నిర్లక్ష్యం వీడాలి

- జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన

గుంటూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రుణాల రికవరీలో అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలని జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు సూచించారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో శుక్రవారం బ్యాంకు బ్రాంచ్ మేనేజర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని బ్రాంచ్‌ల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొండి బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించామని తెలిపారు. రుణాల రికవరీలో ఎవరు నిర్లక్ష్యం చేసినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో వీవీఎస్ ఫణికుమార్ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న చైర్మన్ మక్కెన, మేనేజర్లు

కారుణ్య నియామకాలపై ఆందోళన

గుంటూరు సిటీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): విధుల్లో మరణించిన జడ్పీ, మండల పరిషత్ ఉపాధ్యాయుల వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యాలయం ఎదుట బాధితులు శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏడేళ్లుగా నియామకాల కోసం ఎదురుచూస్తున్నామన్నారు. గత ప్రభుత్వం నిబంధనల కారణంగా అనేక కుటుంబాలు ఉద్యోగ అవకాశాలు కోల్పోయి సంక్షోభంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసినప్పుడు సానుకూలంగా స్పందించారని గుర్తుచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సుమారు 980 మంది కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. హృదయ రాజు, చిరంజీవి, రఘునాథ్‌రెడ్డి, మెహిదా, సంపత్‌బాబు పాల్గొన్నారు.

భూ సమీకరణ మినహాయింపుల సమీక్షకు కమిటీ

గుంటూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలోని భూ సమీకరణ పథకంలో మినహాయింపులను సమీక్షించేందుకు జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జేసీ చైర్మన్‌గా, రెవెన్యూశాఖ నామినేట్ చేసిన ఎవరైనా ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కన్వీనర్‌గాను, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ, జిల్లా పంచాయతీ అధికారి, విపత్తుల నిర్వహణ సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌ను సభ్యులుగా నియమిస్తూ ఆదేశాలిచ్చింది.

తలకెక్కిన పైశాచికంపై విచారణ

- వివాదాస్పదమైన ములకలూరు జడ్పీ హైస్కూల్ ఘటన
- విద్యార్థులతో టైల్స్ మోయించిన హెచ్‌ఎం
- నిరాకరించిన వారిని ఎండలో మోకాళ్లపై కూర్చోబెట్టి దండన
- సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎంఈవోకు ఆర్జేడీ ఆదేశం



ఎండలో మోకాళ్లపై విద్యార్థులు

గుంటూరు(విద్య), జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలకు చదువుకునేందుకు వచ్చిన పేద విద్యార్థులతో బరువైన ఫ్లోరింగ్ టైల్స్ మోయించడమే కాకుండా.. ఆ పని చేయని విద్యార్థుల్ని ఎండలో మోకాళ్ల కూర్చోబెట్టి ఓ ప్రధానోపాధ్యాయురాలు పైశాచిక ఆనందం పొందడంపై ఉన్నతాధి కారులు విచారణకు ఆదేశించారు. పల్నాడు జిల్లా నుజెండ్ల మండలం ములకలూరు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న టి.శ్రీలక్ష్మి పాఠశాలలో విద్యార్థులతో గురువారం ఫ్లోరింగ్ టైల్స్ మోయించారు. మోయడం చేతకాని విద్యార్థులు వాటిని చేతులు, వేళ్ల మీద వేసుకుని గాయపడినా ఆమె పట్టించుకోలేదు. పైగా టైల్స్ మోయలేదని కొంతమంది విద్యార్థులను మోకాళ్లపై ఎండలో కూర్చోబెట్టింది. ఇప్పుడు ఈ దృశ్యాలు ఉమ్మడి గుంటూరు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. ప్రధానోపాధ్యాయురాలు నిర్వాకాన్ని కొందరు గ్రామస్తులు వీడియోలు, ఫొటోలు తీసి సమాజిక మాధ్యమాల్లో పెట్టారు.

అదినుంచి అదే తీరు..

హెచ్‌ఎంగా శ్రీలక్ష్మి గతంలో సమగ్రశిక్షలో అసిస్టెంట్ జీసీడీవోగా పనిచేశారు. అక్కడ ఉన్న సమయంలో ఎనాడూ విధులకు సక్రమంగా హాజరు కాలేదు. పైగా సిబ్బందిపై కర్రపెత్తనం, జులుం ప్రదర్శించేశారు. సమగ్ర శిక్ష పథకాల అమలులో అనేక ఆరోపణలు ఎదుర్కొన్నారు. దీంతో విసిగిపోయిన ఉన్నతాధికారులు ఆమెను తిరిగి పాఠశాలకు పంపారు. ఆమె పనిచేసిన ప్రతిచోట విధి నిర్వహణలో తీవ్ర అలసత్వం, నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలలో అధికంగా పది పరీక్షల ఫీజు, టీసీ ఇచ్చే సమయంలో విద్యార్థుల నుంచి రూ.200 నుంచి రూ. 500 వరకు పాఠశాల అభివృద్ధి పేరుతో వసూలు చేసి స్వాహా చేస్తున్నారని గ్రామస్థులు ఎంఈవోకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇక తాజా ఘటనతో విద్యాశాఖలో తీవ్ర దుమారం రేగింది. దీంతో హెచ్‌ఎం శ్రీలక్ష్మి తీరుపై విచారణకు ఉన్నతాధికారులు ఆదేశించారు. విద్యార్థులతో టైల్స్ మోయించడం, ఎండలో మోకాళ్లపై కూర్చోబెట్టిన ఘటపై సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని నూజెండ్ల ఎంఈవోను ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి ఆదేశించారు.



టైల్స్ మోస్తున్న విద్యార్థులు



టైల్స్ పడడంతో గాయపడిన విద్యార్థుల వేళ్లకు బ్యాండేజీలు

సీఎం, లోకేశ్‌పై సోషల్ మీడియా దూషణలు..కేసులు నమోదు

పెదకూరపాడు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారకరామారావు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లను దూషిస్తూ గనిబీమ్లా బాయ్, పీఎన్ హరిణి ట్విట్టర్(ఎక్స్) ఖాతాల్లో పోస్టులు చేయడంతో.. మండలంలోని అబ్బరాజుపాలేనికి చెందిన కొండవీటి ప్రసాద్, పరస గ్రామానికి చెందిన సరిపూడి శివకృష్ణ స్థానిక పోలీస్ స్టేషన్లో శుక్రవారం వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐలు జి.గిరిబాబు, అల్లూర రెడ్డి తెలిపారు. అలాగే సీఎం నారా చంద్రబాబునాయుడిని దూషిస్తూ ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్టులపై చర్యలు తీసుకోవాలని మండలంలోని జలాలపురం గ్రామానికి చెందిన సరిపూడి గోపి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	170, 179, 190
చికెన్ విత్ స్కిన్(కిలో)	330.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	340.00

మిర్చియార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	72,383	
అమ్మకాలు	79,560	
నిల్వ	12,257	
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	22000
నెంబరు. 5	13500	22000
273	----	----
341	14000	24500
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	20500
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	23000
దేవనూరు డీలక్స్	14000	25000
ఆర్మూరు	12000	17500
ఏసీ కామన్ వెరైటీ		
334	13500	19500
నెంబరు. 5	13500	21000
273	----	----
341	13000	22500
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13500	20000
బ్యాడిగి 355	13500	21000
దేవనూరు డీలక్స్	14000	22000
తాలుకాయలు	7000	11000

గుంటూరు సిటీ వార్తలు



సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ శ్రీవాస్తవ తదితరులు

సుభాష్ చంద్రబోస్ జీవితం స్ఫూర్తిదాయకం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు(తూర్పు), జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్రోద్యమంలో అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించి దేశభక్తిని చాటుకున్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సంద ర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి జేసీ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి ఘనంగా నివాళుల ర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, డీటీసీ సీతారామిరెడ్డి, ఆర్టీవో శ్రీహరి, జిల్లా రిజిస్ట్రార్ శైలజ, డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి, ఆర్టీసీ ఆర్ఎండీ తదితరులు పాల్గొన్నారు.

25న జాతీయ ఓటర్ల దినోత్సవం : కలెక్టర్

గుంటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఈ నెల 25వ తేదీన జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఎన్నికల నమోదు అధికారులు, జిల్లా అధికారులతో ఆమె శుక్రవారం టెలికాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కలుగజేయుటకు విభిన్న కార్యక్రమాలను నిర్వహిం చాలని అన్నారు. యువతను ఇందులో భాగస్వామ్యం చేయాలని తెలి పారు. ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని ప్రజాస్వామ్యంలో ఓటరు పాత్ర తెలియజేయాలని చెప్పారు. ఓటు వజ్రాయుధమని దాని విలువ ఎంతో గొప్పదని కలెక్టర్ పేర్కొన్నారు. ఓటరు దినోత్సవంలో భాగంగా శుక్రవారం ప్రభుత్వ కార్యాలయాల్లో ఓటరు ప్రతిజ్ఞను నిర్వహించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలి

- కమిషనర్ మయూర్ అశోక్



ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ అశోక్, ఏసీ, నగరపాలక సంస్థ ఉద్యోగులు

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని, బీఎల్ఏలు ఎప్పటికప్పుడు ఓటు నమోదుపై అవగాహన కలిగించాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎలక్టోల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్), నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమా వేశ మందిరంలో పశ్చిమ నియోజకవర్గ ఎలక్టోల్ రిజిస్ట్రేషన్ అధికారి చల్లా ఓబులేసుతో కలిసి నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బందితో ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఈఆర్‌లు రాంబాబు, బి.శ్రీనివాసరావు, మేనేజర్ బాలాజీ బాష, విభాగ సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దంత వైద్య రంగంలో సిబార్ పరిశోధనలు అభినందనీయం

- ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ పి.చంద్రశేఖర్
- సిబార్‌లో అధునాతన డిజిటల్ డెంటిస్ట్రీ ల్యాబ్ ఏర్పాటు

పెదకాకాని, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): దంత వైద్యరంగంలో సిబార్ డెంటల్ కళాశాల చేస్తున్న పరిశోధనలు అభినందనీయమని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. మండల పరిధిలోని తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్యకళాశాలలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన డిజిటల్ డెంటిస్ట్రీ ల్యాబ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ దంత వైద్యంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ల్యాబ్‌ను ఏర్పాటు చేసినందుకు సిబార్ యాజమాన్యాన్ని అభినందించారు. పరిశోధన రం గంలో సిబార్ పురోగతిని కొనియాడారు. సిబార్ కళాశాల డీన్ డాక్టర్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ డిజిటల్ డెంటిస్ట్రీ అనేది అధునాతన సాంకేతికతను ఉపయోగించి కంప్యూటర్ ఆధారిత డిజైన్ సహాయంతో కృత్రిమ దంతాలను అమర్చడం, స్మైల్ డిజైనింగ్ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కృష్ణ మోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ రేవతి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అధునాతన డిజిటల్ డెంటిస్ట్రీ ల్యాబ్ ప్రారంభిస్తున్న ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్, పక్కన డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్ తదితరులు

మాతృ మరణాలను పూర్తిగా నియంత్రించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ

గుంటూరు మెడికల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసులను సాధ్యమె నంత త్వరగా ఉన్నత స్థాయి ఆరోగ్య కేంద్రాలకు పంపించడం ద్వారా మాతృ మరణాలను నివారించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఛాంబర్‌లో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లా డారు. గర్భిణీలను వీలైనంత త్వరగా నమోదు చేయటం, క్రమం తప్ప కుండా పరీక్షలు చేయుట, మధుమేహం, రక్తపోటు నియంత్రణలో జాగ్ర త్తలు తీసుకోవడం ద్వారా ఆశా కార్యకర్త, ఆరోగ్య కార్యకర్త, సూపర్వైజర్లు, వైద్యాధికారి మాతృ మరణాలు జరగకుండా పర్యవేక్షించా లని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మాతృ మరణాల నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఏ శ్రావణ్ బాబు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు, ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

నూతన భవన సముదాయానికి రూ.6 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళా శాల రోడ్డులోని కమ్మ జన సేవాసమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మి స్తున్న వస తి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ.6 లక్షలను పెదనందిపాడు మండలం, రావిపాడు గ్రామానికి చెందిన కొమ్మినేని మహేశ్వరరావు, కొమ్మినేని వెంకటేశ్వరరావు ప్రకటించారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్, బాలికల వసతి గృహంలో కమ్మజన సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు మల్లెల హరేంద్రనాద్ చౌదరి, కన్నెగంటి బుచ్చయ్య చౌదరికి ఈ చెక్కును అందజేశారు. అనంతరం దాతలను సమితి సభ్యులు ఘనంగా సత్కరించా రు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కావూరి రవిచంద్ర, ప్రత్యేక ఆహ్వానితులు పెద్ది సాంబశివరావు, డాక్టర్ పోసాని వెంకటప్పయ్య, మైనేని సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



కమ్మ జన సేవాసమితి సభ్యులకు చెక్కును అందజేస్తున్న కొమ్మినేని మహేశ్వరరావు, కొమ్మినేని వెంకటేశ్వరరావు

అమ్మ వారికి నాదార్చన

గుంటూరు(తూర్పు), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట, శ్రీ గౌరీశంకరనిలయంలో శ్రీభారతి సంగీతానిలయం వ్యవస్థాపక అధ్య క్షురాలు వీణ శారద భారతీదేవి ఆధ్వర్యంలో వారి శిష్య బృందంతో కలిసి శుక్రవారం శ్రీపంచమి సందర్భంగా శ్రీసరస్వతి అమ్మవారిపై, సరసింహ స్వామిపై అనేక కీర్తనలను వీణపై పలికించి నాదార్చన నిర్వహించారు.



కేక్ కట్ చేస్తున్న కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కనపర్తి శ్రీనివాసరావు, యూత్

అట్టహాసంగా మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు

- ఊరూరా.. వాడవాడలా తెలుగు తమ్ముళ్ల సంబరాలు
- ప్రజాప్రతినిధుల నేతృత్వంలో భారీ కార్యక్రమాలు
- కేక్ కటింగులు, బైక్ ర్యాలీలు, రక్తదానం.. అన్నదానాలు

గుంటూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్ర ధాన కార్యదర్శి, యువనేత, మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు శుక్ర వారం అట్టహాసంగా జరిగాయి. గుంటూరులోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయం మొదలు, డివిజన్ కార్యాలయాల వరకూ వాడవాడలా లోకేశ్ పుట్టినరోజు వేడుకలు జరిగాయి. జిల్లాలోని తెలుగు తమ్ముళ్లతోపాటు కూటమి నేతలు అందరూ లోకేశ్ జన్మదిన వేడుకల్లో పాల్గొని సందడి చే శారు. భారీ కేకులు కట్‌చేసి లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. చాలా చోట్ల తమ్ముళ్లు బైక్ ర్యాలీ లు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహిం చి లోకేశ్‌కు ఆశీస్సులు అందించారు.

- టీడీపీ జిల్లా కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ తదితర నాయకుల ఆధ్వర్యం లో మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.
- గుంటూరు తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో మంత్రి లోకేశ్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. కార్యాలయంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించి రక్తదానం చేశారు.
- గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో లోకేశ్ అభిమానులు, టీడీపీ కార్యకర్తలతో కలిసి ఆమె భారీ కేక్‌ను కట్ చేసి తినిపించి యువనేతకు శుభాకాంక్షలు తెలిపారు.
- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. కనపర్తి నేతృత్వంలో నగరంలోని వికాస్ నగర్ నుంచి లాడ్జి సెంటర్ వరకు ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. .
- ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ నేతృత్వంలో గుంటూరు నగర కార్యాలయంలో లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి పార్టీ శ్రేణులకు తినిపించి యువనేతకు డేగల శుభాకాంక్షలు తెలిపారు.



గుంటూరు నగర కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్

- విభిన్న ప్రతిభావంతుల ఆదరణ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన నారాలోకేశ్ జన్మదిన వేడుకలకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హాజరై కేక్ కట్ చేసి లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



దుప్పట్లు, దుస్తులు అందుకున్న మానసిక దివ్యాంగులతో గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఆనందరెడ్డి తదితరులు

- రాష్ట్ర ప్రజల భవితకు నారా లోకేశ్ వారధిగా నిలబడ్డార ని నారా లోకేశ్ అభి మాన సంఘం (గ్లోబల్) జాతీయ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి అన్నారు. సం ఘం ఆధ్వర్యంలో గుంటూ రులోని సెయింట్ ఆన్స్ మనోవికాస కేంద్రంలో నారా లోకేశ్ జన్మదిన వేడుకలు మానసిక దివ్యాంగుల మధ్యన ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు హాజరై కేక్ కట్ చేశారు.



విద్యార్థినులతో కలిసి కేక్ కట్ చేస్తున్న శ్రీవికాస్ విద్యా సంస్థల అధినేత దాసరి రాజామాస్టారు

- గుంటూరు నెహ్రూ నగర్‌లోని శ్రీవికాస్ విద్యా సంస్థల ఆవరణలో శుక్రవారం మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి, ఈ వేడుకల్లో విద్యా సంస్థల అధినేత దాసరి రాజామాస్టారు ముఖ్యఅతిథిగా హాజరై, కేక్ కట్ చేశారు,



ఆర్టీసీ బస్టాండ్‌లో కేక్ కట్ చేస్తున్న వీరవల్లి మురళి, రాజేష్ కార్మిక పరిషత్ నాయకులు

- కార్మిక పరిషత్ జిల్లా కార్యదర్శి మండవ రాజేష్ ఆధ్వర్యంలో శుక్ర వారం మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఎన్‌టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఘనంగా జరిగాయి. కార్మిక పరిషత్ నాయకులు, ఉద్యోగుల సమక్షంలో టీడీపీ నేత, ఆ పార్టీ ఆర్టీసీ అనుబంధ విభాగం కార్మిక పరిషత్ జిల్లా గౌర వాధ్యక్షుడు వీరవల్లి మురళీ కేక్ కట్ చేశారు.
- గుంటూరు(కార్పొరేషన్), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలకిచ్చిన మాటపై నిలబడే నాయకుడు రాష్ట్ర ఐటీ శాఖ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. శుక్రవారం నారా లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా మేయర్ ఛాంబర్‌లో డిప్యూటీ మేయర్ షేక్ సజీలాతో కలిసి కేక్ కట్ చేసి కార్పొరేటర్లకు, అభిమానులకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.
- గుంటూరు సిటీ, జనవరి 23 (ఆంధ్ర జ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వ హించారు. జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడు తూ రానున్న రోజుల్లో నారా లోకేశ్‌ను ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్య దర్శి డాక్టర్ కత్తెర సురేష్‌కుమార్ మాట్లాడుతూ దావోస్‌లో పెట్టుబడుల కోసం పర్యటిం చడం లోకేశ్ అంకితభావానికి నిదర్శనమ న్నారు. ఈ సందర్భంగా జన్మదిన కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జడ్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సురేష్ కుమార్

గణతంత్ర వేడుకల్లో ప్రదర్శనకు విజ్ఞాన్ విద్యార్థినుల ఎంపిక



యశస్విని, శుభ గాత్రి

గుంటూరు (విద్య), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శనకు, ఎన్‌సీసీ పేరేడ్‌లో పాల్గొనేందుకు పలకలూరులోని విజ్ఞాన్ నిరులా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల తరపున కూచిపూడి నాట్య ప్రదర్శనలో విద్యార్థిని బీరక యశస్వి, ఎన్‌సీసీ పరేడ్‌లో శుభగాత్రి పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల్ని విజ్ఞాన విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్‌చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు విద్యార్థినులను అభినందించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీపంచమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుంటూరు(తూర్పు), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై ఆల యపాలక మండలి, భారతీధార్మిక విజ్ఞాన పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీపంచమి వేడుకలు శుక్రవా రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేకంగా అలంక రించి వేదికపై అమ్మవారి ఉత్సవమూర్తికి అభిషేకాలు, అలంకరణ జరిగాయి. కమ్మ హస్టల్ విద్యార్థినులు శ్రీ సరస్వతీ పూజలో పాల్గొన్నారు.

శ్రీ మేథాలో...



పూజలో పాల్గొన్న విద్యార్థులు, డైరెక్టర్ శ్రీలక్ష్మీ తదితరులు

గుంటూరు(విద్య), జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలోని శ్రీమేథా విద్యా సంస్థల్లో శుక్రవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్థల చైర్మన్ సీఏ అన్నా నందకిషోర్ మాట్లాడుతూ ఈ వసంత పంచమి వేడుకలు విద్యార్థుల్లో విద్యా సక్తిని పెంపొందించి జ్ఞాన సముపార్జనకు దోహదం చేస్తాయని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ అన్నా శ్రీలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగ రణభేరిని జయప్రదం చేయండి

గుంటూరు(తూర్పు), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత యువజన సమైఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 30న జరిగే చలో విజయవాడ- నిరుద్యోగ రణభేరి కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని ఆ సమైఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలీ పిలుపుని చ్చారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జంగాల చైతన్య, బన్నీ, అజయ్, నాగూర్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక శిక్షణ

గుంటూరు(విద్య),జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ట్రాన్స్ జెండర్ వ్యక్తులు, విభి న్న ప్రతిభావంతులకు పోటీ పరీక్షలకు, నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ప్రత్యేక కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్ జెండర్స్, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు డి. దుర్గాబాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ శిక్షణ పూర్తిగా ఉచితమని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న వారు ౖఇఛీఛీఛిౖఇజౌ౧.జీఅనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముగిసిన శ్రీకనకదుర్గమ్మ ఆలయ వార్షిక వేడుకలు

గుంటూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా జరుగుతున్న పొన్నూరు రోడ్డు సంగడిగుంటలో ఉన్న శ్రీకనకదుర్గమ్మ ఆలయ వార్షిక వేడుకలు శుక్రవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయంలో సాము హిక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, మోరబోయిన నరసింహరావు, తదితరులున్నారు.

- ఏటుకూరు రోడ్డులోనున్న శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాలు నాలుగో రోజు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం వసంత పంచమి సందర్భంగా భక్తులు అమ్మవా రి సామూహిక కుంకుమార్చనలకు హాజరయ్యా రు. కార్యక్రమంలో ఏపీ ఆర్యవైశ్య మహాసభ ఈసీ సభ్యుడు కొనకళ్ళ సత్యం, కోట వెంకటశేషగిరి రావు, నగేష్, ప్రవీణ్, శ్రీనివాసబాబు తదితరులున్నారు.

నూతన ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం

గుంటూరు(క్రీడలు), జనవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టాభిపురం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో శుక్రవారం నూతనంగా 10(ఏ) ఆంధ్ర గర్ల్స్ ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి గుంటూరు కమాండింగ్ ఆఫీసర్, లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్, సూపరింటెండెంట్ రాజశేఖర్, బాలికల కాడెట్ ఇన్‌స్ట్రక్టర్ లావణ్య పాల్గొని నూతన యూనిట్‌ని ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నూతన ఎన్‌సీసీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ సుదర్శన్

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు కత్తిపోట్లు

- హత్యాయత్నానికి పాల్పడిన ఓల్డ్ స్టూడెంట్

గుంటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దపలకలూరులో ఓ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కత్తిపోట్లకు గురయ్యారు. పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన పంగులూరి శివరామకృష్ణ అనే ఓల్డ్ స్టూడెంట్ శుక్రవారం సాయంత్రం కళాశాల క్యాంపస్‌లో ప్రిన్సిపాల్‌పై కత్తితో దాడికి పాల్పడ్డాడు. రామకృష్ణ వీపుపై బలంగా కత్తితో పొడవడంతో ఆయనకు బలమైన గాయమైంది. తోటి సిబ్బంది ఆయనను వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాలతో బయటపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కారంపూడికి చెందిన పంగులూరు శివరామకృష్ణ ప్రస్తుతం జేకేసీ కళాశాలలో బీసీఏ మూడో సంవత్సరం చదువుతున్నాడు. గతంలో ఇంట ర్మీడి యట్ చదివే సందర్భంలో జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఉండేవాడు. అయితే హాస్టల్‌లో ఉన్న సమయంలో చేతులు కోసుకుంటూ విద్యార్థులను భయాందోళ నకు గురి చేస్తుండటటంతో ప్రిన్సిపాల్ వారి కుటుంబసభ్యులను పిలిపించి హాస్టల్ నుంచి పంపించేశారు. దీంతో బయట నుంచి కళాశాలకు వచ్చి ఇంటర్ పూర్తి చేశాడు. ప్రస్తుతం జేకేసీ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువు తున్నాడు. ఇంటర్ చదువులో తనను హాస్టల్ నుంచి బయటికి పంపాడని ప్రిన్సిపాల్‌పై కసి పెంచుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం జూనియర్ కళాశాల క్యాంపస్‌కు వెళ్లి ప్రిన్సిపాల్‌ను కలిసి మాట్లాడుకుంటూ మెయిన్ గేటు వద్దకు వచ్చారు. గేటు వద్దకు రాగానే ఒకసారిగా శివరామకృష్ణ తన వెంట తెచ్చుకున్న కత్తిని తీసి ప్రిన్సిపాల్‌ను తిడుతూ వీపుపై పొడిచాడు. ప్రిన్సిపాల్ కేకలు వేయడంతో తోటి సిబ్బంది పరుగెత్తుకుంటూ వెళ్లారు. శివరామకృష్ణ అక్కడ నుంచి పారి పోయాడు. సిబ్బంది ప్రిన్సిపాల్‌ను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. క్యాంపస్ ఇన్‌చార్జి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కార మే లక్ష్యంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఆమె ప్రజాగ్రీవెన్స్ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలు, వారి వినతులు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యే యమని చెప్పారు. నియోజకవర్గంలో ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తూ, సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు పర్యవేక్షిస్తున్నానని చెప్పారు.

ఔషధ పరిశోధనలో విస్తరిస్తున్న కృత్రిమ మేథ

- మంగళయాతన్ వర్సిటీ వీసీ డాక్టర్ సాంబశివరావు
- చిప్స్‌లో ముగిసిన అంతర్జాతీయ ఫార్మా సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ కేఆర్ఎస్ సాంబశివరావు

గుంటూరు(విద్య), జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఔషధ పరిశోధనలో కృత్రిమ మేధస్సు, బయోటెక్నాలజీ వంటి ఆధునిక సాంకేతికత పరిజ్ఞానం విస్తరిస్తోందని ఇందుకు అనుగు ణంగా యువ ఫార్మానిపుణులు సన్నద్ధం కావాలని మంగళయాతన్ వర్సిటీ(జబల్‌పూర్) వీసీ డాక్టర్ కేఎస్ఆర్ సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. రెండురోజులుగా చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ 'ఎమర్జింగ్ ఇన్నోవేషన్స్ ఇన్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అండ్ డ్రగ్ డిస్కవరీ' అనేపేరుతో నిర్వహిస్తున్న ఫార్మాసదస్సు 20226 శుక్రవారం ముగిసింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ ఔషధ పరిశోధనలో సమన్వయం ఎంతో కీలకమని చెప్పారు. భారతదేశం ప్రపంచ ఔషధ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్య క్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ సీఎన్ శ్రీనివాస్, కోశాధికారి రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర తదితరులు పాల్గొన్నారు.

ఆటలో పాల్గొనడమే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది

- క్విజ్ మాస్టర్ డాక్టర్ సయ్యద్ అమీర్ మెహబూబ్

గుంటూరు(విద్య), జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆటల్లో గెలుపోటములు సహజమని, ఆటలో పాల్గొనడమే ప్రధానమని అదే మీలో స్ఫూర్తిని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుం దని ప్రముఖ క్విజ్ మాస్టర్ డాక్టర్ సయ్యద్ అమీర్ మెహబూబ్ అన్నారు. శుక్రవారం గోరంట్లలోని భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరగనున్న భాష్యం లెక్సికన్ లీగ్ ఏ స్పెల్‌బీ వర్డ్ ఒడిస్సీ 2025-26 పేరుతో సెంట్రల్ లెవల్ లెక్సికన్ లెజెండ్స్ క్విజ్ పోటీలను మొదటి రోజు ఆయన ప్రారంభించారు. పోటీలకు క్విజ్ మాస్టర్‌గా వ్యవహ రించారు. కార్యక్రమానికి అతిథిగా భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ హాజరయ్యారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మెహబూబ్, సాకేతరామ్ తదితరులు

ఫాసిజానికి వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాలి

- అఖిల భారత విద్యాహక్కుల వేదిక ఉపాధ్యక్షుడు రమేష్‌పట్నాయక్

గుంటూరు(తూర్పు), జనవరి 23(ఆంధ్రజ్యోతి): దేశంలో 11 సంవత్స రాలుగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఫాసిజం ప్రమాదకర స్థాయికి చేరిందని, దానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరముందని అఖి ల భారత విద్యాహక్కుల వేదిక ఉపాధ్యక్షుడు డి.రమేష్‌పట్నాయక్ అన్నారు. ఆల్ ఇండియా దళిత రైట్స్ మూమెంట్ (ఏఐడీఆర్ఎం)- దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జాతీయ సమితి సమావేశాలు గుంటూరు లోని జిల్లా సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి, సభకు రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 'మనుస్మృతి-భారత రాజ్యాంగం- అంబేద్కర్ ఆలోచన' అనే అంశంపై జరి గిన సదస్సులో రమేష్ పట్నాయక్ ప్రసంగించారు. ప్రతి ప్రజా ఉద్యమంలో భాగంగా మతోన్మాదానికి వ్యతిరేక పోరాటం ఉండాలన్నారు. ట్రేడ్ యూని యన్లు తమ పోరాటాల్లో భాగంగా మతోన్మాదాన్ని ఎదుర్కోవాలన్నారు. ఎస్వీ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ బీవీ మురళీధర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఏఐడీ ఆర్ఎం జాతీయ అధ్యక్షుడు రామ్మూర్తి, జంగాల అజయ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు.



మాట్లాడుతున్న రమేష్‌పట్నాయక్, వేదికపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తదితరులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జేకేసీ కళాశాల రోడ్డులో విద్యుత్ లైన్ ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించటంలో భాగంగా శనివారం ఉద యం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయను న్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు. అలానే లక్ష్మీపురం మెయిన్ రోడ్డు, చంద్రమౌళీనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

సర్వే పనులు చెప్పొద్దు..

- వీఏవోలను ఈ-పంట నమోదు చేయనివ్వండి
- కలెక్టర్లకు వ్యవసాయశాఖ డైరెక్టర్ లేఖ
- ఫిబ్రవరి 20వరకు సర్వేలకు వాడొద్దని సూచన
- క్రాప్ బుకింగ్‌పై దృష్టిపెట్టాలని డీఏవోలకు ఆదేశం

గుంటూరు సిటీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఒక వైపు ఈ-పంట నమోదు.. మరో వైపు సచివాలయంలోని సర్వేలతో సతమతం అవుతున్న క్షేత్రస్థాయి సిబ్బందికి వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఊరట కల్పించారు. గ్రామ, వార్డు సచివాలయంలో పనిచేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు వచ్చే నెల 20వ తేదీవరకు వేరే పనులు కేటాయించవద్దని కోరుతూ కలెక్టర్లలకు లేఖ రాశారు. రబీకి సంబంధించి పంట నమోదు జరుగుతున్నందున విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు సర్వేలు అప్పగించవద్దని సూచించారు. రబీ పంట నమోదు గత ఏడాది డిసెంబరు చివరి వారం నుంచి ప్రారంభమైంది. జనవరి ముగుస్తున్నా.. ఈ ప్రక్రియలో పెద్దగా పురోగతి తేలింది. కారణాలు విశ్లేషించగా.. సచివాలయం పరిధిలో పనిచేస్తున్న వ్యవసాయ ఎంపీడీఓలు ఇతర పనులు కూడా అప్పగించినట్లు తేలింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ తక్షణమే చర్యలు చేపట్టారు.

పల్నాడులో నత్తనడకన..

క్రాప్ బుకింగ్ ప్రక్రియ పల్నాడు జిల్లాలో నత్తనడకన సాగుతోంది. 6,87,802 పార్సిల్స్(కమతాలు) నమోదు జరగాల్సి ఉండగా.. కేవలం 47,034 పార్సిల్ మాత్రమే పూర్తిచేశారు. ఇంకా 6,40,768 పార్సిల్స్‌లో పంట నమోదు జరగాల్సి ఉంది. గుంటూరు జిల్లాలో 4,14,509 పార్సిల్స్‌లో పంటనమోదు జరగాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 40,916 పార్సిల్స్‌లో బుకింగ్ ప్రక్రియ ముగిసింది. బాపట్ల జిల్లాలో 7,97,512 పార్సిల్స్‌లో క్రాప్ బుకింగ్ జరగాల్సి ఉండగా 1,14,228 పార్సిల్స్‌లో పంటనమోదు ముగిసింది. పంటనమోదు ప్రక్రియను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నందున జిల్లా వ్యవసాయ అధికారులు గ్రామాలకు వెళ్లి సిబ్బంది పనితీరును పరిశీలిస్తున్నారు. తక్కువ బుకింగ్ జరిగేచోట పూర్తిస్థాయిలో శ్రద్ధపెట్టేలా అధికారులను ఇన్‌చార్జిలుగా నియమిస్తున్నారు.

అంతరిక్షమే 'నాలుగో యుద్ధ క్షేత్రం'



మాట్లాడుతున్న డాక్టర్ జి.సతీష్‌రెడ్డి

- డీఆర్‌డీవో మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి
- విజ్ఞాన్‌లో రెండో రోజు ఘనంగా ఏపీ స్పేస్ టెక్ సమ్మిట్
- ప్రతిష్ఠాత్మక కంపెనీలతో అవగాహన ఒప్పందాలు
- అట్టహాసంగా కొనసాగిన సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్

గుంటూరు(విద్య), జనవరి 23(ఆంధ్రజ్యోతి): 'అంతరిక్షం కేవలం పరిశోధనలకే పరిమితం కాదు. అది నేడు దేశ రక్షణలో అంతర్భాగమైంది. భూమి (ఆర్మీ), ఆకాశం(ఎయిర్‌ఫోర్స్), నీరు(నావీ)తర్వాత అంతరిక్షమే నాలుగో యుద్ధ క్షేత్రం' అని డీఆర్‌డీవో మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని వి జ్ఞాన్ యూనివర్సిటీ, అమరావతిలోని ఆంధ్రప్రదేశ్‌స్పేస్‌టెక్ అకాడమీ, హైదరాబాద్‌లోని అ నంత్ టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్ సమ్మిట్-2026 రెండోరోజు శుక్రవారం ఘనంగా కొనసాగింది. ఆంధ్రప్రదేశ్‌లో అంతరిక్ష సాంకేతిక రంగ పరిశోధనలు, ఆవిష్కరణలు, పరిశ్రమ-అకాడమీ కలయికలను ప్రోత్సహించడం ఈ సమ్మిట్ లక్ష్యం. ఈ సందర్భంగా దేశంలోని పలు ప్రతిష్ఠాత్మక కంపెనీలతో అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ జి.సతీష్ రెడ్డి మాట్లాడుతూ అంతరిక్షం మన జీవితంలో ఒక భాగం అవుతుందని సారాభాయి దశాబ్దాల క్రితమే చెప్పారని, అది నేడు అక్షరాలా నిజమైందన్నారు. ఒక్క క్షణం అంతరిక్ష సాంకేతికత నిలిచిపోతే.. కమ్యూనికేషన్ వ్యవస్థ, బ్యాంకింగ్, రవాణా, వ్యవసాయం, చివరికి టీవీచానల్స్ కూడా మూతపడతాయన్నారు. సామాన్యుడి దైనందిన జీవితం అనేది స్తంభించిపోతుందని పేర్కొన్నారు. సాధారణంగా అంతరిక్షం అనగానే ఇస్రో ప్రయోగాలు, ఉపగ్రహాల గురించి మాట్లాడుకుంటామని, కానీ, రక్షణ రంగంలో దీని పాత్రను విస్మరించలేమన్నారు. నేటికాలంలో ఏ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మొదలవ్వగానే.. మొదటగా నిర్దేశిత ప్రాంతాలపై నిఘా పెట్టేందుకు ప్రత్యేక ఉపగ్రహాలను ప్రయోగించడం జరుగుతోందన్నారు. వర్సిటీ చాన్సలర్, అనంత్ టెక్నాలజీస్ సీఎండీ డాక్టర్ పావులూరి సుబ్బారావు మాట్లాడుతూ.. భారతదేశం అంతరిక్ష రంగంలో ప్రపంచానికి దిక్సూచిగా మారుతోందన్నారు. ఈ ప్రయాణంలో విద్యార్థులు కేవలం ప్రేక్షకులుగా కాకుండా, భాగస్వాములుగా మారాలని పిలుపునిచ్చారు. ఏపీ స్పేస్ సిటీ సీఈవో కేశినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అంతరిక్ష పరిశోధనల్లో అపజయాలకు కుంగిపోకూడదని, వైఫల్యాలను ఎదుర్కోవడం నేర్చుకున్నప్పుడే గొప్ప విజయాలు లభిస్తాయని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చెప్పిన మాటలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. సమ్మిట్‌లో భాగంగా.. నిర్వహించిన సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్‌లో మొత్తం ఐదు జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయని ఆయన వెల్లడించారు. రెండో రోజు విజ్ఞాన్ వర్సిటీతో పలు ప్రతిష్ఠాత్మక కంపెనీలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. బెంగళూరులోని అమకే సొల్యూషన్స్ హెడ్ జీఎం శ్రేయాన్స్, ఓషల్ ఆర్బిట్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ గిరీష్, న్యూఢిల్లీలోని సాట్‌కామ్ ఇండస్ట్రీ (ఎస్ఐఏఐండియా) వైస్ ప్రెసిడెంట్ నవీన్, హైదరాబాద్‌లోని కార్లిటస్ ఫార్మా సొల్యూషన్స్ వైస్ ప్రెసిడెంట్ శివరామ్ అవగాహన పత్రాలు మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఏపీస్పేస్ టెక్ అకాడమీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.శేషగిరిరావు, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, వర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ కేవీ కృష్ణకిషోర్, రిజిస్ట్రార్ పీఎంవీరావు, వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోషకాల పుట్టగొడుగులు

- ప్రజల్లో విపరీతమైన ఆదరణ
- వ్యవసాయ కళాశాలలో ప్రత్యేక శిక్షణ
- నిరుద్యోగులకు ఉపాధి మార్గం
- కుటీర పరిశ్రమగా విస్తరణకు అవకాశం



బాపట్ల వ్యవసాయ కళాశాలలో పుట్టగొడుగుల పెంపకాన్ని చేస్తున్న కళాశాల విద్యార్థులు

బాపట్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పుట్టగొడుగులకు ప్రజల్లో విపరీతమైన ఆదరణ లభిస్తోంది. ప్రత్యేక వంటకాల సరసన పుట్టగొడుగులు చేరిపోయాయి. ఏ రెస్టారెంట్‌కెళ్లినా.. స్పెషల్ మెనూలో పుట్టగొడుగులతో తయారు చేసిన వంటకాలు ఉంటున్నాయి. చిరువ్యాపారులు తాజాగా పుట్టగొడుగులతో పచ్చళ్లు పెట్టి విక్రయిస్తున్నారు. దీంతో పుట్టగొడుగుల పెంపకం ఇప్పుడు మంచి లాభాలు తెచ్చి పెట్టే కుటీర పరిశ్రమగా మారింది. బాపట్ల వ్యవసాయ కళాశాలలో పుట్టగొడుగుల పెంపకంపై విద్యార్థులకు అద్భుతమైన శిక్షణ ఇస్తున్నారు. ఆహార నిపుణులు కూడా వీటి వాడకాన్ని ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో పుట్టగొడుగుల పెంపకం లాభసాటిగా మారింది.

40 రోజుల్లో దిగుబడి..

ఇందులో ప్రపంచ వ్యాప్తంగా 4 వేల రకాల జాతులున్నా.. 200 రకాలను మాత్రమే తినగలిగినవిగా గుర్తించారు. అయితే వీటిలో సాగు చేస్తున్నవి మాత్రం మూడు నాలుగు రకాలే. అవి తెల్లగుండి, ముత్యపుచిప్ప, పాలపుట్ట, వరిగడ్డి పుట్టగొడుగులు. వీటి పెంపకానికి వాతావరణంలో తేమను, ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించాల్సి ఉంటుంది. 85 నుంచి 90శాతం తేమ 16 నుంచి 18 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత, కంపోస్ట్ ఎరువు అవసరం. జూన్ నుంచి ఫిబ్రవరి వరకు వీటి పెంపకానికి అనువైన కాలం. వ్యవసాయ వ్యర్థాలు గడ్డి, చొప్ప, ఇతర పదార్థాలతో పెంచవచ్చు. 35 నుంచి 40రోజులలో పంట దిగుబడి వస్తుంది.

స్వచ్ఛత మీదే దిగుబడి ఆధారం..

పెద్దగా పెట్టుబడిలేని వ్యాపారం కనుక నిరుద్యోగ యువత స్వయం ఉపాధిగా వీటి సాగును చేపట్టవచ్చు. పుట్టగొడుగులు పెంపకానికి కావాల్సిన విత్తనాలను స్పాన్ అంటారు. స్పాన్ విత్తన తయారీ మూడు దశలలో జరుగుతుంది. మొదటిగా జొన్నల నుంచి కల్చర్‌ను తయారు చేస్తారు. దానిని పరిశుభ్రమైన జొన్నలతో చేర్చితే మైసీలియం తయారవుతుంది. ఈ మైసీలియం వ్యాపించిన జొన్నలను స్పాన్ అంటారు. స్పాన్ స్వచ్ఛత మీదే పంట దిగుబడి ఆధారపడి ఉంటుంది. పుట్టగొడుగుల పెంపకంలో విత్తనం తర్వాత కీలకమైన అంశం శుభ్రత, చీడపీడలను గుర్తించి సకాలంలో చర్యలు తీసుకోవడం. పెంపకానికి ఉపయోగించే బెడ్‌లను క్రిమికీటకాలు సోకకుండా కాపాడుకోవటం ప్రధానం. ఒకసారి పుట్టగొడుగులను కోసిన తర్వాత 24 గంటలకు మించి నిల్వ ఉండవు. నిల్వ ఉంచాలనుకుంటే తగిన విధంగా శుద్ధి చేసి ఎండపెట్టి ప్యాకింగ్ చేసుకోవాలి.

ఔత్సాహికులకు శిక్షణ కార్యక్రమాలు

బాపట్ల వ్యవసాయ కళాశాల, అచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన కృషి విజ్ఞాన కేంద్రాలలో పుట్టగొడుగుల విత్తన తయారీపై శిక్షణ ఇస్తున్నారు. పెంపకం కేంద్రాలను పెట్టుకునేందుకు చాలా మంది ఈ శిక్షణ తరగతులకు హాజరవుతున్నారు. యూనివర్సిటీ 8వారాల సర్టిఫికెట్ కోర్సును కూడా అందజేస్తుంది. పుట్టగొడుగులు నిస్సందేహంగా శాఖాహారమేనని బాపట్లలోని వ్యవసాయకళాశాల విద్యార్థులు చెబుతున్నారు. శిలీంధ్ర జాతికి చెందిన ఈ చిన్న మొక్కలలో బహుళ పోషకాలు ఉన్నాయి. పౌష్టికాహార లోపంతో బాధపడే మహిళలు, పిల్లలకు ఇవి చాలా మంచి ఆహారం. మాంసకృతులు, బి, సి విటిమన్‌లు, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు ఎక్కువగా లభిస్తాయి. ప్రతి 100 గ్రాముల పుట్టగొడుగులలో 43 కిలోల క్యాలరీల శక్తి లభిస్తుంది. వీటిలో పిల్లల పెరుగుదలకు కావాల్సిన లైసిన్, ట్రిఫ్టోఫాన్ అనే అమైనో అమ్లాలు ఉన్నాయి. ఆహారంగా తీసుకునే పుట్టగొడుగులలో 89 నుంచి 91శాతం మధ్య నీరు, 0.97 నుంచి 1.26శాతం వరకు లవణాలు, 4శాతం వరకు మాంసకృతులు, 5.3 నుంచి 6.28 వరకు పిండిపదార్థాలు ఉంటాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. పోషకాహారంగా వీటిని న్యూట్రిషియన్లు సిఫార్సు చేస్తున్నారు. చికెన్, రొయ్యల పచ్చళ్ల మాదిరే పుట్టగొడుగులతో ప్రస్తుతం పచ్చళ్లు తయారీ చేస్తున్నారు.

పట్టాలెక్కనున్న పనులు

(5వ పేజీ తరువాయి)

వర్సిటీ పెద్దలను కదలించాయి.

అర్ధంతరంగా నిలిచిన పనులు

కళాశాల భవనాల నిర్మాణం కూడా అర్ధంతరంగా నిలిచిపోయింది. సుమారు రూ.31 కోట్లు నిధులు సిద్ధంగా ఉన్నాయి. టెండర్లు నిర్వహించేందుకు వర్సిటీ కసరత్తు చేస్తోంది. రూ.1.10 కోట్ల వ్యయంతో బాలికల వసతి గృహాలకు ప్రహరీ, కళాశాల ప్రధాన గేటు పనులు చేపడుతున్నారు. ఈ పనులు కూడా వసతి గృహాలతో పాటు పూర్తి కానున్నాయి. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం రూ.16 కోట్ల వ్యయంతో చేపట్టారు. ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనుల వేగవంతానికి వర్సిటీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల వీసీ డాక్టర్ సీఎస్ఆర్కే ప్రసాదు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కళాశాలను సందర్శించి పను లపై చర్చించించిన విషయం తెలిసిందే. వీసీ సానుకూల స్పందనతో పనులు ప్రారం భించేందుకు మార్గం సుగమం అయింది. ఏళ్ల తరబడి వసతి కోసం పడుతున్న విద్యార్థుల కష్టాలు కొద్ది నెలల్లోనే తీరనున్నాయి.

ప్రాణాలు తీస్తోన్న లైట్లు

(5వ పేజీ తరువాయి)

వచ్చినట్లుగా ఎల్‌ఈడీ లైట్లను బిగించుకుంటున్నారు. ఆ లైట్లతో వాహనాల్లోని వారికి రోడ్డు ప్రకాశవంతంగా కనిపిస్తున్నా.. ఎదుట వచ్చే వారికి ఏమీ కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. ట్రావెల్ ఆటోలు, ట్రాన్స్‌పోర్టు ఆటోలు, ద్విచక్ర వాహనాదారులతో పాటు లారీలు, బస్సుల యజమానులు కూడా పెద్దసంఖ్యలో లైట్లు వేసుకుని రాకపోకలు సాగించేందుకు మితిమీరిన ఉత్సాహం చూపుతున్నారు. నిబంధనలు పక్కనబెట్టి వ్యాపారులు ఈ లైట్లును విక్రయిస్తుండగా వాటిని బిగించుకునేందుకు వాహనదారులు ఆసక్తి చూపుతున్నారు.

కేంద్రం ప్రత్యేక చట్టం

భారీ ఫోకస్ వచ్చే లైట్లు వినియోగించడంతో ఎదురుగా వచ్చే వాహనదారులకు రోడ్డుతో పాటు మార్గం కనపడకపోవటంతో ప్రమాదారులు జరుగుతుండటంతో వాహనాలకు ఎల్‌ఈడీ లైట్ల వినియోగాన్ని పూర్తిస్థాయిలో నిషేధిస్తూ కేంద్రప్రభుత్వం చట్టం తెచ్చింది. వాహనసామర్థ్యాన్ని బట్టి దాని వినియోగానికి సరిపడా వాట్స్ కంటే అధిక ప్రమాణాలు ఉండకూడదని నిబంధనలు ఉన్నాయి. అయితే ఈ చట్టం అమలులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కేవలం కంపెనీలు ఇచ్చిన లైట్లనే వినియోగించాలని ప్రభు త్వం చెప్తున్నా వాహనదారులు పట్టించుకోవడం లేదు.

అవగాహన కార్యక్రమాలు ఏవి...

ప్రస్తుతం రవాణాశాఖ జిల్లావ్యాప్తంగా విస్తృతంగా రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తుంది. హెల్మెట్లు, లైసెన్సులు, రోడ్డు నిబంధనలు తదితరాల గురించి అవగాహన కల్పిస్తున్న అధికారులు ఎల్‌ఈడీ లైట్ల గురించి మాత్రం చెప్పడంలేదు. ఎల్‌ఈడీ లైట్లతో పాటు పెద్ద సౌండ్లు వచ్చే హరన్లపై అవగాహన కల్పించి నిబంధనలు అతిక్రమిస్తే కేసులు, జరిమానాలు విధిస్తామని హెచ్చరికలు జారీ చేయాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు. లైట్లు విక్రయించే వ్యాపారులకు, వాటిని బిగించే మెకానికల్‌లను కూడా చైతన్యపరిచి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. రోడ్డు మంత్రిత్వ శాఖ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా మాత్రమే లైట్లును వినియోగించాలి. దీనిపై చర్యలు తీసుకునేందుకు ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసులకు అధికారం ఉంది. కాకపోతే వారు చర్యలు, కేసులు నమోదు చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తనిఖీలు నిర్వహిస్తాం

నిబంధనలకు విరుద్ధంగా హెవీ ఫోకస్ ఉన్న ఎల్ ఈడీ లైట్లు వినియోగిస్తే చర్యలు తీసుకుంటాం. కేసులు నమోదుతో పాటు అవసరమైతే వాహనాలను సీజ్ చేస్తాం. అధిక వెలుగు వచ్చే లైట్లు వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కంపెనీలు అమర్చిన లైట్లు మినహా ఏ ఒక్కరూ విడిగా ఎల్‌ఈడీ లైట్లను అమర్చకూడదు.

\- సీతారామిరెడ్డి, డీటీసీ, గుంటూరు

చిత్రజ్యోతి

SINCE 1965


మేఘాలయలో తొలి తెలుగు సినిమా!



ఒకరోజు జరిగిన అనుకోని ఓ సంఘటన వల్ల ఆరుగురు వ్యక్తుల జీవితాల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయన్నాయనే వైవిధ్యమైన కథాంశంతో రూపుదిద్దుకున్న న్యూ ఏజ్ క్రైమ్ కామెడీ 'బా బా బ్లాక్ షీప్'. గుణి మంచికంటి దర్శకత్వంలో వేణు దోనేపూడి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హీరో శర్వానంద్ శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసి యూనిట్‌కు అభినందనలు తెలిపారు. చిత్ర విశేషాలను నిర్మాత దోనేపూడి వేణు వివరిస్తూ 'సినిమా మొత్తాన్ని మేఘాలయ రాష్ట్రంలోనే తీశాం. అధిక వర్షపాతం కలిగిన చిరపుంజి వంటి అద్భుతమైన లొకేషన్స్‌లో షూటింగ్ చేశాం. ఆ రాష్ట్రంలో షూటింగ్ చేసిన తొలి సినిమా మాదే. త్వరలో విడుదల తేదిని ప్రకటిస్తాం' అని చెప్పారు. టిను ఆనంద్, ఉపేంద్ర, జార్జి మరియన్, అక్షయ్, అభినవ్, విస్మయశ్రీ, మాళవి, సమృద్ధి, రాజా రవీంద్ర, అనిశ్ కురివిల్లా తదితరులు నటించారు.

22 రోజులు... వందలమంది గాయకులు

- సిద్ధమైన కీరవాణి 'వందేమాతరం'



ఈసారి జరగబోయే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆస్కార్ ఆకర్షణ తోడైంది. దేశభక్తిని రగిలించే 'వందేమాతరం' గీతానికి ఈ ఏడాది ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం కీరవాణి సరికొత్త బాణీలు సమకూర్చారు. 'వందే మాతరం' గీతాన్ని స్వరపరిచే అవకాశం రావడం చిన్న విషయం కాదు, ఇదొక పెద్ద బాధ్యత అని కీరవాణి అన్నారు. ఈ బాధ్యతను నా తండ్రి శ్రీ శివదత్త గారు నేర్పిన విద్యవల్లే సమర్థవంతంగా పూర్తి చేశాను, ఇది నాకు దక్కిన అరుదైన గౌరవమని కీరవాణి భావోద్వేగానికి లోనయ్యారు. 'మానాన్న గారు, నా గురువుగారైన స్వర్గీయ శ్రీ శివదత్త గారు నాకు ఇచ్చిన కఠినమైన శిక్షణే నాకు ఈ ఐకానిక్ గీతాన్ని స్వరపరిచే ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది' అని కీరవాణి చెప్పారు. 'చెన్నై, ముంబై నగరాల నుంచి అనేకమంది సంగీతకారులను హైదరాబాద్‌కు రప్పించి ఈ గేయాన్ని రికార్డు చేశాం. దీన్ని పూర్తి చేయడానికి మాకు 22 రోజులు పట్టింది' అని ఆయన తెలిపారు.

శ్రేయా స్వరం



కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ ఈ సారి రిపబ్లిక్ డేలో ప్రదర్శించే శకటాన్ని సంజయ్‌లీలా భన్సాలీ రూపొందించిన విషయం తెలిసిందే. అయితే వేడుకల్లో ఈ శకటం కదులుతుండగా దానికి అనుగుణంగా వినిపించే ఒక ప్రత్యేక గీతాన్ని శ్రేయా ఘోషల్ ఆలపించారు. భన్సాలీ ఆలోచనలకు ప్రాణం పోసేలా ఈ పాటను స్వరపరిచారు. ఈసారి వేడుకలు సంజయ్‌లీలా భన్సాలీ సినిమాటిక్ విజన్‌కు శ్రేయా ఘోషల్ గాత్రమాధుర్యం తోడై... ప్రేక్షకులను అలరించనున్నాయి.

ఈసారి యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో



ఇటీవలె 'అఖండ 2' చిత్రంతో అభిమానులను పాన్ ఇండియా స్థాయిలో అలరించారు నందమూరి బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా నటించబోయే తదుపరి చిత్రంపై అధికారిక ప్రకటన వచ్చింది. బాలకృష్ణ హీరోగా గోపిచంద్ మలినేని దర్శకత్వంలో కొత్త చిత్రం ఖరారైంది. గతంలో వీరిద్దరి కలయికలోనే చారిత్రక నేపథ్యంలో ఓ చిత్రం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆ కథను పక్కనపెట్టి, ఇప్పుడు మరో కొత్త కథతో రాబోతున్నారు. ఇది పూర్తిస్థాయి మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కబోతోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మార్చి నుంచి చిత్రీకరణ ప్రారంభించనున్నారు. బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రాన్ని వృద్ధి సినిమాస్ పతాకంపై సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రామ్‌చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'పెద్ది' చిత్రం ఇదే బ్యానర్‌పై తెరకెక్కుతోంది.

నా వ్యక్తిత్వ హక్కులను కాపాడండి

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కుమారుడు అకీరానందన్
- ఏఐ దుర్వినియోగంపై ఢిల్లీ హైకోర్టులో పిటిషన్



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కుమారుడు అకీరా నందన్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. సోషల్ మీడియాలో తన పేరుతో, తన ముఖాన్ని ఉపయోగిస్తూ ప్రచారం చేస్తున్న ఏఐ ఆధారిత కంటెంట్ నుంచి తన వ్యక్తిత్వ హక్కులను కాపాడాలని పిటిషన్ దాఖలు చేశారు. తనకు సంబంధించిన ఏఐ ఆధారిత వీడియోలు, ఫోటోలు తన గోప్యతకు భంగం కలిగించడంతోపాటు వ్యక్తిత్వ హక్కుల ఉల్లంఘనగా మారుతున్నాయని పిటిషన్‌లో అకీరా పేర్కొన్నారు. ఏఐ సాంకేతికతతో తన పేరుతో రూపొందిస్తున్న కంటెంట్‌ను వెంటనే తొలగించాలని, భవిష్యత్తులో ఇలాంటి కంటెంట్ ప్రచారాన్ని నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలని అకీరా కోరారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు, డిజిటల్ కంటెంట్ క్రియేటర్లపై తగిన నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరారు.

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి)

నేటి సమాజానికి అవసరమైన చిత్రం



వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా వినయ్ రత్నం తెరకెక్కించిన చిత్రం 'శ్రీ చిదంబరం గారు'. శ్రీమతి చింతా వరలక్ష్మీ సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని నిర్మాత వంశీ నందిపాటి థియేటర్లలో విడుదల చేస్తున్నారు. కాగా, ఈ చిత్రంలో ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి ఆలపించిన 'వెళ్లేదారిలో..'అనే పాటను ఇటీవల విడుదల చేయగా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. శుక్రవారం నిర్వహించిన ఈ పాట సక్సెస్ సెలెబ్రేషన్స్‌లో సినిమాను ఫిబ్రవరి 6న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్‌పీ పట్నాయక్ మాట్లాడుతూ 'ఈ చిత్ర సంగీత దర్శకులు రవి, చందు కీరవాణి లాంటి గొప్ప సంగీత దర్శకుడిని ఒప్పించి పాడించడం ఎంతో ఆనందంగా ఉంది. నేటి సమాజానికి ఎంతో అవసరమైన చిత్రమిది' అని అన్నారు. నిర్మాత గోపాలకృష్ణ మాట్లాడుతూ 'కొత్తవాళ్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నేను చేసిన ఐదో సినిమా ఇది. ఎక్కడా రాజీపడకుండా నిర్మించాను. ఓ పెద్ద సినిమాకు తీసిపోని చిత్రం ఇది' అని పేర్కొన్నారు.

స్వచ్ఛమైన ప్రేమకథ



చంద్రహాస్, మేఘన ముఖర్జి ప్రధాన పాత్రధారులుగా సంపత్ రుద్ర తెరకెక్కించిన చిత్రం 'బరాబర్ ప్రేమిస్తా'. గెడా చందు, గాయత్రి చిన్ని, ఏవీఆర్ నిర్మించారు. ఈ సినిమాను ఫిబ్రవరి 6న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా చంద్రహాస్ మాట్లాడుతూ 'ఈ సినిమా కచ్చితంగా యువతరాన్ని అలరించి, కుటుంబ ప్రేక్షకులను మెప్పిస్తుందనే నమ్మకం ఉంది. మంచి థియేట్రికల్ అనుభూతిని ఇస్తుంది' అని అన్నారు.



ఆద్యంతం ఆసక్తికరంగా



సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'హ్యాపీ రాజ్'. శ్రీగౌరీ ప్రియ కథానాయిక. అబ్బాస్, జార్జ్ మరియం కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మారియా ఎలాంచెజియన్ దర్శకత్వంలో జయవర్ధన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ప్రోమోను హీరో విజయ్ దేవరకొండ విడుదల చేసి చిత్రబృందానికి బెస్ట్ విషెస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జయవర్ధన్ మాట్లాడుతూ 'చిత్రం విభిన్నంగా ఉండబోతోంది. ప్రేక్షకులకు ఓ మంచి అనుభూతిని ఇస్తుంది. ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటూ వినోదాన్ని పంచుతుంది. సినిమా విజయంపై నమ్మకముంది' అని చెప్పారు. త్వరలోనే ఈ ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ఆర్‌కే సెల్వ, సంగీతం: జస్టిన్ ప్రభాకరన్.

పేట రౌడీ నయా లుక్



వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న మాస్ లవ్ ఎంటర్‌టైనర్ 'పేట రౌడీ'. మాక్ దర్శకత్వంలో కల్యాణి కర్తనాథ నిర్మిస్తున్నారు. చంటి హీరోగా పరిచయమవుతున్నాడు. గురువారం చిత్ర బృందం కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ప్రస్తుతం భారీ ఫైట్ సీక్వెన్స్ తెరకెక్కిస్తున్నాం. త్వరలో గ్లింప్స్ విడుదల చేస్తాం' అని చెప్పారు. 'సరికొత్త అంశాలతో సాగే వినూత్న కథాంశంతో 'పేట రౌడీ' చిత్రాన్ని దర్శకుడు తెరకెక్కిస్తున్నారు. పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి. ప్రతి పాత్రకు ప్రత్యేకత ఉంటుంది. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించే చిత్రమిది' అని నిర్మాత తెలిపారు.

నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 24 జనవరి 2026



శీతాకాలంలో విరివిగా లభించే దుంప 'కర్ర పెండలం'. ఇది పైన గోధుమ రంగులో లోపల తెల్లగా ఉంటుంది. దీనిలో పీచు, పిండిపదార్థాలు, సి విటమిన్ అధికం. ఇందులో ఏ రకమైన కొవ్వులూ ఉండవు. శరీరానికి తక్షణ శక్తిని ఆరోగ్యాన్ని అందించే పెండలంతో విభిన్న రుచులు మీకోసం...

వంటిల్లు

కర్ర పెండలంతో కొత్తగా..!

పెండలం చికెన్ మసాలా



కావాల్సిన పదార్థాలు

పెండలం- అర కేజీ, బోన్‌లెస్ చికెన్ ముక్కలు- పావు కేజీ, ఉల్లిపాయలు- రెండు, టమాటాలు- రెండు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, పచ్చి మిర్చి- మూడు, నూనె- నాలుగు చెంచాలు, ఉప్పు- తగినంత, పసుపు- అర చెంచా, కారం- రెండు చెంచాలు, ధనియాల పొడి- ఒక చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, గరం మసాల పొడి- అర చెంచా, కొత్తిమీర- కొద్దిగా

తయారీ విధానం

- పెండలాన్ని కడిగి పెద్ద ముక్కలుగా కోసి కుక్కర్‌లో వేసి ఒక గ్లాసు నీళ్లు పోసి మూడు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. తరువాత తొక్క తీసి చిన్న ముక్కలుగా కోసి పక్కన పెట్టుకోవాలి. చికెన్ ముక్కలను కడిగి కొద్దిగా ఉప్పు, పసుపు వేసి కలిపి పెట్టాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడిచేయాలి. అందులో ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు, పచ్చి మిర్చి ముక్కలు వేసి రెండు నిమిషాలు వేయించాలి. ఆపైన టమాటా ముక్కలు, పసుపు వేసి మగ్గించాలి. అయిదు నిమిషాల తరువాత చికెన్ ముక్కలు వేసి కలిపి పది నిమిషాలు ఉడికించాలి. ఆపైన కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాల పొడి, ముందుగా ఉడికించి పెట్టుకున్న పెండలం ముక్కలు వేసి చిన్న గ్లాసు నీళ్లు పోసి బాగా కలపాలి. గిన్నె మీద మూతపెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. తరువాత మూత తీసి ఉప్పు సరిచూడాలి. చివరగా కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఇలా తయారుచేసిన పెండలం చికెన్ మసాల కూర.. వేడి అన్నం, చపాతీ, పుల్కా, బగారా రైస్, రుమాల్ రోటీల్లోకి రుచిగా ఉంటుంది.


పెండలం చిప్స్

కావాల్సిన పదార్థాలు

కర్ర పెండలం- అర కేజీ, నూనె- డీప్ ఫ్రైకి తగినంత, కారం- అర చెంచా, ఉప్పు- అర చెంచా, ధనియాల పొడి- పావు చెంచా, చాట్ మసాల పొడి- అర చెంచా

తయారీ విధానం

చిన్న గిన్నెలో ఉప్పు, కారం, ధనియాల పొడి, చాట్ మసాల పొడి వేసి బాగా కలిపి పెట్టుకోవాలి. పెండలాన్ని మట్టి లేకుండా కడిగి పీలర్‌తో తొక్క తీయాలి. తరువాత మరోసారి ఉప్పు నీళ్లతో కడగాలి. ఆపైన మూడు ముక్కలుగా కోయాలి. తరువాత స్లైసర్ సహాయంతో పలుచని స్లైసెస్‌గా కట్ చేయాలి. స్టవ్ మీద మూకుడు పెట్టి సగానికిపైగా నూనె పోసి వేడిచేయాలి. నూనె బాగా వేడెక్కాక అందులో పెండలం స్లైసెస్ వేసి పెద్ద మంట మీద దోరగా వేయించాలి. మధ్య మధ్యలో చిల్లుల గరిటెతో కలుపుతూ ఉండాలి. ఇవి ఎర్రగా వేగిన తరువాత స్టయినర్ సహాయంతో నూనెలో నుంచి తీసి దాన్ని ఒక గిన్నె మీద పెట్టాలి. అదనంగా ఉన్న నూనె మొత్తం గిన్నెలోకి దిగిన తరువాత చిప్స్‌ను మరో వెడల్పాటి గిన్నెలో వేయాలి. వీటిపైన ముందుగా కలిపి పెట్టుకున్న ఉప్పు, కారం మిశ్రమాన్ని చల్లి గిన్నెను పైకి కిందికి ఊపాలి. ఇలా తయారు చేసిన పెండలం చిప్స్ వారం రోజుల వరకూ కరకరలాడుతూ ఉంటాయి. వీటిని స్నాక్‌లా సర్వ్ చేయవచ్చు. లేదంటే పప్పు, చారు, సాంబార్‌తోపాటు సైడ్ డిష్‌గా వడ్డించవచ్చు.





పెండలం అట్టు

కావాల్సిన పదార్థాలు

కర్ర పెండలం- అర కేజీ, బియ్యం- ఒక గ్లాసు, పచ్చి శనగ పప్పు- పావు కప్పు, జీలకర్ర- ఒక చెంచా, ఎండు మిరపకాయలు- పది, ఉప్పు- తగినంత, నూనె- తగినంత, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, కొత్తిమీర తరుగు- కొద్దిగా

తయారీ విధానం

ముందుగా ఒక గిన్నెలో బియ్యం, పచ్చి శనగపప్పు వేసి నీళ్లతో శుభ్రంగా కడగాలి. తరువాత నిండా నీళ్లు పోసి ఒక పూటంతా నానబెట్టాలి. పెండలానికి తొక్క తీసి చిన్న ముక్కలుగా కోయాలి. మిక్సీలో పెండలం ముక్కలు, నానిన బియ్యం-పచ్చి శనగ పప్పు, జీలకర్ర, ఎండు మిరపకాయలు, ఉప్పు, జీలకర్ర వేసి ఒక గ్లాసు నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పిండి మిశ్రమాన్ని గిన్నెలోకి తీసుకుని గరిటె జారుగా ఉండేలా మరికొన్ని నీళ్లు కలపాలి. ఉప్పు సరిచూసుకోవాలి. స్టవ్ మీద పెనం పెట్టి వేడి చేయాలి. దానిమీద చెంచాతో కొద్దిగా నూనె రాసి గరిటెతో పిండిని తీసుకుని అట్టు పోయాలి. దీనిమీద చెంచా నూనె వేసి కొన్ని ఉల్లిపాయ ముక్కలు, కొద్దిగా కొత్తిమీర తరుగు చల్లి మూతపెట్టి రెండు నిమిషాలు మగ్గించాలి. తరువాత మూత తీసి అట్టును రెండో వైపునకు తిప్పి మరో రెండు నిమిషాలు ఉంచాలి. ఇలా రెండు వైపులా ఎర్రగా వేగిన అట్టును పళ్లెంలోకి తీసి సర్వ్ చేయాలి.

పెండలం హల్వా




కావాల్సిన పదార్థాలు

కర్ర పెండలం- అర కేజీ, బెల్లం పొడి- ఒక కప్పు, నెయ్యి- ఒక కప్పు, శొంఠి పొడి- అర చెంచా, జీడిపప్పు- కొద్దిగా, కిస్‌మిస్‌లు- కొన్ని, యాలకుల పొడి- అర చెంచా

తయారీ విధానం

పెండలాన్ని శుభ్రంగా కడిగి నాలుగు ముక్కలుగా కోసి కుక్కర్‌లో వేసి ఒక గ్లాసు నీళ్లు పోసి రెండు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. తరువాత తొక్క తీసి చిన్న ముక్కలుగా కోయాలి. వీటిని మిక్సీలో వేసి కొన్ని నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఆపైన స్టయినర్‌లోకి తీసుకుని గరిటెతో ఒత్తుతూ మరో గిన్నెలోకి వడబోయాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి బెల్లం పొడి వేసి ఒక కప్పు నీళ్లు పోసి కరిగించాలి. ఆపైన పెండలం పేస్టు వేసి కలపాలి. ఈ మిశ్రమం ఉడుకుతున్నప్పుడు అర కప్పు నెయ్యి వేసి బాగా కలపాలి. మిశ్రమం కొద్దిగా దగ్గరకు వచ్చిన తరువాత మిగిలిన నెయ్యి వేసి కలుపుతూ చిన్న మంట మీద ఉడికించాలి. పది నిమిషాల తరువాత మిశ్రమం పూర్తిగా ఉడికి గిన్నెకు అంటుకోకుండా దగ్గరకు వస్తుంది. ఈ దశలో శొంఠి పొడి, యాలకుల పొడి, జీడిపప్పు, కిస్‌మిస్‌లు వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ హల్వాని నెయ్యి రాసిన పళ్లెంలోకి తీసి సమంగా పరచాలి. కొద్దిగా చల్లారిన తరువాత ముక్కలుగా కోసి సర్వ్ చేయాలి.

భోజన కుతూహలం



ధన్య ఔషధి కొత్తిమీర

ధనియాలు, కొత్తిమీరలో ఔషధ గుణాలు ఉన్నాయని మన పూర్వీకులు ఎప్పుడో కనుగొన్నారు. ధనియాలు జొన్నధాన్యంలాగా ఉంటాయి అందుకే వాటిని ధనియాలు అంటారు. ఈ ధనియాలను నలిపి నేల మీద జల్లితే వాటి నుంచి కొత్తిమీర మొలకెత్తుతుంది. ఈ కొత్తిమీరకు సంస్కృతంలో కుస్తుంబర అనే పేరు కూడా ఉంది. ఇక ఈ కొత్తమీర వల్ల కలిగే ప్రయోజనాలెన్నో!

- ఇది మన శరీరంలో పెరిగిన వాతాన్ని పైత్యాన్ని, వేడినీ తగ్గిస్తుంది. దీనికి శరీరాన్ని తేలిక పరిచే స్వభావం కలిగి ఉంటుంది. రుచిని కలిగిస్తుంది. జ్వరాన్ని నివారిస్తుంది.
- లేత కొత్తిమీర ఆకులు ఎక్కువ చలవ చేస్తాయి.
- ఒక చెంచాడు ధనియాలపొడిని నీళ్లలో వేసి టీ కాచుకుని రోజూ ఒకటి రెండు సార్లు తాగుతుంటే కొవ్వు శాతం తగ్గుతుంది.
- అరికాళ్ల మంటలు, అరచేతుల్లో మంటలు కూడా ఈ టీ వల్ల తగ్గుతాయి. దప్పిక తీరుతుంది. కడుపులో ఎసిడిటీ తగ్గి జీర్ణశక్తి పెరుగుతుంది. జ్వరం వచ్చినప్పుడు దీన్ని తాగితే వెంటనే శరీరం చల్లబడుతుంది.
- ధనియాల పొడి శరీరంలో ధాతువులను వాటివాటి స్థానాలకు చేర్చి శక్తి ఉత్పత్తికి దోహదపడుతుంది. కడుపులో నొప్పి, మంట, ఉడుకు విరేచనాలు, తల తిరగటం లాంటి సమస్యలు తగ్గుతాయి.
- నెలసరి సమయంలో అధిక రక్తస్రావం అయ్యే వారు రెండు పూటలా ధనియాలపొడిని, కొత్తిమీర ఆకుల్ని నీళ్లలో మరిగించి ఆ కషాయాన్ని పంచదారతో తీసుకుంటే రక్తస్రావం ఆగుతుంది.

ధాన్యక హిమం

ధనియాల పొడిని రాత్రి తెల్లవార్లూ ఒక గ్లాసు నీళ్లలో నానించి ఉదయాన్నే తీసుకుంటే దాన్ని ధాన్యక హిమం అంటారు. ఇలా తయారు చేసిన ధాన్యక హిమాన్ని ప్రాత కాలం నిద్ర లేస్తూనే కాలకృత్యాలు తీర్చుకుని రోజూ తాగితే అతి దప్పిక, శరీరం లోపల పైకి కనిపించకుండా జరిగే రక్త స్రావం ఆగుతాయి. శరీరంలో రక్తనాళాలు, ఊపిరినాళాల్లాంటి నాళాల్ని శుద్ధి చేసి ధాతువులు సక్రమంగా ప్రవహించేలా చేస్తుంది.

గౌట్ తగ్గటానికి

ధనియాలు, జీలకర్ర, శొంఠిలను విడివిడిగా దోరగా వేగించి మిక్సీ పట్టి అన్నింటినీ కలిపిన పొడిలో తగినంత ఉప్పు కలుపుకుని ఒక సీసాలో భద్రపరచుకోండి. ఈ పొడిని రోజూ మజ్జిగలో కలిపి తాగవచ్చు. నీళ్లలో వేసుకుని టీ కాచుకుని త్రాగవచ్చు. అన్నంలో కారపుపొడిలా తినవచ్చు. వాతపు నొప్పులు, గౌట్ వ్యాధి నివారణకు ఈ పొడి బాగా ఉపయోగపడుతుంది.

కొత్తిమీర నిలవ పచ్చడి


కొత్తిమీర నిలవ పచ్చడిని ధనియాలపొడి కలిపి తయారు చేసుకుంటే చాలా రుచిగానూ ఆరోగ్యదాయకంగానూ ఉంటుంది. నెయ్యి వేసుకుని తింటే దగ్గు ఆయాసాలను నివారిస్తుంది.

• గంగరాజు అరుణాదేవి

మేకప్

మధ్య వయసు మేకప్

మధ్య వయసులో ముఖం మీద ముడతలు, గీతలు సహజం. మేకప్ వాటి మధ్య ఇరుక్కుపోకుండా, చెదిరిపోకుండా చూసుకోవడంలోనే అసలు కిటుకు దాగి ఉంటుంది. అదెలాగో తెలుసుకుందాం...



- **స్కిన్ ఇలా సిద్ధం:** మొదట ముఖానికి హైడ్రేటింగ్ సీరమ్/క్రీమ్, మాయిశ్చరైజింగ్ ప్రైమర్ అప్లై చేసుకోవాలి. వీటిలో సన్నని గీతలు చర్మంలో కలిసిపోతాయి
- **లైట్‌వెయిట్ కవరేజ్:** మాట్ ఫార్ములాలను కలిగి ఉండే ఫౌండేషన్లకు బదులుగా, హైడ్రేషన్‌ను అందించే షీర్ ఫౌండేషన్, టింటెడ్ మాయిశ్చరైజర్ లేదా సిసి క్రీమ్ అప్లై చేసుకుంటే ముఖం యవ్వనంగా కనిపిస్తుంది. అయితే వీటిని వీలైనంత తక్కువ మోతాదులోనే వాడుకోవాలి
- **కన్‌సీల్:** కలర్ కరెక్టర్‌కు ముందు కన్‌సీలర్ వాడుకోవాలి. కళ్ల కింద నల్లని వలయాల కోసం పీచ్/నారింజ రంగు కన్‌సీలర్ ఎంచుకోవాలి
- **పౌడర్:** ముడతలు పడే వీలున్న ప్రదేశాల్లో ట్రాన్స్‌క్యులెంట్ పౌడర్ పలుచగా అద్దుకోవాలి
- **బ్లష్:** చెక్కిళ్ల పైన క్రీమ్ బ్లష్ అప్లై చేసుకోవాలి
- **ఐబ్రో పెన్సిల్:** పలుచగా ఉన్న కనుబొమలను దిద్దుకోవడం కోసం పెన్సిల్ ఉపయోగించవచ్చు. కానీ తీర్చిదిద్దినట్టు కాకుండా, సహజసిద్ధంగా ఉండేలా దిద్దుకోవాలి
- **ఐలైనర్:** ద్రవరూప ఐలైనర్‌కు బదులుగా,పెన్సిల్ లైనర్‌ను ఎంచుకోవాలి
- **మస్కారా:** నాణ్యమైన మస్కారా వాడుకోవాలి. చెదిరిపోకుండా ఉండడం కోసం ట్యూబింగ్ ఫార్ములాను కలిగిన మస్కారా ఎంచుకోవాలి
- **ఐషాడో:** క్రీమ్ షాడోస్ బాగుంటాయి. చక్కగా కలిసిపోతాయి. కాబట్టి ముదురు రంగులకు బదులుగా తేలిక రంగు ఐషాడో ఎంచుకోవాలి.
- **లిప్‌స్టిక్:** క్రీమీ లిప్‌స్టిక్‌ను ఎంచుకోవాలి. వేసుకున్న లిప్‌స్టిక్ చెదిరిపోకుండా ఉండడం కోసం సాఫ్ట్ లైనర్‌ను వాడుకోవాలి
- **టెక్స్చర్:** మేకప్ కోసం ఎంచుకునే సాధనాలు పౌడర్ రూపంలో ఉండకుండా చూసుకోవాలి. బదులుగా హైడ్రేషన్‌ను అందించే క్రీమీ ఉత్పత్తులు ఎంచుకోవాలి
- **బ్లెండ్:** మేకప్ ఎబ్బెట్టుగా కనిపించకుండా చర్మంలో కలిసిపోయిన లుక్ పొందడం కోసం, ఫౌండేషన్ అద్దుకోడానికి తడిపి పిండిన స్పాంజ్‌ను వాడుకోవాలి
- **ముడతలు:** ముడతలను మేకప్‌తో పూర్తిగా దాచే ప్రయత్నం చేయకూడదు. వీలైనంత సహజసిద్ధమైన లుక్ కోసం ప్రయత్నించాలి.

ఆవు నెయ్యితో...

ఆవు నెయ్యి సహజ సౌందర్య సాధనంగా పనిచేస్తుంది. ఖరీదైన క్రీమ్‌లు, మాయిశ్చరైజర్లకంటే మెరుగైన ఫలితాన్నిస్తుంది.



- కొద్దిగా ఆవు నెయ్యిని తీసుకుని ముఖానికి, మెడకు, చేతులకు, పాదాలకు పట్టించి మెల్లగా మర్దన చేస్తే చర్మం మృదువుగా కాంతివంతంగా మారుతుంది. రాత్రి పడుకునేముందు మాయిశ్చరైజర్‌కు బదులు ఆవు నెయ్యిని వాడుకోవచ్చు.
- చెంచా ఆవు నెయ్యిలో చిటికెడు పసుపు వేసి కలిపి పేస్టులా చేయాలి. దీన్ని ముఖానికి, శరీరానికి పట్టించి పావుగంట తరువాత గోరువెచ్చని నీటితో స్నానం చేస్తే చర్మం మంచి ఛాయతో మెరుస్తుంది.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల శనగపిండి, చెంచా నెయ్యి, కొన్ని పాలు పోసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు, చేతులకు, పాదాలకు పట్టించి సున్నితంగా మర్దన చేస్తూ పిండిని తొలగించాలి. తరువాత వేడినీళ్లతో స్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే చర్మంపై పేరుకున్న మృతకణాలు, మురికి తొలగిపోతాయి. పెదవులు, పాదాలపై వచ్చే పగుళ్లు తగ్గుతాయి. ముఖంపై మొటిమలు, గుల్లలు రావు.
- చెంచా ఆవు నెయ్యిలో అర చెంచా తేనె కలిపి ముఖానికి పట్టిస్తే చర్మం తేమతో నిండుతుంది. ముఖం సహజ మెరుపుతో తాజాగా కనిపిస్తుంది.
- కళ్ల కింద నల్లని వలయాలు ఏర్పడినప్పుడు వాటిమీద గోరువెచ్చటి ఆవు నెయ్యిని రాస్తే మంచి ఫలితం ఉంటుంది.
- మడమల మీద లోతైన పగుళ్లు, ఆనెలు ఏర్పడినప్పుడు వాటిమీద ఆవు నెయ్యిని రాసి సాక్స్ వేసుకుని పడుకుంటే ఉదయానికల్లా నొప్పి తగ్గుతుంది. మూడు రోజుల్లో పాదాలు, మడమలు నునుపుగా మారతాయి.

గులాబీ పెదవుల కోసం...

రక్త ప్రసరణ సరిగా జరగకపోవడం, తేమను కోల్పోవడం, సూర్యరశ్మి వల్ల పెదవులు పొడిబారి నల్లగా మారుతుంటాయి. చిన్న చిట్కాలతో వాటిని మృదువుగా ఛాయగా మార్చుకోవచ్చు...

- బీట్‌రూట్‌ను ఆహారంలో చేర్చుకోవడంతో పాటు దాని రసాన్ని పెదవులకు రాస్తూ ఉంటే సమస్య తీరిపోతుంది. బీట్‌రూట్‌లో ఉండే బీటాలైన్ అనే వర్ణ ద్రవ్యం పెదవులకు మంచి రంగునిస్తుంది.
- రోజూ దానిమ్మ జ్యూస్ తాగుతూ ఉంటే వారం లోపు పెదవులు ఎర్రగా మారతాయి. దానిమ్మ గింజల్లో ఉండే పునికాలాజిన్.. చర్మం మీద మెలనిన్ ఉత్పత్తిని తగ్గిస్తుంది. నారింజ, ద్రాక్ష, అనాస పండ్లు తిన్నా ప్రయోజనం ఉంటుంది.
- చెంచా తేనెలో పావు చెంచా చక్కెర, రెండు చుక్కల బాదం నూనె వేసి కలిపిన మిశ్రమంతో పెదవుల మీద సున్నితంగా మర్దన చేయాలి. ఇలా నాలుగు రోజులు చేస్తే మృతకణాలు తొలగిపోయి పెదవులు ఎర్రగా మారతాయి.
- చిన్న గ్లాసు స్ట్రాబెర్రీ జ్యూస్‌లో చెంచా తేనె కలుపుకుని తాగితే రెండు రోజుల్లో పెదవుల నలుపుదనం విరిగిపోతుంది. స్ట్రాబెర్రీలో ఉండే సి విటమిన్, యాంటీ ఆక్సిడెంట్లు చర్మానికి పోషణను అందిస్తాయి. చర్మం పొరల్లో రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి.



- రాత్రి పడుకునేముందు కీర జ్యూస్ తాగితే తగినంత తేమ అంది పెదవులు మృదువుగా మారతాయి.
- చెంచా కలబంద గుజ్జులో మూడు చుక్కల ఆలివ్ ఆయిల్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో పెదవులను వృత్తాకారంతో రుద్దితే మంచి ఫలితం కనిపిస్తుంది.

చిట్కా

- స్విచ్ బోర్డులపైనున్న మరకలు పోయి మెరిసిపోవాలంటే... చిన్న పళ్లెంలో ఒక చెంచా బేకింగ్ సోడాను తీసుకోవాలి. దీన్ని నిమ్మ చెక్కతో అద్ది దానితో స్విచ్ బోర్డును రుద్దాలి. ఆపైన పొడి గుడ్డతో తుడిచేస్తే సరిపోతుంది. లేదంటే పాత చేతి రుమాలును చిన్నగా మడిచి దానిమీద కొద్దిగా శానిటైజర్‌ను వేసి స్విచ్ బోర్డును తుడిచేస్తే మరకలన్నీ మాయమవుతాయి.

స్ఫూర్తి

వాడిపారేసే కాఫీ పొడులతో పర్యావరణానికి జరుగుతున్న హానిని గమనించిన డాక్టర్ ఉమ ఉల్లాస్ ప్రధాన్ అనే ఒక మహిళా శాస్త్రవేత్త, ఆ వ్యర్థాలతో పర్యావరణహితమైన స్ట్రాలు, కప్పులు తయారుచేస్తోంది. బెంగుళూరుకు చెందిన ఈ శాస్త్రవేత్త వినూత్నమైన ఆలోచన వెనకున్న ఆశయం గురించి తెలుసుకుందాం...

కాఫీ వ్యర్థాలతో కప్పులు



ప్రతి కప్పు కాఫీతో పర్యావరణంలో వ్యర్థం పేరుకుపోతూ ఉంటుంది. ప్రతి రోజూ హోటళ్లు, కెఫెలు, ఇళ్లు, కార్యాలయాలు... టన్నులకొద్దీ వాడుకున్న కాఫీ పొడిని విసిరిపారేస్తూ ఉంటాయి. సాధారణంగా ఈ వ్యర్థం మొత్తం చివరకు కందకాల్లోకి చేరుకుంటూ, మీథేన్ వాయువును వెలువరిస్తూ, పర్యావరణానికి హాని కలిగిస్తూ ఉంటుంది. ఈ అంశాన్ని లోతుగా విశ్లేషించిన ఉమ, ఈ సమస్యకు చక్కని పరిష్కారాన్ని కనుగొనాలని భావించారు. కాఫీ వ్యర్థానికి రెండో జీవితాన్ని అందించడంతో పాటు, అదే సమయంలో పర్యావరణానికి జరిగే హానికి అడ్డుకట్ట వేయాలనే సంకల్పంతో, నానోసెంట్రిక్స్ అనే కంపెనీని నెలకొల్పి కాఫీ వ్యర్థంతో స్ట్రాలు, మగ్గులు, కట్లెరీ, ప్యాకేజింగ్ బాక్సులు మొదలైన వస్తువులను తయారుచేయడం మొదలుపెట్టారామె.

మన్నిక, నాణ్యతలకు పెద్ద పీట వేస్తూ...


"నానోసెంట్రిక్స్ కంపెనీ, ప్రయోగశాలలో చోటుచేసుకునే ప్రయోగాలను, నిజ జీవిత పరిష్కారాలుగా మారుస్తుంది. అలాగే రేపటి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని దైనందిన జీవిత సవాళ్లను ఎదుర్కోడానికి తగిన అధునాతన పదార్థాలను సృష్టిస్తుంది. ఈ ఆవిష్కరణ రెండు రకాల సంక్షోభాలను పరిష్కరిస్తుంది. ప్లాస్టిక్ మీద ఆధారపడే అవసరాన్నీ, పర్యావరణం మీద పడుతున్న సేంద్రీయ వ్యర్థాల అధిక భారాన్నీ తగ్గిస్తుంది' అని తాను స్వయంగా స్థాపించిన నానోసెంట్రిక్స్ కంపెనీ గురించి వివరిస్తున్నారు ఉమ. బెంగుళూరులో నెలకొని ఉన్న ఈ కంపెనీ వాడిపారేసిన కాఫీ వ్యర్థాలతో బయోడిగ్రేడబుల్ దైనందిన వస్తువులైన స్ట్రాలు, స్పూన్లు, కట్లెరీలను తయారుచేస్తోంది. అయితే 'సేంద్రీయ ఉత్పత్తులు అనగానే ఇవెంతో సున్నితమైనవని అందరూ అనుకుంటారు. కానీ ఇవి సున్నితమైనవి కావు, తడిచినప్పుడు కూడా సాగిపోవు. ఆధునిక వినియోగ అవసరాలకు అనుగుణమైన, పర్యావరణహితంగా తయారైన వస్తువులివి' అంటూ వివరిస్తున్నారామె.

మట్టిలో కలిసిపోయేలా...

నానోసెంట్రిక్స్ ఈ ఉత్పత్తుల తయారీ కోసం, వాడిన కాఫీ వ్యర్థాలను సేకరించి, వాటిని వృక్షాధారిత బైండర్స్‌కు జోడించి, ఆ తర్వాత, నమూనా మోల్డింగ్ యంత్రాల సహాయంతో ఉత్పత్తులను తయారుచేస్తుంటుంది. ఇలా అంతిమంగా విషాలు లేని, వేడిని తట్టుకోగలిగే, మన్నికైన ఉత్పత్తులు రూపొందుతున్నాయి. తడిచిపోగానే సాగిపోయే కాగితం లేదా స్టార్చ్ ఆధారిత ప్రత్యామ్నాయాలకు భిన్నంగా నానోసెంట్రిక్స్ తయారుచేసే ఉత్పత్తులు తడిచిన తర్వాత కూడా ఆకారాన్నీ, రూపాన్నీ కోల్పోకుండా దృఢంగా ఉంటాయి. ఉపయోగించిన తర్వాత ఎలాంటి హానికారక అవశేషాలనూ మిగల్చకుండా, కొన్ని నెలల వ్యవధిలోనే పూర్తిగా మట్టిలో కలిసిపోవడం విశేషం.

పరిశ్రమలకు పంపిణీ...

"నానోసెంట్రిక్స్ ఉత్పత్తులు వాటి పరిమాణం, బరువు ఆధారంగా ఆరు నుంచి తొమ్మిది నెలల్లో నేలలో పూర్తిగా కలిసిపోతాయి. మళ్లీ మళ్లీ ఉపయోగించుకోగలిగేలా, చేత్తో శుభ్రం చేసుకుని వాడుకోడానికి వీలుగా మేమీ ఉత్పత్తులను రూపొందిస్తున్నాం. అయితే ఇవి మైక్రోవేవ్స్‌లో ఉపయోగించడానికి పనికి రావు. ఇలాంటి మెటీరియల్‌ను అభివృద్ధి చేయడానికి నాకు రెండేళ్ల సమయం పట్టింది. ఇటీవలే భారత ప్రభుత్వం ఈ కప్పుల కోసం నాకు పేటెంట్‌ను మంజూరు చేసింది. ప్రస్తుతం ఈ ఉత్పత్తులను బెంగుళూరుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని కెఫెలకు సప్లై చేస్తున్నాం. అలాగే పెద్ద పరిశ్రమల కోసం ప్యాకేజింగ్ పరిష్కారాలను కూడా అభివృద్ధి చేస్తున్నాను. ప్రస్తుతం ఈ ఉత్పత్తులు పరీక్ష దశలో ఉన్నాయి" అంటూ తన భవిష్యత్తు ప్రణాళిక గురించి వివరిస్తున్నారు ఉమ.





ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలతో కొండపల్లి చర్చలు

▸▸ ఉద్యమాన్ని తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ప్రకటించిన జేఏసీ

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రోత్సాహకాల బకాయిలు చెల్లించాలనే డిమాండ్‌తో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల జేఏసీ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా మంగళగిరిలోని ఏపీఐఐసీ భవన్ వద్ద ధర్నా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జేఏసీ నాయకులతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం సాయంత్రం సచివాలయంలో చర్చలు జరిపారు. జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అనార్‌బాబు, కార్యదర్శి ఈరా రాజశేఖర్, నాయకులు, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు జేఏసీ నాయకులు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. న్యాయం చేస్తామని పవన్, కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇవ్వడంతో ఉద్యమాన్ని తాత్కాలికంగా విరమిస్తున్నట్లు జేఏసీ నాయకులు ప్రకటించారు. నెలాఖరులోగా ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే తిరిగి ఉద్యమాన్ని చేపడతామని తెలిపారు.

ఏపీలో డబ్ల్యూఈఎఫ్ కేంద్రం

దావోస్, జనవరి 23: నాల్గవ పారిశ్రామిక విప్లవం కోసం ప్రపంచవ్యాప్తంగా ఐదు కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయాలని వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. భారత్‌లోని ముంబై, తెలంగాణల్లో ఇప్పటికే రెండు డబ్ల్యూఈఎఫ్ కేంద్రాలు ఉన్నాయి. ఏపీలోనూ ఏర్పాటయ్యే సెంటర్‌తో వీటి సంఖ్య మూడుకు పెరగనుంది. ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఫ్రాన్స్, బ్రిటన్, యూఏఈల్లో ఈ కొత్త కేంద్రాలు ఏర్పాటుకానున్నాయి. ఈ కేంద్రాలు ప్రభుత్వాలు, ప్రైవేటు పరిశ్రమలతో కలిసి ఏఐ, సైబర్ సెక్యూరిటీ, ఎనర్జీ వంటి రంగాల్లో సవాళ్లను పరిష్కరిస్తాయని, సాంకేతికత ప్రయోజనాలను సమాజానికి అందేలా పనిచేస్తాయని డబ్ల్యూఈఎఫ్ అధ్యక్షుడు, సీఈవో బోర్జ్ బ్రెండే తెలిపారు. డబ్ల్యూఈఎఫ్‌తో ఈ భాగస్వామ్యం.. అవసరమైన చోట సామర్థ్యాన్ని పెంపొందించడంలో తమ నిబద్ధతను తెలియజేస్తుందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

జగన్‌కు ఇంకా జ్ఞానోదయం కాలేదు: తులసిరెడ్డి

వేంపల్లె, జనవరి 23(ఆంధ్రజ్యోతి): 'గతంలో కక్షపూరిత రాజకీయాలు చేసి 11 సీట్లకే పరిమితమైన వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు ఇప్పటికీ జ్ఞానోదయం కాలేదు. మళ్లీ అధికారంలోకి వస్తే కక్షపూరిత రాజకీయాలు ఉంటాయని చెప్పడం తగదు' అని పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన వేంపల్లెలో విలేకరులతో మాట్లాడారు. 'జగన్ మాట్లాడే మాటలు సెల్ఫ్‌గోల్ కొట్టుకోవడమే. ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే శాసనసభకు పోతానని చెప్పడం అవివేకం. పులివెందుల ప్రజలు ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారు. తమ సమస్యలపై మాట్లాడాలని ప్రజలు బాధ్యత అప్పగిస్తే వారి అభిప్రాయాన్ని జగన్ గౌరవించడం లేదు. ఉద్దేశపూర్వకంగానే అసెంబ్లీకి పోకపోవడం మూర్ఖత్వం అని అన్నారు.

అధికారం కోసమే పాదయాత్రలు..: రాఘవులు

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాజకీయ నాయకులు చేస్తున్న పాదయాత్రలు అధికారం కోసమే తప్ప తమ కోసం కాదనే విషయాన్ని గుర్తించాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ప్రజలకు సూచించారు. శుక్రవారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. 'గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబు, జగన్, లోకేశ్ పాదయాత్రలు చేశారు. అవి ప్రజల కోసం కాదు. వీరంతా వారి పదవులను తప్ప మిగిలిన అన్నింటినీ పీపీపీ చేస్తున్నారు. ప్రైవేటీకరణ కంటే పీపీపీ విధానం అత్యంత ప్రమాదకరమైంది. ప్రధాని మోదీ చెప్పినట్టుగానే జగన్, చంద్రబాబు చేసుకుపోతున్నారు' అని ఆరోపించారు.

ఇసుక అక్రమ తవ్వకాల కేసు విచారణ వాయిదా

▸▸ జరిమానా చెల్లింపునకు సుప్రీం కోర్టు రెండు ఆప్షన్లు

న్యూఢిల్లీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమ మైనింగ్‌కు పాల్పడినందుకు రూ. 18 కోట్లు చెల్లించాలంటూ నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ జైప్రకాశ్ పవర్ వెంచర్స్ దాఖలు చేసిన కేసు విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఏజీ మసీ్‌వాతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఆదేశాలు ఇచ్చింది. విచారణ సందర్భంగా ఈ కేసులో ఇప్పటికే రూ. 8 కోట్లు డిపాజిట్ చేశారని, మిగతా డబ్బు డిపాజిట్ చేయాల్సి ఉందని జస్టిస్ కరోల్ ప్రస్తావించారు. రెండు ఆప్షన్లను సూచించారు. ఈ కేసును తిరిగి ఎన్జీటీకి పంపించి మిగిలిన మొత్తాన్ని ఎవరు చెల్లించాలనే అనే విషయాన్ని అక్కడ తేల్చడం లేదా సుప్రీంకోర్టే ఈ అంశంపై విచారణ జరిపి పర్యవేక్షణ కొనసాగించడంపై అభిప్రాయాన్ని చెప్పాలన్నారు. జైప్రకాశ్ వెంచర్స్ తరఫు న్యాయవాదులు తిరిగి ఎన్జీటీకి పంపించాలని కోరగా రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాదులు సుప్రీంకోర్టే విచారించాలని కోరారు. జైప్రకాశ్ వెంచర్స్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ అందుబాటులో లేకపోవడం, కోర్టు సూచించిన ఆప్షన్లపై నిర్ణయం తీసుకోవడానికి సమయం కావాలని కోరడంతో తదుపరి విచారణను ధర్మాసనం బుధవారానికి వాయిదా వేసింది.

రాజధాని సమీకృత మాస్టర్ ప్లాన్‌పై నోటిఫికేషన్

గుంటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానికి అంతర్జాతీయ విమానాశ్రయం, వరల్డ్ క్లాస్ స్పోర్ట్స్ సిటీ కోసం రెండో విడత భూసమీకరణ ప్రారంభమైన దృష్ట్యా సమీకృత మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు సీఆర్‌డీఏ శ్రీకారం చుట్టింది. ఇందుకోసం అనుభవం కలిగిన కన్సల్టెంట్ నియామకానికి అంతర్జాతీయంగా టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. టెండర్ షెడ్యూల్ డౌన్‌లోడింగ్ ప్రక్రియ ప్రారంభించి.. ఫిబ్రవరి 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు గడువుగా నిర్ణయించింది. ఈ నెల 28న సీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయంలో ప్రీ-ప్రపోజల్ భేటీ నిర్వహించనుంది.

డిస్కంల మోసం..!

▸▸ 'సోలార్'లో చిన్న వినియోగదారులపై వివక్ష

▸▸ కంపెనీల నుంచి బకాయిలు వసూలు చేయాలి

▸▸ నెల బిల్లు చెల్లించకపోతే కనెక్షన్ తొలగించాలి

▸▸ ఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణలో వక్తలు

విజయవాడ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న చిన్న వినియోగదారులను డిస్కంలు మోసం చేస్తున్నాయని పలువురు వక్తలు విద్యుత్ నియంత్రణ మండలికి ఫిర్యాదు చేశారు. సోలార్ విద్యుత్‌కు సంబంధించిన చెల్లింపుల విషయంలో చిన్న వినియోగదారుల పట్ల ఒకవిధంగా, పెద్ద కంపెనీల పట్ల మరోలా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. 2026-27 విద్యుత్ చార్జీల సవరణకు సంబంధించి విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ) శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ చేసింది. విద్యుత్‌రంగ నిపుణులు, టాక్స్ పేయర్స్ అసోసియేషన్ నేతలు, సీపీఐ నేతలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. టాక్స్‌పేయర్స్ అసోసియేషన్ ప్రతినిధి సాంబరెడ్డి మాట్లాడుతూ... ఇళ్లపై సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకున్నవారు ఉపయోగించుకున్న యూనిట్లుపోను మిగిలిన యూనిట్లను విక్రయిస్తే ఒక్కో యూనిట్‌కు రూ.2 చెల్లిస్తున్నారన్నారు. అదే వివిధ ప్రైవేటు సంస్థలకు మాత్రం రూ.4.05 చెలిస్తున్నారని వివరించారు. చిన్న వినియోగదారులను నిరుత్సాహపరచవద్దని, వారికీ రూ.4.05 చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఆంజనేయులు మాట్లాడుతూ.. డిస్కంలు చార్జీలు పెంచడం లేదని చెబుతూనే ప్రతి ఏటా ట్రూ అప్‌లు, ఎఫ్‌పీపీసీల పేరుతో ఆ ఏడాది వాడిన యూనిట్లపైనే చార్జీలు వసూలు చేస్తున్నాయన్నారు. ప్రజాభిప్రాయసేకరణలో మాత్రం ఎలాంటి చార్జీలు పెంచడం లేదని డిస్కంలు చూపిస్తున్నాయన్నారు. డిస్కంలు టైమ్ ఆఫ్ ది డేను మార్పు చేశాయన్నారు. ప్రజల ఏ సమయంలో విద్యుత్‌ను వినియోగిస్తున్నారో దాన్ని బట్టి మార్పు చేయాలని సూచించారు. సబ్సిడీలు 2024 మార్చి నాటికి రూ.11,776 కోట్లు, సెప్టెంబరు నాటికి రూ.12,718 కోట్లకు చేరాయని, సబ్సిడీలకు సంబంధించిన డబ్బులను ప్రభుత్వం ఏనాడూ పూర్తిగా ఇవ్వలేదని అన్నారు. ఈపీడీసీఎల్‌లో 2014-15 నుంచి 2021-22 వరకు ఎనిమిదేళ్లపాటు సబ్సిడీలు ఇవ్వలేదన్నారు. సాధారణ వినియోగదారుడు ఒక నెల బిల్లు చెల్లించకపోతే కనెక్షన్ తొలగిస్తున్నట్టుగానే ప్రైవేటు సంస్థలకు చేయాలని సూచించారు. బకాయిలను మార్చిలోపు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. మత సంస్థలకు యూనిట్‌కు రూ.5, ఎత్తిపోతల, తాగునీటి పథకాలకు రూ.7 వసూలు చేయడం సరికాదన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. అనేక ప్రజాభిప్రాయ సేకరణలో తాము చేసిన ప్రతిపాదనలు ఈఆర్సీ పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు.

మా నీళ్లు మీకివ్వడమేంటి?

▸▸ మీరు వరి వేస్తే.. మేం అపరాలు వేయాలా?

▸▸ తెలంగాణ వాదనలపై ఏపీ తీవ్ర అభ్యంతరం

▸▸ మాకు కేటాయించిన 512 టీఎంసీల్లో మేం 130 టీఎంసీలు వాడుకుంటే చాలా..?

▸▸ మిగతా 382 టీఎంసీలూ మీకిచ్చేయాలా?

▸▸ కృష్ణా జలాలపై తెలంగాణవన్నీ పిచ్చిలెక్కలు!

▸▸ ఏపీ తరఫు సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా స్పష్టీకరణ

▸▸ బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ విచారణ వచ్చే నెల 23, 24, 25కు వాయిదా



అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలపై తెలంగాణ చేస్తున్న వాదనల్లో హేతుబద్ధత లేదని ఆంధ్రప్రదేశ్ స్పష్టంచేసింది. కృష్ణా జలవివాదాల ట్రైబ్యునల్-1 తమకు కేటాయించిన నీటిని వాడుకోవడానికి వీల్లేదని, అందులో కొంతే వాడుకుని మిగతాది తెలంగాణకు ఇవ్వాలని అడగడమేంటని నిలదీసింది. ఆ రాష్ట్రానివన్నీ పిచ్చి లెక్కలేనని తెలిపింది. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపకానికి సంబంధించి బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట మూడో రోజు శుక్రవారం ఏపీ తరఫు సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా బలమైన వాదనలు వినిపించారు. 'కృష్ణా జలాల్లో మాకు కేటాయించిన 512 టీఎంసీల్లో పంటల కోసం 130 టీఎంసీలు వినియోగించుకుంటే సరిపోతుందని తెలంగాణ చెబుతున్న లెక్కలన్నీ ఊహాజనితమే. మిగిలిన 382 టీఎంసీలనూ తెలంగాణకే ఇచ్చేయాలని కోరడమేంటి' అని తీవ్ర అభ్యంతరం తెలియజేశారు. పోలవరం నుంచి గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు మళ్లిస్తున్నందున ఏపీకి కృష్ణా జలాలు అవసరమే లేదని ఆ రాష్ట్రం చేస్తున్న వాదన అశాస్త్రీయంగా ఉందన్నారు. కృష్ణా జలాలను వినియోగించుకుని అధిక నీటిని వినియోగించే వరిని తాము పండించుకుంటామని.. నీటిని పొదుపు చేస్తూ ఆంధ్రప్రదేశ్ అపరాలను పండించుకోవాలని తెలంగాణ వితండవాదం చేస్తోందని తెలిపారు. '75 శాతం నీటి లభ్యత ఆధారంగా ట్రైబ్యునల్-1 కృష్ణా డెల్టాకు 181.20 టీఎంసీలను కేటాయించింది. ఈ కేటాయింపుల్లో 4 టీఎంసీల నీటి ఆవిరి నష్టాలను కూడా పరిగణనలోకి తీసుకుంది. ట్రైబ్యునల్ ఒకసారి కృష్ణా డెల్టాకు నీటిని కేటాయించాక.. నదీ పరీవాహక ప్రాంతానికి అవతల (అవుట్‌సైడ్ బేసిన్) అంటూ వాదించడంలో అర్థమే లేదు' అని స్పష్టంచేశారు.

మేం పొదుపుచేసి తెలంగాణకు ఇస్తున్నాం..

ట్రైబ్యునల్-1 కృష్ణా డెల్టాకు కేటాయించిన 181.20 టీఎంసీల్లో తమ అవసరాలను 152.20 టీఎంసీలకు తగ్గించుకుని సుమారు 29 టీఎంసీలను పొదుపు చేశామని.. అందులో 20 టీఎంసీలను తెలంగాణలోకి బీమా ఎత్తిపోతలకు ఇస్తున్నామని జైదీప్ గుప్తా బ్రిజేశ్ ట్రైబ్యునల్‌కు గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో డెల్టా పరిధిలో ఏపీ మరింత పొదుపు పాటించాలంటూ తెలంగాణ చేస్తున్న వాదనల్లో పస లేదని స్పష్టంచేశారు. 'మేం రబీలో వరికి బదులుగా చిరుధాన్యాలు, అపరాలు పండించుకోవాలని తెలంగాణ సూచనలు చేయడంలో, ప్రస్తుతం 3.4 లక్షల ఎకరాల్లో పండిస్తున్న అపరాల పంటలను లెక్కల్లోకి తీసుకోవాలనడంలో హేతుబద్ధత లేదు. ఖరీఫ్‌లో వేసే వరి పంటకు 150 రోజులకు బదులుగా 122 రోజులకే దిగుబడి చేతికి వచ్చే వంగడాలను వేసుకోవాలని ఆ రాష్ట్రం సూచించడం సమంజసంగా లేదు. ట్రైబ్యునల్-1 ఆదేశాలను, కేటాయింపులను పూర్తిగా విస్మరిస్తోంది. మాకు ఐదు లక్షల ఎకరాల్లో గ్రీన్ మాన్యూర్ కోసం 9.48 టీఎంసీలు వినియోగించేందుకు ట్రైబ్యునల్ అవకాశం కల్పించింది. కృష్ణా డెల్టా పరిధిలోని సముద్ర తీర ప్రాంతంలో ఉప్పునీటి కారణంగా కృష్ణా జలాలను తాగునీటి కోసం సరఫరా చేయాలన్న సంగతిని తెలంగాణ ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తోంది. ప్రస్తుతం డెల్టాలో వేస్తున్న పంటల విధానాన్ని మేం కొనసాగించాల్సిందే. ట్రైబ్యునల్-1 కృష్ణా డెల్టా పరిధిలో రబీ కాలంలో 37,498 ఎకరాల్లో పంటలకు 5.82 టీఎంసీలు కావాలని నిర్ధారించింది. డెల్టా నేల స్వభావం అపరాలు వేసేందుకు సహకరించదు. ఇక్కడ వరి మాత్రమే పండుతుంది. పంటల విధానంలో మార్పులు తెస్తే మా వ్యవసాయానికి, రైతులకు తీవ్ర నష్టం కలుగుతుంది' అని చెప్పారు.

పంటకాలాన్ని తగ్గించాలా?

ట్రైబ్యునల్-1 పంట కాలాన్ని 180 నుంచి 150 రోజులకు కుదించిందని.. దీనిని ఇంకా కుదించి 122 రోజులకే పరిమితం కావాలన్న తెలంగాణ వాదనలో హేతుబద్ధత ఏమాత్రమూ లేదని జైదీప్ గుప్తా అన్నారు. 'మా రాష్ట్రంలో పంటల సాగుకు సంబంధించి రైతులు వ్యవసాయ పంచాంగాన్ని అనుసరిస్తారు. ఈ పంచాంగంలో పంట దిగుబడి సమయం 140 నుంచి 155 రోజులు' అని వివరించారు. తెలంగాణ చెబుతున్నట్లుగా పంటల కోసం 130.19 టీఎంసీలు సరిపోతాయనడం కరెక్టు కాదన్నారు. రాజధాని అమరావతి నగరం అభివృద్ధి కారణంగా వ్యవసాయ విస్తీర్ణం తగ్గి 15.78 టీఎంసీల నీటి వినియోగం ఇప్పటికే తగ్గిందని.. దిగువన పులిచింతల ప్రాజెక్టు ద్వారా 41 టీఎంసీలనే వినియోగించుకుంటున్నామని.. అయినా ట్రైబ్యునల్-1 ఏపీకి కేటాయించిన నీటిని వాడుకోవద్దంటూ తెలంగాణ చేస్తున్న వాదనలను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నామని తెలిపారు. తదుపరి వాదనలను వచ్చే నెల 23, 24, 25 తేదీల్లో వింటామంటూ బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ విచారణను వాయిదా వేసింది.



అమ్మప్రేమకు 'పరీక్ష'

ఏఎన్‌యూ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి యూజీ, పీజీ పరీక్షలు కొనసాగుతున్నాయి. రాజమహేంద్రవరం సమీపంలోని గోకవరం పరీక్ష కేంద్రంలో జరుగుతున్న డిగ్రీ పరీక్షలకు మంగాదేవి అనే విద్యార్థిని తన 3 నెలల చిన్నారితో హాజరయ్యారు. తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. విద్యాభ్యాసాన్ని కొనసాగించాలనే ఆమె పట్టుదల, నిబద్ధత సమాజానికి ఆదర్శంగా నిలుస్తోంది.

'మంతెన'లో చికిత్సకు చెవిరెడ్డికి అనుమతి

విజయవాడ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో విజయవాడ జిల్లా జైల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఫిజియోథెరపి చేయించుకునేందుకు ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. తాను వెన్నునొప్పితో బాధపడుతున్నందున ఉండవల్లిలో ఉన్న మంతెన సత్యనారాయణరాజు ప్రకృతి చికిత్సాలయంలో వైద్యం చేయించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కొద్దిరోజుల క్రితం ఆయన పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదప్రతివాదనలు ముగియడంతో కోర్టు శుక్రవారం తీర్పును వెలువరించింది. 15 రోజులపాటు వైద్యం చేయించుకునేందుకు అనుమతి ఇచ్చింది. అలాగే, ఈ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న అనిల్‌చోఖ్రా తాగడానికి వేడినీళ్లను సమకూర్చాలని ఏసీబీ కోర్టు జైలు అధికారులను ఆదేశించింది.

జైలు నుంచి జోగి సోదరులు విడుదల

ములకలచెరువు నకిలీ మద్యం కేసులో తంబళ్లపల్లె కోర్టు బెయిల్ మంజూరు

ఇబ్రహీంపట్నం కేసులోనూ ఇటీవలే బెయిల్

83 రోజుల జైలు జీవితానికి విముక్తి

విజయవాడ/ములకలచెరువు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రాము శుక్రవారం సాయంత్రం జైలు నుంచి విడుదలయ్యారు. ములకలచెరువు నకిలీ మద్యం కేసులో అన్నమయ్య జిల్లాలోని తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టు వారికి శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. దీంతో విజయవాడ జిల్లా జైలు నుంచి బయటకు అడుగుపెట్టారు. ములకలచెరువు కేంద్రంగా జరిగిన నకిలీ మద్యం తయారీ గుట్టును గత ఏడాది అక్టోబరు 3న ఎక్సైజ్ పోలీసులు రట్టు చేశారు. ఇక్కడ తీగ లాగితే ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో కూడా డొంక కదలడంతో అక్కడ కూడా నకిలీ మద్యం తయారీ యూనిట్‌పై దాడులు చేశారు. రెండు కేసుల్లోనూ ప్రధాన నిందితుడిగా ఉన్న అద్దేపల్లి జనార్దనరావు(ఏ1) వాంగ్మూలంతో నవంబరు 2న జోగి సోదరులను అరెస్టు చేశారు. అలాగే ములకలచెరువు నకిలీ మద్యం కేసులోనూ జోగి సోదరుల పాత్ర, కుట్ర బయటపడడంతో డిసెంబరు 2న వారిని తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరిచారు. కోర్టు రిమాండ్ విధించడంతో విజయవాడ జైలుకు తరలించారు. జోగి సోదరులకు ఈనెల 20న ఇబ్రహీంపట్నం కేసులో విజయవాడ కోర్టు షరతులతో బెయిల్ మంజూరు చేసినా ములకలచెరువు కేసులో బెయిల్ రాకపోవడంతో అప్పుడు విడుదల కాలేదు. తాజాగా ములకలచెరువు కేసులో కూడా బెయిల్ మంజూరు కావడంతో జోగి సోదరులు విజయవాడ జైలు నుంచి విడుదల అయ్యారు. దీంతో 83 రోజుల జైలు జీవితానికి విముక్తి లభించింది. జైలు నుంచి విడుదలయ్యాక జోగి రమేశ్ మీడియాతో మాట్లాడారు. తనను అన్యాయంగా కేసులో ఇరికించి 83 రోజులు జైల్లో ఉంచి, కోర్టుల చుట్టూ తిప్పారని, సిట్ అధికారులు చంద్రబాబు చెప్పినట్లే వింటున్నారని విమర్శించారు. తనపై కేసులు పెట్టిన అధికారులను భగవంతుడు శిక్షిస్తాడని శాపనార్థాలు పెట్టారు.

మీ ఇంట్లో ఎన్ని ఫోన్లు ఉన్నాయి?

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎంత మంది ఉన్నారు? అంటూ ఎప్పుడూ అడిగే ప్రశ్నతో పాటు ఈ సారి జనాభా లెక్కల కోసం వచ్చే అధికారులు.. ఇంట్లో ఎన్ని ఫోన్లు ఉన్నాయి? ల్యాప్‌టాప్, కంప్యూటర్లు ఉన్నాయా? అన్న ప్రశ్నలు కూడా అడుగుతారు. మారిన జీవనశైలికి అనుగుణంగా కేంద్రం జనాభా లెక్కల ప్రశ్నలను కూడా మార్చేసింది. రకరకాల కారణాలతో 2021 నుంచి వాయిదా పడుతూ వస్తున్న జనగణనను చేపట్టేందుకు కేంద్రం సన్నద్ధమవుతోంది. ఇందుకోసం 32 ప్రశ్నలు సిద్ధం చేసింది. ఒక కుటుంబాన్ని పూర్తిగా అధ్యయనం చేసేలా ఈ ప్రశ్నావళి ఉంది. చివరిగా 2011లో జనాభాను లెక్కించారు. 2021లో కరోనా కారణంగా, ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల కారణంగా వాయిదా పడిన జనగణన ప్రక్రియ దేశవ్యాప్తంగా త్వరలో ప్రారంభమవుతుంది. లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను విభజించాలని కేంద్రం యోచిస్తోంది. జనగణన పూర్తయితే 2029లో సీట్లు పెరుగుతాయని, మహిళా రిజర్వేషన్లు కూడా అమలవుతాయని భావిస్తున్నారు. కులగణన, జనాభా లెక్కింపు ఒకేసారి చేస్తారన్న ప్రచారం జాతీయస్థాయిలో కొంతకాలంగా జరుగుతోంది. కానీ జనాభా లెక్కల ప్రశ్నావళిలో కులం కచ్చితంగా తెలుసుకునేలా ఎలాంటి ప్రశ్నలూ లేవు. ఎస్సీ/ఎస్టీ/అదర్ అనే ప్రశ్న ఉంది.

జనగణనలో అడిగే ప్రశ్నలు..

1. ఇంటి నంబరు
2. జనగణన జాబితాలో కేటాయించిన నంబరు
3. ఇంటిలో ఫ్లోర్‌కు వాడిన మెటీరియల్
4. ఇంటి గోడల నిర్మాణానికి వాడిన మెటీరియల్
5. ఇంటి పైకప్పులో వాడిన మెటీరియల్
6. ఇంటిని ఎలా వాడుతున్నారు? (రెసిడెన్షియల్‌గా, పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా, ఖాళీగా ఉందా)
7. ఇల్లు ఆవాసయోగ్యమేనా.. శిథిలావస్థలో ఉందా?
8. కుటుంబ సభ్యుల సంఖ్య ఎంత?
9. ప్రస్తుతం ఇంట్లో ఉంటున్న వారెంతమంది ?
10. ఇంటి పెద్ద పేరు?
11. ఇంటి పెద్ద మహిళా? పురుషుడా?
12. ఇంటి పెద్ద ఎస్సీ, ఎస్టీ లేదా ఇతర సామాజిక వర్గానికి చెందినవారా ?
13. ఉంటున్న ఇల్లు సొంతమా? అద్దె ఇల్లా?
14. ఇంట్లో ఎన్ని గదులు వాడుకుంటున్నారు?
15. ఇంట్లో పెళ్లయిన జంటలు ఎన్ని ఉన్నాయి?
16. తాగునీటి కోసం ప్రధానంగా దేనిపై ఆధారపడుతున్నారు?
17. తాగునీటి వనరులు అందుబాటులో ఉన్నాయా?
18. ఇంట్లో విద్యుత్ అవసరాలకు ఏ వనరులు ఉపయోగిస్తున్నారు. విద్యుత్, సోలార్ విద్యుత్, ఇతర మార్గాలు?
19. మరుగుదొడ్లు ఇంట్లోనే ఉన్నాయా?
20. ఏ రకమైన మరుగుదొడ్లు ఉన్నాయి?
21. ఇంటికి డ్రైనేజీ వ్యవస్థ ఉందా?
22. బాత్‌రూమ్‌లకు పైకప్పు ఉందా? డ్రైనేజీ ఉందా?
23. కిచెన్ ఉందా? ఎల్‌పీజీ/పీఎన్‌జీ వాడుతున్నారా?
24. వంటకోసం ప్రధానంగా వాడే ఇంధనం?
25. రేడియో/ట్రాన్సిస్టర్ ఉందా?
26. టీవీ ఉందా?
27. ఇంట్లో ఇంటర్నెట్ కనెక్షన్ ఉందా?
28. ల్యాప్‌టాప్/కంప్యూటర్లు ఉన్నాయా ?
29. టెలిఫోన్/మొబైల్‌ఫోన్లు/స్మార్ట్‌ఫోన్లు ఎన్ని ఉన్నాయి?
30. ద్విచక్ర వాహనాలు ఏవేవి ఉన్నాయి?
31. కారు/జీపు/వ్యాన్ ఉన్నాయా? ఎన్ని ఉన్నాయి?
32. ఇంట్లో ప్రధానంగా తినే ధాన్యాలు ఏవి?.

ఏసీ రూముల్లో కూర్చొని నిర్ణయాలు!

▸▸ మాంసం, చేపల దుకాణాల కేటాయింపునకు ఈ-వేలమా?

▸▸ విజయవాడ కార్పొరేషన్ అధికారులపై హైకోర్టు ఆగ్రహం


▸▸ నోటిఫికేషన్ నిలుపుదల.. విచారణ మార్చి 3కి వాయిదా



అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మాంసం, చేపల దుకాణాల కేటాయింపునకు ఈ-వేలం నిర్వహించడంపై హైకోర్టు శుక్రవారం మండిపడింది. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు పరిగణనలోకి తీసుకోకుండా, అధికారులు ఏసీ గదుల్లో కూర్చొని నిర్ణయాలు తీసుకుంటున్నారని ఘాటు వ్యాఖ్యలు చేసింది. మాంసం, చేపల దుకాణాలు నిర్వహించే వారికి కంప్యూటర్ ఎలా పనిచేస్తుందో కూడా అవగాహన ఉండదని పేర్కొంది. వేలంలో పాల్గొనేందుకు పలు పత్రాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని, అలాంటివారు ఈ వేలంలో ఎలా పాల్గొంటారని ప్రశ్నించింది. అలాగే ఈ-వేలం టెండర్‌ను తెలుగు పత్రికల్లో ఇంగ్లిష్‌లో ప్రచురించడంపైనా న్యాయస్థానం విస్మయం వ్యక్తం చేసింది. చిరువ్యాపారాల విషయంలో సాంప్రదాయ టెండర్ విధానాన్ని అనుసరిస్తే, మరింత మంది వేలంలో పాల్గొనేందుకు వెసులుబాటు ఉంటుందని వ్యాఖ్యానించింది. విజయవాడలోని మహంతి మార్కెట్‌లో మాంసం, చేపల దుకాణాల కేటాయింపు కోసం విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఈ నెల 6న ఇచ్చిన ఈ-వేలం నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేసింది. తాము తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 3కి వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఉత్తర్వులు ఇచ్చారు. విజయవాడలోని మహంతి మార్కెట్‌లో మాంసం, చేపల దుకాణాల కేటాయింపు కోసం అధికారులు ఈ-వేలం నోటిఫికేషన్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ శంకరరావు అనే చేపల వ్యాపారి పిటిషన్ వేశారు. ఈ-వేలం గురించి ప్రచారం నిర్వహించలేదని, తెలుగు పత్రికల్లో సైతం ఆంగ్లంలో ప్రకటన ఇచ్చారని వివరించారు. విజయవాడ కార్పొరేషన్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.... ఈ-వేలంపై షాపు యజమానులకు అవగాహన కల్పించామన్నారు.

మండలి చైర్మన్ మోషేన్ రాజుపై కోర్టు ధిక్కరణ వ్యాజ్యం

▸▸ విచారణ వచ్చే నెల 13కి వాయిదా



ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తూ తాను ఇచ్చిన రాజీనామా లేఖపై 4 వారాల్లో నిర్ణయం వెల్లడించాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలను శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు ఉల్లంఘించారంటూ ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. వెంకటరమణ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... రాజీనామా లేఖపై 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఇచ్చిన ఆదేశాలపై మోషేన్‌రాజు దాఖలు చేసిన అప్పీల్ సీజే ధర్మాసనం ముందు ఫిబ్రవరి 12న విచారణకు ఉందన్నారు. దీంతో అప్పీల్ పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో విచారణను ఫిబ్రవరి 13వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ప్రకటించారు.

సైనైడ్ కిల్లర్‌కు జీవిత ఖైదు

▸▸ ప్రసాదంలో సైనైడ్ కలిపి పది మంది హత్య

▸▸ ఆపై బంగారం, నగదుతో ఉడాయింపు

▸▸ సహకరించిన మరొకరికి పదేళ్ల జైలు శిక్ష

▸▸ ఏలూరు జిల్లా అదనపు సెషన్స్ కోర్టు తీర్పు

ఏలూరు క్రైం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రైస్ పుల్లింగ్ కాయిన్స్, రంగురాళ్లు పేరిట ఎర వేసేవాడు.. నిజమేనని నమ్మి వచ్చినవారిని ప్రసాదంలో సైనైడ్ పెట్టి చంపేసేవాడు.. ఇలా ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా పది మందిని పొట్టనపెట్టుకున్నాడు. ఆపై మృతుల వద్ద ఉన్న బంగారం, నగదుతో పరారయ్యేవాడు. 2019లో ఓ డ్రిల్ మాస్టార్‌ను కూడా ఇదే తరహాలో హత్య చేసి పోలీసులకు చిక్కాడు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో ఏలూరులోని 8వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు... ఆ సైనైడ్ కిల్లర్‌కు జీవిత ఖైదు, అతడికి సైనైడ్ విక్రయించిన మరో వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష విధించింది. ఏలూరులో శుక్రవారం రాత్రి ఎస్పీ కిశోర్ ఆ వివరాలు వెల్లడించారు.

అసలేం జరిగిందంటే...

ఏలూరు ఎన్టీఆర్ కాలనీకి చెందిన వెల్లంకి సింహాద్రి అలియాస్ శివ.. గతంలో అపార్టుమెంటులో వాచ్‌మెన్‌గా పనిచేసేవాడు. తర్వాత రైస్ పుల్లింగ్ కాయిన్స్, రంగురాళ్లు కొనిపెట్టి.. వాటితో డబ్బును, బంగారాన్ని రెట్టింపు చేస్తానని చెప్పేవాడు. బంగారం, డబ్బులు కాజేసేవాడు. తర్వాత విజయవాడకు చెందిన బంగారపు వస్తువులు తయారీదారుడైన అమీనుల్లా బాబు అలియాస్ బాబుతో పరిచయమైంది. ఆయన వద్ద నుంచి సైనైడ్ తీసుకొచ్చి దాన్ని ప్రసాదంలో కలిపి తన వద్దకు వచ్చేవారికిచ్చి హతమార్చేవాడు. మృతుల వద్ద ఉన్న నగదు, బంగారాన్ని అపహరించేవాడు. ఈ క్రమంలో ఏలూరు అశోక్‌నగర్ కేపీడీటీ హైస్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్న మాదేపల్లికి చెందిన కాటి నాగరాజుతో పరిచయం పెంచుకున్నాడు. రైస్ పుల్లింగ్ కాయిన్ కొనిపెడతానని.. దానితో బంగారం, డబ్బులు రెట్టింపు అవుతాయని ఆయనను నమ్మించాడు. 2019 అక్టోబరులో జెరూసలెం నుంచి ప్రసాదం తీసుకువచ్చానంటూ సైనైడ్ కలిపిన ప్రసాదాన్ని నాగరాజుకు ఇచ్చాడు. అది తిన్న వెంటనే నాగరాజు మరణించాడు. దీంతో ఆయన వద్ద ఉన్న రెండు లక్షల నగదు, ఐదు కాసుల బంగారాన్ని తీసుకుని పరారయ్యాడు. నాగరాజు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి.. వెల్లంకి సింహాద్రి, షేక్ అమీనుల్లాలను అరెస్టు చేశారు. విచారణలో భాగంగా సైనైడ్ కలిపిన ప్రసాదంతో అప్పటికే తొమ్మిది మందిని హతమార్చినట్టు తేలింది. ఏలూరులోని 8వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో ఈ కేసు విచారణ సాగింది. నాగరాజుకు సైనైడ్ కలిపిన ప్రసాదాన్ని ఇచ్చి హతమార్చినట్లుగా సింహాద్రిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, వస్తువులను అపహరించిన కేసులో పదేళ్ల జైలు శిక్ష, రూ.6 వేల జరిమానా విధించారు. ఎస్సీ ఎస్టీ చట్టం కింద మరో జీవిత ఖైదు విధించారు. అతడికి సహకరించిన అమీనుల్లా బాబుకు పదేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు. ఇదిలా ఉండగా ఈ పది హత్యల్లో కృష్ణా జిల్లాలో చేసిన ఒక హత్యకు సంబంధించి సింహాద్రికి ఇప్పటికే జీవిత ఖైదు విధించారు. ప్రస్తుత కేసు రెండోది. మరో 8 కేసుల్లో తీర్పులు రావలసి ఉంది.



సైనైడ్ కిల్లర్ వెల్లంకి సింహాద్రి, ఆయనకు సైనైడ్ విక్రయించిన షేక్ అమీనుల్లా బాబు

విద్యుత్ చార్జీలు ట్రూ డౌన్ చేశాం

» వచ్చే మూడేళ్లలో చార్జీలు మరింత తగ్గిస్తాం

» రూ.1.19 తగ్గించి యూనిట్ రూ.4కే ఇస్తాం: మంత్రి గొట్టిపాటి



గుంటూరు తూర్పు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): దేశ చరిత్రలో విద్యుత్ చార్జీలను ట్రూ డౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని, యూనిట్‌కు 13 పైసలు ట్రూ డౌన్ చేశామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థను గాడిలో పెడుతున్నామని, వచ్చే మూడేళ్లలో యూనిట్ చార్జీ రూ.1.19 వరకు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గుంటూరులో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాణ్యమైన విద్యుత్‌ను తక్కువ ధరకు అందిస్తే రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పుడు యూనిట్ విద్యుత్ చార్జీ రూ.5.19 ఉండేదని, అందులో 29పైసలు తగ్గించామని, మరో 90పైసలు తగ్గింపునకు చర్యలు చేపట్టామని అన్నారు. వచ్చే మూడేళ్లలో యూనిట్ చార్జీ రూ.4కు తగ్గించేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

కూటమిని కూల్చడం ఎవరి తరం కాదు: పల్లా



అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): 'కూటమిని విడగొడితే వైసీపీ గెలుస్తుందని విజయసాయి చెప్పడం వారి భ్రమ. కూటమిని కూల్చడం ఎవరి తరం కాదు. వైసీపీ చేసే ఫేక్ ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. 'ప్రజల తీర్పును గౌరవించి జగన్ అసెంబ్లీకి రావాలి. లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా జరుపుకోవడం... టీడీపీ శ్రేణులు ఉంచుకున్న అచంచలమైన నమ్మకానికి స్పష్టమైన నిదర్శనం. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తూ... పారిశ్రామిక అభివృద్ధి వికేంద్రీకరణ చాంపియన్‌గా లోకేశ్ గుర్తింపు పొందారు' అని పల్లా అన్నారు.

దమ్ముంటే జగన్‌ను నిలదీయండి

» వైసీపీ నేతలకు మంత్రి నిమ్మల హితవు



మార్కాపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వెలిగొండపై ఇప్పుడు ప్రకాశం జిల్లా వైసీపీ నేతలు మాట్లాడటం సరికాదని, ప్రాజెక్టు విషయమై దమ్ముంటే మీ నాయకుడు జగన్‌ను నిలదీసి అడగాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హితవు పలికారు. శుక్రవారం మార్కాపురం జిల్లా దోర్నాల మండల పరిధిలోని కొత్తూరు వద్ద వెలిగొండ టన్నెల్ పనులను, ఫీడర్ కాలువను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు పనుల పురోగతిపై అధికారులతో అక్కడే సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేయకుండానే జాతికి అంకితం చేసిన జగన్ చరిత్రలో సరిదిద్దుకోలేని తప్పుచేశాడు. ఆ విషయం వదిలేసి ప్రాజెక్టుకు నిధులు ఇవ్వాలని, వెంటనే పూర్తి చేయాలని వైసీపీ నాయకులు అడగటం విడ్డూరంగా ఉంది. ప్రాజెక్టును పూర్తిచేయాలని మీరు అడుగుతున్నారంటే మీ జగన్ చేసింది మోసమేనని అంగీకరిస్తున్నట్టేనా?' అని ప్రశ్నించారు. పనులు పెండింగ్‌లో ఉండగానే ప్రాజెక్టును పూర్తిచేశామని ప్రజలను మోసగించి జాతికి అంకితం చేసిన జగన్‌ను వదిలేసి ప్రజా ప్రభుత్వాన్ని ప్రశ్నించే అర్హత వైసీపీ నాయకులకు లేదని మంత్రి స్పష్టం చేశారు.

వైసీపీని పట్టించుకోనవసరం లేదు: మంత్రి కొలుసు



ఏలూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ నేతలు బయటకు వచ్చి వీరంగం వేయాలని చూస్తున్నా వారు కూటమి నాయకుల వెంట్రుకలు కూడా పీకలేరు' అని మంత్రి కొలుసు పార్థసారథి ఘాటుగా వ్యాఖ్యానించారు. ఏలూరులో శుక్రవారం జరిగిన జిల్లా టీడీపీ అధ్యక్షుడు బడేటి చంటి, ఇతర కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'అమరావతి రాజధాని, వైద్య కళాశాలల నిర్మాణాలకు కనీసం రూ.500 కోట్లు కూడా ఖర్చు పెట్టలేని వైసీపీ... ఇప్పుడు నానా యాగీ చేస్తోంది. ఆ పార్టీ కూటమి పాలనపై చేస్తున్న బురద రాజకీయాలను పట్టించుకోనవసరం లేదు' అని మంత్రి సూచించారు.

జగన్ శవయాత్ర చేసినా పట్టించుకోరు: మంత్రి సవిత

తాడేపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): 'వైసీపీకి ప్రజలెప్పుడో పాడె కట్టేశారు. జగన్ శవయాత్ర చేసినా ప్రజలు పట్టించుకోరు. మంత్రి లోకేశ్‌ను చూస్తే జగన్‌కు వెన్నులో వణుకు' అని మంత్రి సవిత వ్యాఖ్యానించారు. శుక్రవారం గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ప్రాతూరులో టీడీపీ సీనియర్ నేత కొమ్మారెడ్డి కిరణ్ ఏర్పాటు చేసిన లోకేశ్ జన్మదిన వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. భారీ కేక్ కట్ చేసి పేదలకు చీరలు, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 'అరెస్టు భయంతో జగన్ డైవర్షన్ రాజకీయాలకు కొత్త డ్రామా మొదలుపెట్టారు. పాదయాత్ర సంగతి తరువాత... జగన్ నువ్వు ముందు అసెంబ్లీకి వచ్చి పులివెందుల సమస్యలపై మాట్లాడు. రాష్ట్రాభివృద్ధిలో మంత్రి లోకేశ్ పాత్ర గణనీయం. తండ్రికి తగ్గ తనయుడిగా పెట్టుబడుల సేకరణలో ఏపీని అగ్రగామిగా నిలబెట్టారు. జగన్ అసమర్థ పాలన వల్ల రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కు వెళ్లిపోయింది' అని మంత్రి విమర్శించారు.

పేర్నికి లీగల్ నోటీసులిస్తా: మంత్రి అనగాని

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): 'నా వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ మాట్లాడిన వైసీపీ మాజీ మంత్రి పేర్ని నానికి లీగల్ నోటీసులు పంపిస్తా. చట్టపరంగా చర్యలు తీసుకుంటా' అని మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో తనను కలిసిన మీడియాతో ఆయన మాట్లాడారు. 'వైసీపీ నేతలకు రాజకీయంగా తలపడడం చేతగాక వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. వారి నేత జగన్ నిత్యం చేసేది అదే. ఇప్పుడు పేర్ని నాని ఆయన బాటలో పయనిస్తున్నాడు. వైసీపీ ప్రభుత్వంలో రీ-సర్వే హడావుడిగా చేయడం వల్ల చాలా తప్పులు దొర్లాయి. వాటిని కూటమి ప్రభుత్వం సరిచేస్తోందని చెప్పాం. పేర్ని నాని ప్రెస్ మీట్‌లోనే వైసీపీ ప్రభుత్వం ముద్రించిన పాసుపుస్తకంలోని క్యూఆర్ కోడ్ తెరుచుకోని పరిస్థితి కనిపించింది. అసలు విషయాన్ని పక్కన పెట్టి, వ్యక్తిగత దూషణలకు దిగారు. నా రేటు పేర్ని నాని చెప్పేదేంటీ? డబ్బు కోసం నేను రాజకీయాల్లోకి రాలేదు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని, డబ్బు సంపాదించడం వారికి అలవాటు' అని అనగాని మండిపడ్డారు.


లెవన్‌రెడ్డి జైలుకెళ్లడం ఖాయం: పట్టాభి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): 'కేసులన్నీ కొలిక్కి వచ్చాయి. అతి త్వరలో జగన్ జైలుకెళ్లడం ఖాయం' అని ఏపీ స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం అన్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని డంపింగ్ యార్డును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. 'వైసీపీ ప్రభుత్వంలో మద్యం స్కాం జరిగిందని జగన్ ఆత్మ విజయసాయిరెడ్డి విచారణలో చెప్పారు. తిన్న మొత్తాన్ని కచ్చితంగా కక్కిస్తాం. జగన్ ఎన్ని పాదయాత్రలు చేసినా ప్రయోజనం లేదు. ఆయన్ను రెండోసారి ఎన్నుకునేందుకు ప్రజలు సిద్ధంగా లేరని విజయసాయి చెప్పడం కూటమి మరో రెండు మూడు దఫాలు అధికారంలోకి వస్తుందనేందుకు నిదర్శనం. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాలను పరుగులు పెట్టిస్తోంది' అని పట్టాభి అన్నారు.

ఏపీ భవన్ జేసీగా ఎంవీఎస్ రామారావు

న్యూఢిల్లీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ (ఏపీ భవన్) జాయింట్ కమిషనర్‌గా ఎంవీఎస్ రామారావు నియమితులయ్యారు. ఇప్పటివరకు భవన్ డిప్యూటీ కమిషనర్ (ప్రోటోకాల్)గా విధులు నిర్వర్తిస్తున్న రామారావు జాయింట్ కమిషనర్‌గా పదోన్నతి పొందడంతో ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్, డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ, లైజన్ ఆఫీసర్లు కదిరి మోహనప్రభాకర్, సురేష్‌బాబు తదితరులు సత్కరించారు.

ఉదారంగా రుణాలివ్వండి





ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

> రాష్ట్రంలో ఏ ఒక్కరూ ప్రైవేట్ వ్యక్తుల వద్ద రుణాలు తీసుకునే పరిస్థితి ఉండకూడదు. వ్యవసాయం సహా ఏ అవసరం వచ్చినా బ్యాంకుల వద్దకు వెళ్లి రుణాలు తీసుకునే పరిస్థితి రావాలి. బ్యాంకర్లు ఆ దిశగా పని చేయాలి. రాష్ట్రంలో అన్ని రంగాలూ అభివృద్ధి బాట పట్టాలంటే ఎంఎస్ఎంఈలను ఎక్కువగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.
>
> - రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రానికి విచ్చేసిన చంద్రబాబు నేరుగా బ్యాంకర్లతో భేటీ అయ్యారు. 2025-26 వార్షిక రుణ ప్రణాళిక అమలుపై సమీక్షించారు. వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా ఇప్పటివరకు వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.2.96 లక్షల కోట్ల మేర రుణాలు ఇచ్చినట్లు ఈ సందర్భంగా బ్యాంకర్లు వెల్లడించారు. కౌలు రైతులకు రూ.1,490 కోట్లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు(ఎంఎస్ఎంఈ) రూ.95,714 కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. 'ప్రజలకు భరోసా ఇచ్చేలా పాలన ఉండాలి. గత పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయి. ఎక్కువ వడ్డీలకు పెద్ద ఎత్తున అప్పులు తెచ్చారు. క్రెడిబిలిటీ ఉంటే తక్కువ వడ్డీకే రుణాలు తెచ్చుకోవచ్చు. అందుకే క్రెడిబిలిటీకి, బ్రాండింగ్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాం. ఏపీలో రూ.2 లక్షల కోట్ల మేర రుణాలను రీ-షెడ్యూల్ చేసుకునే అవకాశం ఉందని అంచనా వేశాం. ఇప్పటికే రూ.49 వేల కోట్ల రుణాలు రీ-షెడ్యూల్ చేశాం. రుణాల రీ-షెడ్యూల్ వల్ల రూ.1,108 కోట్ల మేర ఆదా చేసుకోగలుగుతున్నాం' అని అన్నారు.

టిడ్కో ఇళ్లకు రుణాలు ఇవ్వాలి

'ఎంఎస్ఎంఈలు, ఇతర కీలక రంగాలకు బ్యాంకర్ల సహకారం కావాలి. వ్యాపారాల్లో బలహీన వర్గాలకు చేయూతనిచ్చే ఎంఎస్ఎంఈలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి ప్రభుత్వంతో పాటు బ్యాంకులు వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరం ఉంది. దీనివల్ల ప్రాథమిక రంగంతో పాటు పారిశ్రామిక, సేవారంగాలు కూడా అభివృద్ధి చెంది రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుంది. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలంటే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చెందిన ఎంఎస్ఎంఈలు ఆర్థికంగా ఎదిగేలా, మరింత ప్రోత్సాహం ఇవ్వాలి. అప్పుడే అన్ని రంగాల్లో బడుగులూ ఎదుగుతారు. వారికి ప్రభుత్వం నుంచి చేయాల్సింది చేస్తున్నా. బ్యాంకర్ల నుంచీ సహకారం ఉండాల్సిందే. దీనివల్ల పేద-ధనికుల మధ్య తారతమ్యాలు పోతాయి. పీపీపీ ప్రాజెక్టులకు వీజీఎఫ్ ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ విధానంతో ముందుకెళ్తున్నాం. సేవారంగం పుంజుకునేందుకు ప్రణాళికలు వేస్తున్నాం. పునరుత్పాదక ఇంధన రంగానికి బ్యాంకర్లు విరివిగా రుణాలివ్వాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. డిస్కంలు కూడా కౌంటర్ గ్యారెంటీ ఇస్తున్న విషయాన్ని బ్యాంకర్లు గుర్తించాలి. టిడ్కో ఇళ్లపై గత ప్రభుత్వ హామీ అమలు కాక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు ఆ టిడ్కో ఇళ్లకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లకున్న సాంకేతిక ఇబ్బందులను అధిగమించేలా చర్యలు తీసుకుంటాం. సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నాం. బ్యాంకర్లు కూడా సహకరించాలి. డ్వాక్రా సంఘాల బ్యాంక్ ఖాతాలపై 15 రకాల చార్జీలు వేస్తున్నారు. వీటిని తగ్గించాలి. భూ రికార్డులను ప్రక్షాళన చేస్తున్నాం. గత ప్రభుత్వం 22ఏ పేరుతో భూ వివాదాలు సృష్టించింది. ఇప్పుడు భూ రికార్డులకు పూర్తి భద్రత కల్పిస్తున్నాం. క్యూఆర్ కోడ్‌తో పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తున్నాం. బ్యాంకర్లు కూడా బ్యాంక్ ఖాతాలకు క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టే అంశంపై ఆలోచన చేయాలి. ఇకపై రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశాలకు జిల్లా కలెక్టర్లను కూడా ఆహ్వానించండి' అని సీఎం సూచించారు.

ఫైనాన్స్ సంస్థలకు కేంద్రం అమరావతి

'రాజధాని అమరావతిని ఫైనాన్స్ సంస్థలకు కేంద్రంగా చేయాలని భావిస్తున్నాం. బ్యాంకులు సహా వివిధ ఆర్థిక రంగ సంస్థలు కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నాయి. 15 బ్యాంకుల కార్యాలయాల ఏర్పాటుకు ఇటీవలే శంకుస్థాపన చేశాం. నిర్మాణాలు మరింత ఊపందుకుని త్వరితగతిన పూర్తి కావాలి' అని చంద్రబాబు అన్నారు. స్టార్టప్ కంపెనీలకు చేయూతనిచ్చే అంశంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పరిశ్రమలు ప్రారంభించే వారికి వివిధ బ్యాంకులు మద్దతు ఇస్తున్నట్లు బ్యాంకర్లు సీఎం దృష్టికితెచ్చారు. అమరావతిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రధాన కార్యాలయానికి యూనియన్ బ్యాంక్, రాజమండ్రి స్పోక్ హబ్‌కు ఎస్బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, విశాఖ స్పోక్ హబ్‌కు పీఎన్బీ, అనంతపురం స్పోక్ హబ్‌కు కెనరా బ్యాంక్, తిరుపతి స్పోక్ హబ్‌కు ఇండియన్ బ్యాంక్, విజయవాడ స్పోక్ హబ్‌కు హెచ్డీఎఫ్‌సీ సహకరిస్తున్నట్లు వివరించారు. లీడ్ బ్యాంకుగా యూనియన్ బ్యాంక్ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.10కోట్లు విరాళంగా ఇచ్చింది. మంత్రులు పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, సీఎస్ విజయానంద్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్, ఆర్బీఐ, నాబార్డు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చంద్రబాబు

నేతాజీకి సీఎం ఘన నివాళి

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు ఆయనకు నివాళులర్పించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో నేతాజీ చిత్రపటానికి సీఎం పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో పలువురు మంత్రులు పాల్గొన్నారు.

సీఎంతో ఆర్టీఐ కమిషనర్ల భేటీ

రాష్ట్రంలో ఇటీవల నియమితులైన ఆర్టీఐ కమిషనర్లు సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఆర్టీఐ చీఫ్ కమిషనర్ వజ్జా శ్రీనివాసరావు, కమిషనర్లు వంటేరు రవిబాబు, గాజుల ఆదెన్న, పీఎస్ నాయుడు, వీఎస్‌కే చక్రవర్తి సీఎంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీఐ కమిషనర్లకు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు.

వచ్చే 16 నుంచి నిరవధిక సమ్మె చేస్తాం

» వ్యవసాయ సహకార సంఘ ఉద్యోగుల జేఏసీ

విజయవాడ (గాంధీనగర్), జనవరి 23(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 16 నుంచి సహకార సంఘ ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగనున్నారు. ఈమేరకు సహకార సంఘ ఉద్యోగుల జేఏసీ నేత బొల్లినేని రఘురామ్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. డిసెంబరు 6నుంచి దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నామని, ఈ నెల 27నుంచి ఫిబ్రవరి 12 వరకు గుంటూరులోని సహకార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద వంటావార్పు కార్యక్రమం చేపడతామన్నారు. 13న కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే ఫిబ్రవరి 16 నుంచి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. జీవో 36ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సీమకు జల సిరులు

> హంద్రీ నీవా నుంచి రికార్డు స్థాయిలో 40.109 టీఎంసీల జలాలు తరలింపు
>
> 50 టీఎంసీలు తీసుకెళ్లడమే లక్ష్యం కావాలి
>
> సీమలోని రిజర్వాయర్లు, చెరువులూ నిండితేనే నాకు సంతోషం: సీఎం

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా నుంచి రాయలసీమకు 50 టీఎంసీలు తరలించి సరికొత్త రికార్డు సృష్టించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దావోస్ పర్యటన ముగించుకుని శుక్రవారం వెలగపూడి సచివాలయానికి వచ్చిన ఆయనను రాయలసీమ మంత్రులు పయ్యావుల కేశవ్, బీసీ జనార్దనరెడ్డి, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు కలసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా హంద్రీ-నీవా ప్రాజెక్టు నుంచి తొలిసారిగా 40.109 టీఎంసీల జలాలను రికార్డు స్థాయిలో రాయలసీమకు తరలించినందుకు సీఎం చంద్రబాబును రాయలసీమ మంత్రులు అభినందిస్తూనే... కృతజ్ఞతలు తెలిపారు. ప్రాజెక్టు డిజైన్డ్ కెపాసిటీని మించి తొలిసారిగా రికార్డు స్థాయిలో 40.109 టీఎంసీలను సీమ ప్రాంతానికి తరలించడంపై అందరూ హర్షం వ్యక్తం చేశారు. 'హంద్రీనీవాతో సీమకు నీటిని తరలించడంలో సఫలీకృతం కావడానికి కూటమి ప్రభుత్వమే కారణం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు పంపుల సామర్థ్యాన్ని 12 పంపులకు పెంచాం. అలాగే 100 రోజుల్లో హంద్రీ-నీవా కాల్వల వెడల్పు పనులు పూర్తి చేయడమూ రికార్డే. ఈ ప్రాజెక్టులో భాగమైన మచ్చుమర్రి ఒక మేలి మలుపు' అని పయ్యావుల అన్నారు. మచ్చుమర్రి వల్లే సీమకు నీళ్లు ఇవ్వగలుగుతున్నామని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నిరంతర పర్యవేక్షణతోనే హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు రికార్డు స్థాయిలో పూర్తి చేయగలిగామని ఆయన అన్నారు. సీఎం స్పందిస్తూ.. 'సాధించిన దానితో తృప్తి పడొద్దు. ఫిబ్రవరి నెలాఖరు లేదా మార్చి నెల మొదటి వారంలోగా అదనంగా మరో 10 టీఎంసీలను తరలించి మొత్తంగా 50 టీఎంసీలను సీమకు పంపేలా చర్యలు చేపట్టండి. రాయలసీమ ప్రాంతంలోని రిజర్వాయర్లు, చెరువులు నిండినప్పుడే నాకు సంతోషం.' అని సీఎం పేర్కొన్నారు.



భాష్యం సంస్థల అధినేత రామకృష్ణ ఇచ్చిన విరాళంతో అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు



కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలో దుస్తులు కొనుగోలు అనంతరం షాపింగ్‌మాల్‌లో మంత్రి సుభాష్‌తో అనాథ ఆశ్రమ పిల్లలు

ఉప్పొంగిన అభిమానం!

(మొదటి పేజీ తరువాయి)

వడ్డించారు. శ్రీవారి ఆలయం ముందున్న అఖిలాండం వద్ద టీడీపీ నేతలు 1,116 కొబ్బరికాయలు కొట్టారు. ఇక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో ఉన్న ముచ్చుమిల్లి న్యూలైఫ్ ఫౌండేషన్‌లో ఆశ్రయం పొందుతున్న 70మంది అనాథ చిన్నారులను మంత్రి వాసంశెట్టి సుభాష్ టూరిస్టు బస్సులో పట్టణంలోని రిలయన్స్ ట్రెండ్స్ షాపింగ్ మాల్‌కు తీసుకువెళ్లారు. అక్కడ వారికి నచ్చిన దుస్తులు కొనుగోలు చేసి పిల్లలకు అందజేశారు. విజయనగరం జిల్లాలో చేపట్టిన రక్తదాన శిబిరాల్లో 1,079 యూనిట్ల రక్తాన్ని సేకరించి, ప్రభుత్వ బ్లడ్ బ్యాంకుకు అందించారు. ఇక రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తన స్వగ్రామం వెంకటాపురంలో పారిశుధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు. రాయదుర్గంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు భరత్ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. ఏలూరు జిల్లా కైకలూరులో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 96మంది రక్తదానం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో పదివేల మంది పేదలకు ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేశారు.



బుద్దా వెంకన్న ఆధ్వర్యంలో విజయవాడ వన్‌టౌన్ రథం సెంటర్ వద్ద 40 అడుగుల లోకేశ్ కటౌట్

గల్ఫ్‌లో టీడీపీ అభిమానుల సంబరాలు

లోకేశ్ జన్మదిన వేడుకలను శుక్రవారం గల్ఫ్ దేశాల్లో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. సౌదీ అరేబియాలోని రియాద్‌లో టీడీపీ నాయకులు జానీ బాషా, రాజశేఖర్ చెన్నుపాటి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో మహిళలు, పార్టీ అభిమానులు పాల్గొని రక్తదానం చేశారు. ఒమన్‌లోని మస్కట్ నగరంలో గారపాటి సత్యశ్రీధర్, అనిల్ నాగిడి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పెద్దసంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు. ఖతార్, బహ్రెయిన్, దుబాయిల్లో కేకులు కట్ చేశారు. కువైత్‌లో కోడూరి వెంకట్ ఆధ్వర్యంలో జరిగిన సభలో భారీగా అభిమానులు పాల్గొన్నారు.

విజయవాడలో లోకేశ్ భారీ కటౌట్

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ఆధ్వర్యంలో విజయవాడ వన్‌టౌన్ రథం సెంటర్ వద్ద 40 అడుగుల లోకేశ్ కటౌట్ ఏర్పాటు చేశారు. లోకేశ్‌కు బుద్దా వెంకన్న ట్విట్టర్‌లో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం పార్టీని నడిపించే బాధ్యతను త్వరలో చేపడతారని ఆశిస్తూ ఇలాంటి మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని కోరారు.


టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో..

అమరావతిలోని హైకోర్టు వద్ద టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లీగల్ సెల్ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ పారా కిశోర్‌తో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. వరుసగా నాలుగో ఏడాది నిర్వహించిన ఈ శిబిరంలో పెద్దఎత్తున న్యాయవాదులు రక్తదానం చేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి, లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకొని భారీ కేక్ కట్ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, న్యాయవాదులు గొట్టిపాటి రామకృష్ణ, పాండురంగారావు, చుక్కపల్లి రమేష్ పాల్గొన్నారు.



ఒమన్‌లోని మస్కట్ నగరంలో గారపాటి సత్యశ్రీధర్, అనిల్ నాగిడి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం

లోకేశ్‌కు పవన్ శుభాకాంక్షలు



మంత్రి లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'రాష్ట్ర విద్యా వ్యవస్థలో భావితరాల ప్రయోజనాలకు అనుగుణంగా మార్పులు తీసుకురావడంలో, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సుహృద్భావ వాతావరణ కల్పిస్తూ, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో లోకేశ్ ముందుడుగు వేస్తున్నారు. రాష్ట్రంలో ఐటీ సంస్థల స్థాపనకు కృషి చేస్తూ, యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే దిశగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రజలకు సేవ చేస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లేందుకు ఆయనకు మరింత శక్తి, సుఖసంతోషాలను అందించాలని ప్రార్థిస్తున్నాను' అని 'ఎక్స్'లో చేసిన పోస్టులో పవన్ పేర్కొన్నారు.

మద్యం స్కాం గురించి తెలీదు!

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన మద్యం కుంభకోణంలో మిథున్ రెడ్డి కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలున్నాయి. ఏ1 రాజ్ కసిరెడ్డితోపాటు మిథున్ రెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డికి అరబిందో నుంచి రూ.వంద కోట్లు అప్పుగా ఇప్పించినట్లు వైసీపీ మాజీ ఎంపీ విజయ సాయిరెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సాయిరెడ్డిని ప్రశ్నించిన మరుసటి రోజే... హైదరాబాద్‌లో మిథున్ రెడ్డి ఈడీ ముందు హాజరయ్యారు. ఆయనను ఈడీ అధికారులు శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు.. ఏడు గంటలపాటు ప్రశ్నించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... మద్యం పాలసీ రూపకల్పన, ముడుపుల పర్సెంటేజీ ఖరారు, మద్యం ఆర్డర్లలో ఆటోమేటిక్ విధానాన్ని మాన్యువల్‌గా మార్పించిన వైనం, ఎక్సైజ్ అధికారులతో కలిసి మద్యం దోపిడీకి మార్గం వేసిన తీరు, ఆర్థిక అవకతవకలు, మనీ లాండరింగ్ వంటి అంశాలపై ఈడీ అధికారులు ప్రశ్నలు సంధించారు. మిథున్ రెడ్డి దేనికీ సూటిగా, స్పష్టంగా సమాధానం చెప్పలేదని తెలిసింది. సరైన జవాబులు చెప్పకపోగా... "నాకు సంబంధంలేదు. నాకేమీ తెలీదు. రాజకీయ దురుద్దేశంతోనే కూటమి పెద్దలు నన్ను ఈ కేసులో ఇరికించారు" అని చెప్పినట్లు సమాచారం. అదాన్ డిస్టిలరీస్‌తో ఆయన వ్యాపార భాగస్వామ్యానికి సంబంధించిన ఆధారాలు చూపించినప్పుడు... మిథున్ రెడ్డి కొంత కంగారు పడినట్లు తెలిసింది. ఆ తర్వాత... 'అవన్నీ మా ఆడిటర్ చూసుకుంటారు' అని బదులిచ్చినట్లు తెలిసింది. తమ కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలోకి డిస్టిలరీస్ ఖాతాల నుంచి జమ అయిన రూ.5 కోట్లు ముడుపుల సొమ్ము కాదని, ఆ సొమ్ము అప్పుడే వెనక్కి ఇచ్చేశామని బదులిచ్చినట్లు సమాచారం. ఒక్కో మద్యం కేసు(బాక్స్)కు రూ.450 నుంచి రూ.600గా ముడుపులు ఎవరి ఆదేశాలతో నిర్ణయించారని అడగ్గా... అలాంటి పని చేయలేదని బదులిచ్చారు. "మీ పార్టీ మాజీ రాజ్యసభ సభ్యుడి (విజయసాయి రెడ్డి) ఇంట్లో లిక్కర్ పాలసీ రూపకల్పనపై నిర్వహించిన సమావేశాల్లో మీరు చర్చించిన అంశాలపై ఆధారాలున్నాయి" అని ఈడీ అధికారులు చెప్పినప్పుడు... "ఒకే పార్టీలో ఎంపీలుగా ఉన్నప్పుడు ఒకరింటికి మరొకరు వెళ్లి కలవడం అత్యంత సాధారణ విషయం. అలానే నేను కూడా మా పార్టీ ఎంపీలను కలుస్తాను" అని మిథున్ పేర్కొన్నారు. వైసీపీ అధికారంలోకి రాక ముందు ఉన్న మద్యం ఆర్డర్ల ఆటోమేటిక్ విధానాన్ని మాన్యువల్‌గా మార్చే ఆలోచన ఎవరిదన్న ప్రశ్నకు ఎలాంటి సమాధానం చెప్పకుండా మౌనం వహించారు. 2019 ఎన్నికల నాటి అఫిడవిట్‌తో పోల్చితే 2024 నాటికి ఆస్తులు బాగా పెరిగాయని ఈడీ అధికారులు గుర్తు చేశారు. అదంతా ఎలా వచ్చింది? ఆదాయపు పన్ను శాఖకు లెక్కలు చెప్పారా.? అని అడగ్గా... 'ఔను' అని సమాధానం ఇచ్చారు. లిక్కర్ స్కామ్‌లో కీలక నిందితులు రాజ్ కసిరెడ్డి, విజయసాయి రెడ్డి, వాసుదేవ రెడ్డి గురించి ఈడీ అధికారులు ప్రశ్నించినప్పుడు... వారితో తనకు ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవని చెప్పినట్లు తెలిసింది. అయితే, తాను మనీలాండరింగ్ జోలికి ఎప్పుడూ వెళ్లలేదని, తమ కుటుంబానికి కన్‌స్ట్రక్షన్‌తో పాటు ఇతర వ్యాపారాలు ఉన్నాయని చెప్పారు. మిథున్ రెడ్డి చెప్పిన విషయాలు నమోదు చేసుకున్న ఈడీ అధికారులు... అవసరమైతే మరోమారు పిలుస్తామని, అందుబాటులో ఉండాలని చెప్పి పంపించారు.

'హాల్‌మార్క్' లేని రూ.3 కోట్ల ఆభరణాలు స్వాధీనం

» విజయవాడ బంగారం దుకాణంలో బీఐఎస్ అధికారుల తనిఖీలు

విజయవాడ అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విజయవాడ గవర్నర్‌పేటలోని రాహుల్ జ్యూయలర్స్‌లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. హాల్‌మార్క్ లేని సుమారు రూ.3 కోట్లకు పైగా విలువ చేసే 2.192 కిలో గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దుకాణం యజమాని మహావీర్ జైన్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ టి.అర్జున్ మాట్లాడుతూ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన వ్యాపారులపై అయిదు రెట్ల వరకు జరిమానా, ఒక ఏడాది జైలు శిక్ష ఉంటాయని తెలిపారు.

సీసీఐ స్కాంలో అధికారులపై చర్యలు నిలుపుదల

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2016లో మద్దతు ధరకు సీసీఐ పత్తి కొనుగోలు చేసిన అంశంలో కుంభకోణాలకు పాల్పడ్డారంటూ అభియోగాలు ఎదుర్కొంటున్న ఐదుగురు మార్కెటింగ్‌శాఖ అధికారులకు ప్రభుత్వం ఉపశమనం కల్పించింది. ఈ వ్యవహారంలో కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్ విచారణ పూర్తై, క్రమశిక్షణ చర్యలు ముగియడంతో ఇద్దరు జేడీఎంలు, ఒక డీడీఎం, ఇద్దరు ఏడీఎంలపై తదుపరి చర్యలను ప్రభుత్వం నిలుపుదల చేసింది.

వేసవి సెలవుల్లో టీచర్ల బదిలీలు

▸▸ ఉపాధ్యాయ సంఘాలతో పాఠశాల విద్యాశాఖ భేటీ

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల చట్టాన్ని అనుసరించి వేసవి సెలవులు ఇచ్చే ఏప్రిల్, మే నెలల్లో బదిలీల ప్రక్రియ ప్రారంభమవుతుందని పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం మంగళగిరిలోని విద్యాభవన్‌లో ఉపాధ్యాయ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. హైస్కూల్ ప్లస్‌ల్లోని ఖాళీల భర్తీ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. వేసవి సెలవుల్లో పనిచేసిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులపై త్వరలో ఉత్తర్వులు జారీ అవుతాయని చెప్పారు. రెగ్యులర్ పోస్టుల ఖాళీలు ఏర్పడేవరకూ క్లస్టర్ టీచర్లు అక్కడే కొనసాగుతారని, వారికి పాత స్టేషన్ పాయింట్లే వస్తాయని స్పష్టం చేశారు. బదిలీ పాయింట్లలో డెసిమల్స్ స్థాయిలో పాయింట్లు కేటాయిస్తామన్నారు. ఇకనుంచి ప్రతివారం ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. టీచర్లకు పే ప్రొటెక్షన్ ఉత్తర్వులు ఇటీవల విడుదల చేశామని తెలిపారు. ఎస్జీటీలకు 30:70 నిష్పత్తిలో స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్ పదోన్నతులు ఉంటాయని వెల్లడించారు.

త్రికోటేశ్వర స్వామికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు

▸▸ శివరాత్రి రోజున సమర్పించనున్న దేవదాయ మంత్రి ఆనం

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఫిబ్రవరి 12 నుంచి 15 వరకూ ఘనంగా నిర్వహించాలని దేవదాయ శాఖ నిర్ణయించింది. శివరాత్రిరోజున స్వామి, అమ్మవార్లకు ప్రభుత్వం తరపున దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఈ మేరకు ఆ శాఖ ఎక్స్ అఫిషియో సెక్రటరీ హరిజవహర్ లాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆవు దూడపై లైంగిక దాడి

▸▸ పోలీసుల అదుపులో నలుగురు బాలురు

ములకలచెరువు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆవుదూడపై లైంగిక దాడి చేశారంటూ 17 ఏళ్ల లోపు వయసున్న నలుగురు బాలురను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువు మండలంలోని ఒక గ్రామంలో ఈ నెల 11న ఈ సంఘటన జరిగింది. దీనిని కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వెలుగులోకి వచ్చింది. కాగా, హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం బురకాయలకోటలో ముంబై-చెన్నై రహదారిపై హిందూ సమ్మేళనం నాయకుడు విజయకుమార్, బీజేపీ నేతలు గోపాలరెడ్డి, మంగరాజు, ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. బాలురను శనివారం తిరుపతి కోర్టులో హాజరుపరచనున్నారు. సీఐ వెంకటేశులు, ఎస్ఐ ప్రతాప్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గణతంత్ర అవార్డులకు 40 మంది ఎంపిక

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ 40 మందిని ఉత్తమ అవార్డులకు ఎంపిక చేసినట్లు ఏపీఎల్‌డీఏ సీఈవో శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఉత్తమ రైతు కేటగిరిలో యు.శేషఫణి(నంద్యాల), డి.శ్రీకాంత్(తిరుపతి), సీహెచ్ అమరకృష్ణ, ఎన్.చంద్రశేఖర్(ప్రకాశం), ఎం.మురళీకృష్ణ, కె.హరిబాబు(బాపట్ల) ఉన్నారు.

దూరదర్శన్‌లో స్ట్రింగర్లకు నోటిఫికేషన్

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అన్ని జిల్లాల్లో వార్తల సేకరణకు జిల్లా ప్రతినిధుల(స్ట్రింగర్లు) ఎంప్యానల్‌మెంట్‌కు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు విజయవాడ డీడీకే హెడ్ ఆఫ్ న్యూస్ షఫీ మహమ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగే వార్తలు, ప్రస్తుత వ్యవహారాలు, క్రీడలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల సమాచారాన్ని సేకరించి దూరదర్శన్‌కు అందించాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి 20 వరకు దరఖాస్తులను విజయవాడలోని ప్రాంతీయ వార్త విభాగంలో సమర్పించాలని, నోటిఫికేషన్ కోసం ప్రసారభారతి వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

అది నెయ్యే కాదు!

(మొదటి పేజీ తరువాయి)

సరఫరా అయినట్లు తమ విచారణలో తేలినట్లు తెలిపింది. ఈ మేరకు నెల్లూరు ఏసీబీ కోర్టులో శుక్రవారం తుది చార్జిషీటు దాఖలుచేసింది. టీటీడీ అధికారులు, గత ప్రభుత్వ పెద్దలు, నెయ్యి సరఫరాదారులు కుమ్మక్కై ప్రణాళిక ప్రకారం కోట్లాది మంది శ్రీవేంకటేశ్వరుడి భక్తుల విశ్వాసాన్ని దెబ్బ తీశారని తెలిపింది. భోలే బాబా డెయిరీ, టీటీడీ బోర్డు పెద్దలు, అధికారులు నడిపించిన తతంగాన్ని కూలంకషంగా వివరించింది. నెయ్యి సరఫరాలో కుట్రలకు ఆధారాలు సమర్పించడంతో పాటు టెండర్లలో నిబంధనల మార్పు ద్వారా అంతిమంగా ఎవరెవరు ఎలా లబ్ధి పొందారు.. ఢిల్లీలోని మలేసియా పామాయిల్ దిగుమతిదారు నుంచి హర్ష ఫ్రెష్ డెయిరీ పేరుతో పామాయిల్.. అజయ్ కుమార్ సగంధ్ అనే వ్యాపారి నుంచి కెమికల్ కొనుగోలు చేసి ఫేక్ నెయ్యి ఎలా తయారుచేశారు.. వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న, టీటీడీ క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఎలా కుమ్మక్కయ్యారో చార్జిషీట్లో వివరించింది.



ఇదీ నేపథ్యం..

2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి నాళ్లలో.. తిరుమలేశుడి లడ్డూ ప్రసాదంలో నాణ్యత లోపించిందని వరుస ఫిర్యాదులు రావడం.. అదే సమయంలో లడ్డూ తయారీకి సరఫరా అవుతున్న నెయ్యిలో జంతు కొవ్వు అవశేషాలు కలిసినట్లు మైసూరులోని ల్యాబ్ నివేదిక ఇవ్వడంతో ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు బయటపెట్టిన సంగతి తెలిసిందే. దీని నిగ్గుతేల్చేందుకు గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, విశాఖ రేంజ్ డీఐజీ(ఇప్పుడు ఐజీ) గోపీనాథ్ జెట్టి తదితర పోలీసు అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేశారు. వైసీపీ నేతలు దీనిని రాజకీయ కుట్రగా పేర్కొన్నారు. టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఏకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై ధర్మాసనం అదే ఏడాది అక్టోబరులో సీబీఐ జాయింట్ డైరెక్టర్ వీరేశ్ ప్రభు నేతృత్వంలో సీబీఐ ఎస్పీ



శుక్రవారం చార్జిషీటు ప్రతులతో నెల్లూరు కోర్టుకు వస్తున్న సిట్ అధికారులు

మురళీ రాంబా, ఏపీ కేడర్ ఐజీలు ఎస్ఎస్ త్రిపాఠి, గోపీనాథ్ జెట్టి, భారత ఆహార భద్రత-ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సీనియర్ అధికారి సత్య కుమార్ పాండాలతో సిట్‌ను ఏర్పాటుచేసింది. మరో 30 మంది పోలీసు అధికారులు, సిబ్బంది సాయంతో 15 నెలల క్రితం తిరుపతిలో ప్రారంభమైన దర్యాప్తు.. 12 రాష్ట్రాలకు విస్తరించింది. అన్ని కోణాల్లో విచారణ చేపట్టింది. అదనపు పోలీసు సూపరింటెండెంట్ స్థాయి అధికారి నేతృత్వంలోని సిట్ బృందం శుక్రవారం నెల్లూరు కోర్టుకు వచ్చి చార్జిషీటు దాఖలు చేసింది.

భోలేబాబా యజమానులదే కీలక పాత్ర

కల్తీ నెయ్యి సరఫరా దందా మొత్తం భోలేబాబా డెయిరీ కేంద్రంగా నడిచిందని.. దాని యజమానులు పొమిల్ జైన్, విపిన్ జైన్‌లే ఈ వ్యవహారంలో కీలక పాత్ర వహించారని సిట్ తెలిపింది. 2019-24 నడుమ టీటీడీకి 60.10 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా అయిందని.. ఆ కాలంలో టీటీడీ ప్రొక్యూర్‌మెంట్, ల్యాబ్ తదితర విభాగాల్లో పనిచేసిన పలువురు అధికారులకు, ఉద్యోగులు.. కల్తీ నెయ్యి అని తెలిసినా కూడా శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి ఆ నెయ్యినే అనుమతించారని పేర్కొన్నట్లు సమాచారం. తద్వారా టీటీడీ ఏకంగా రూ.250 కోట్ల వరకూ (రూ.16 కోట్ల జీఎస్టీతో కలిపి) దేవస్థానం నష్టపోయిందని.. కోట్లాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేందుకు వారు కారకులయ్యారని తెలిపింది. గత ఏడాది ఆగస్టులో వేసిన తొలి చార్జిషీటులో 15 మందిని నిందితులుగా పేర్కొన్న సిట్.. ఇప్పుడు దర్యాప్తు ముగించి తుది చార్జిషీటు దాఖలుచేసింది. ఇందులో అదనంగా 21 మందిపై నేరారోపణ చేసింది. వారిలో 12 మంది టీటీడీ అధికారులు, ఉద్యోగులు, డెయిరీ నిపుణులు ఉన్నారు. ఈ కేసులో మొత్తం నిందితుల సంఖ్య 36 కాగా.. అందులో ఐదు డెయిరీ సంస్థలు ఉన్నాయి. తుది చార్జిషీటులో 21 మంది నిందితులపై చేసిన నేరారోపణలకు సంబంధించి ప్రతి అంశంపైనా కోర్టుకు ఆధారాలు సమర్పించింది.

15 నెలలు.. 12 రాష్ట్రాల్లో సిట్ దర్యాప్తు

సిట్ 15 నెలల పాటు దర్యాప్తు సాగించింది. అందులో భాగంగా ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా తదితర 12 రాష్ట్రాల్లో పర్యటించింది. తమిళనాడు దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ మొదలుకొని ఏపీలోని వైష్ణవి డెయిరీ, ఉత్తర భారతంలో భోలేబాబా డెయిరీ, హర్ష్ ఫ్రెష్ ఫుడ్స్ ప్రీమియర్ ఫుడ్స్, మాల్ గంగా తదితర పలు ప్రైవేటు డెయిరీలను, వాటి ప్లాంట్లను, ల్యాబ్‌లను తనిఖీ చేసింది. ఆయా సంస్థలకు నెయ్యి తయారీకి రసాయన పదార్థాలు, ఇతర సామగ్రి సరఫరా చేసిన సంస్థల్లో సైతం సోదాలు జరిపి వాటి యజమానులు, అధికారులు, ఉద్యోగులను విచారించింది. మధ్యవర్తులను, హవాలా ఏజెంట్లను సైతం ప్రశ్నించింది. భారీగా రికార్డులను, ఫైళ్లను, సాంకేతిక ఆధారాలను సేకరించింది. డెయిరీల యజమానుల నుంచి నెయ్యి ట్యాంకర్ల డ్రైవర్ల వరకూ వందలాది మందిని విచారించి వాంగ్మూలాలు నమోదు చేసింది. 2019-24 మధ్య పనిచేసిన టీటీడీ ఈవోలు, చైర్మన్లు, పాలక మండలి సభ్యులు, మార్కెటింగ్ విభాగం అధికారులు, ఉద్యోగులు, ల్యాబ్ ఉద్యోగులు, పోటు ఉద్యోగులు, కార్మికులను సైతం ప్రశ్నించింది. టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ కడూరు చిన్నప్పన్న అరెస్టుతో కేసు కీలక మలుపు తిరిగింది.

నిందితులు వీరే..

ఏఆర్ డెయిరీ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్(ఏ1), ఏఆర్ డెయిరీ ఎండీ రాజు రాజశేఖరన్(ఏ2), వైష్ణవి డెయిరీ డైరెక్టర్ పొమిల్ జైన్ (ఏ3), వైష్ణవి డెయిరీ డైరెక్టర్ విపిన్ జైన్ (ఏ4) వైష్ణవి డెయిరీ సీఈవో అపూర్వ వినయ్‌కాంత్ చావడా (ఏ5), వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ6), భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ7), వైష్ణవి డెయిరీ ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షబ్బీర్ కలీముల్లా ఖాన్ అలియాస్ సమీర్ (ఏ8), టీటీడీ ఉద్యోగులు ఈ.నాగేంద్ర ప్రసాద్ (ఏ9), కరమల శేఖర్(ఏ10), మెస్సర్స్ హర్ష్ ఫ్రెష్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ11), హరి మోహన్ రాణా(ఏ12), సంజయ్ చౌహాన్(ఏ13), ఆశిష్ రోహిలా (ఏ14), ఆశిష్ అగర్వాల్ (ఏ15), అజయ్ కుమార్ సుగంధ్(ఏ16), మహేశ్ కుమార్ రోహిరా (ఏ17), మచ్చీంద్ర శాంతారామ్ లంకే (ఏ18), మాల్ గంగా మిల్క్ అండ్ ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ19), వైష్ణవి డెయిరీ డైరెక్టర్ రాజేశ్ మన్‌సుఖ్‌లాల్ చావడా(ఏ20), భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు సారికా జైన్ (పొమిల్ జైన్ భార్య-ఏ21), పూనమ్ జైన్ (విపిన్ జైన్ భార్య-ఏ22), బోలేబాబా ల్యాబ్ ఇన్‌చార్జి రవీందర్ శర్మ (ఏ23), చిన్నప్పన్న (వైవీ సుబ్బారెడ్డి పీఏ-ఏ24), టీటీడీ ఉద్యోగులు పల్లి ఈశ్వర్‌రెడ్డి (ఏ25), ముద్దు వెంకట అనిల్ కుమార్ (26), టీటీడీ డిప్యూటీ ఈవో (రిటైర్డ్) పోలేపల్లి వెంకట నటేశ్‌బాబు (ఏ27), టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ రిటైర్డ్ జీఎంలు పేరూరు జగదీశ్వర్‌రెడ్డి (ఏ28), ఆర్‌వీఎస్ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం (ఏ29), ప్రళయకావేరి మురళీకృష్ణ (ఏ30), టీటీడీ గోశాల పూర్వ డైరెక్టర్ డాక్టర్ కె.హరినాధరెడ్డి (ఏ31), టీటీడీ టెక్నికల్ ఇన్‌స్పెక్షన్ కమిటీ మెంబర్ మల్లం మహేందర్ (హైదరాబాద్-ఏ32), టెక్నికల్ కమిటీ సభ్యులు వి.వెంకటసుబ్రమణియన్ (కోయంబత్తూరు-ఏ33), ఎం.విజయభాస్కర్‌రెడ్డి (సికింద్రాబాద్-ఏ34), బత్తుల సురేంద్రనాథ్ (బెంగళూరు-ఏ35), కె.జయరాజారావు (ఏ36).



గణతంత్ర వేడుకలను తిలకించేందుకు వచ్చే ప్రజల కోసం ఏర్పాటు చేసిన గ్యాలరీ

గణతంత్ర వేడుకలకు అసెంబ్లీ, సచివాలయం

ముస్తాబు

▸▸ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నారాయణ

తుళ్లూరు/అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలకు రాజధాని అమరావతిలో ఏర్పాట్లు దాదాపు పూర్తి కావచ్చాయని అధికారులు తెలిపారు. 22 ఎకరాలలో పరేడ్ గ్రౌండ్, వీవీఐపీ, వీఐపీలకు 15 ఎకరాలలో పార్కింగ్, పబ్లిక్ పార్కింగ్‌కు 25 ఎకరాలు సిద్ధం చేశారు. అమరావతి రాజధానికి భూములిచ్చిన రైతులకు ప్రత్యేకంగా వీఐపీ గ్యాలరీ ఏర్పాటు చేస్తున్నారు. వేడుకలకు హాజరవ్వాలని ఆహ్వాన పత్రికలను అధికారులు పంపుతున్నారు. ఆన్‌లైన్‌లో రాజధాని రైతులు ఇప్పటికే వేడుకలకు హాజర్వడానికి పేర్లు నమోదు చేసుకున్నారు. మొత్తం 13 వేల మంది కూర్చునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకలకు హాజరయ్యే వీఐపీలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని మంత్రి పి.నారాయణ ఆదేశించారు. శుక్రవారం ఆయన రిపబ్లిక్ డే వేడుకల ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులు తగిన సూచనలు చేశారు. రాయపూడి రెవెన్యూలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాల నుంచి హైకోర్టుకు వెళ్లే మార్గంలో ఈ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మండలి వద్ద చైర్మన్... అసెంబ్లీ వద్ద స్పీకర్

ఈనెల 26న సోమవారం ఉదయం 8గంటలకు అసెంబ్లీ భవన ప్రాంగణంలోని కౌన్సిల్ హాలు వద్ద శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు, ఉదయం 8.15గంటలకు అసెంబ్లీ భవనం ముందు స్పీకర్ అయ్యన్నపాత్రుడు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఉదయం 7గంటలకు సచివాలయం మొదటి బ్లాక్ వద్ద ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయనున్నారు. ఉదయం 10 గంటలకు నేలపాడులోని రాష్ట్ర హైకోర్టు వద్ద ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.

లేఅవుట్ల క్రమబద్ధీకరణ గడువు పొడిగింపు

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ఏప్రిల్ 23 వరకు మరో మూడు నెలలు పొడిగిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకు కనీస దరఖాస్తు ఫీజు రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుంది. అనధికార లేఅవుట్లు, ప్లాట్లను ప్రణాళికాబద్ధంగా పట్టణాభివృద్ధి పరిధిలోకి తీసుకురావడమే లక్ష్యంగా మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ చర్యలు తీసుకుంది. ఎల్ఆర్ఎస్ కింద 43,759 దరఖాస్తులు, ఎల్ఆర్ఎస్-2025 కింద కేవలం ఆరు నెలల్లోనే 61,947 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొంది.



ఏకాత్మ మానవ దర్శన సభలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి, వేదికపై ఎంపీ పురందేశ్వరి, మంత్రి సత్యకుమార్, బీజేపీ చీఫ్ మాధవ్ తదితరులు

ఆ సిద్ధాంతాలు మనకొద్దు

▸▸ దేశానికి క్యాపిటలిజం, కమ్యూనిజం పనికిరావు

▸▸ ఏకాత్మతా మానవతా వాదంతోనే అభివృద్ధి: కిషన్‌రెడ్డి

▸▸ రక్షణ రంగంలో 4వ స్థానంలో భారత్: సతీశ్‌రెడ్డి

విజయవాడ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): 'ప్రపంచంలో కొన్ని దేశాలు క్యాపిటలిజం వైపు, మరికొన్ని కమ్యూనిజం వైపు నడుస్తూ గొడవపడుతున్నాయి. ప్రపంచానికి తమ సిద్ధాంతాలే అవసరమని వారిద్దరూ పేర్కొంటున్నారు. కమ్యూనిజం, క్యాపిటలిజం భావజాలాలు భారతదేశ ఆలోచనలు, సాంస్కృతిక, సాంప్రదాయాలకు ఏ మాత్రం సంబంధం లేనివి. ఈ విషయం ఏకాత్మతా మానవతా వాదం వచ్చాక తెలుసుకున్నాం' అని మంత్రి జీ కిషన్‌రెడ్డి అన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం జనసంఘ్ 12వ మహాసభ ఏకాత్మ మానవ దర్శన పునఃస్మరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. '1965లో మొదటి సమావేశం జరిగిన ఈ ప్రాంతం పవిత్రమైనది. 60 ఏళ్ల క్రితం జనవరి 23న జరిగిన ఏకాత్మతా మనవతా వాద సిద్ధాంత ఆచరణ కోసం తీసుకువచ్చిన ఈ ప్రాంతంలో ఇప్పుడు అందరూ కలవడం పూర్వజన్మ సుకృతం. 12 ఏళ్లగా ప్రధాని మోదీ ఏకాత్మతా మానవతా వాదాన్ని అనుసరిస్తూ దేశ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నారు. క్యాపిటలిజం, కమ్యూనిజంలకు ప్రత్యామ్నాయంగా భారత ఆలోచనా విధానం, సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా దీన్ దయాళ్ ఏకాత్మతా మానవతావాదం అందించారు' అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రక్షణరంగ నిపుణుడు, ప్రభుత్వ సలహాదారుడు సతీశ్ రెడ్డి మాట్లాడుతూ, 'భారతీయ ఏకాత్మతా మానవ దర్శనం ప్రవచించిన తర్వాత దేశంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మార్పుల కారణంగా వికసిత్ భారత్ లక్ష్యం వైపు పరుగులు పెడుతున్నాం. ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాలవల్ల క్షిపణులు, యుద్ధ ట్యాంకులు తయారుచేసే స్థాయికి చేరాం' అని తెలిపారు. ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, ప్రాంగణానికి శ్రీకృష్ణదేవరాయలు నగర్‌గా పేర్కొనడం వెనుక ఉన్న కారణాన్ని వివరించారు. అంతకుముందు పండిట్ దీనదయాళ్ విగ్రహాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, బీజేపీ జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌జీ, మంత్రి సత్యకుమార్, ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, సీఎం రమేశ్, పాకా వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు విష్ణుకుమారరాజు, వై.సుజనా చౌదరి, ఆదినారాయణరెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండండి!

▸▸ అది యాంటీ సోషల్ మీడియాగా మారిపోయింది

▸▸ అసంబద్ధమైన వార్తల వ్యాప్తి.. నేనూ బాధితుడినే

▸▸ యువతకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య సూచన



విజయవాడ(బెంజ్‌సర్కిల్), జనవరి 23(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా యాంటీ సోషల్ మీడియాగా మారిపోయిందని, ముఖ్యంగా యువత దానికి దూరంగా ఉండాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు సూచించారు. సోషల్ మీడియాలో నిజానిజాలు తెలియకుండా అసంబద్ధమైన వార్తలను వ్యాప్తి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను కూడా సోషల్ మీడియా బాధితుడినేనని పేర్కొన్నారు. ఓ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు సమక్షంలో సమయం ఎంతో లేదని, రాజధాని విషయంలో త్వరితగతిన పూర్తి చేయాలని అన్నానని.. కానీ, సోషల్ మీడియాలో "చంద్రబాబును చెండాడిన వెంకయ్యనాయుడు" అంటూ హెడ్డింగ్ పెట్టారని ఆయన తెలిపారు. భారత పార్లమెంటుపై ఉగ్రదాడి జరిగి 25 ఏళ్లు అయిన సందర్భంగా శుక్రవారం విజయవాడ పటమటలంకలోని కృష్ణవేణి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వెంకయ్య పాల్గొన్నారు. తొలుత దాడిలో వీరమరణం పొందిన వారికి నివాళులర్పించారు. అనంతరం వెంకయ్య మాట్లాడుతూ పార్లమెంట్‌పై దాడిని మన ప్రజాస్వామ్యం మీద దాడిగా అభివర్ణించారు. మాతృభాష తర్వాతే మరే ఇతర భాష అయిన నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వై.లక్ష్మీప్రసాద్, చిగురుపాటి వరప్రసాద్, మాజీ డీజీపీ మన్నం మాలకొండయ్య, సాహిత్యవేత్తలు పాల్గొన్నారు.

శాంతి, క్రమశిక్షణతో ఆత్మశుద్ధి

▸▸ సమాజంలో అసహనం, చెడు తొలగాలి

▸▸ యువత నైతిక విలువలతో మెలగాలి

▸▸ ఇస్లామిక్ మౌలిక విలువలపై ఇస్తేమా బోధనలు



దువాలో పాల్గొన్న మంత్రి ఫరూక్, టీడీపీ నేత అమీర్‌బాబు

కడప, జనవరి 23(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరు శాంతి, సామాజిక బాధ్యత, నైతిక విలువలతో మెలిగినప్పుడే ఆత్మశుద్ధిని పొందగలరని ఢిల్లీకి చెందిన పబ్లిక్ జమాత్ మత గురువు మౌలానా యూసఫ్ సాడ్ కాందలవి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగర శివారులోని కొప్పర్తిలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జాతీయస్థాయి 'పబ్లిక్ జమాత్ దీని ఇస్తేమా' మొదటి రోజు అత్యంత వైభవంగా ప్రారంభమైంది. శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలో తెలంగాణ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన లక్షలాది మంది పాల్గొన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ జుమ్మా ప్రత్యేక నమాజుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మౌలానా యూసఫ్‌సాడ్ కాందలవి నమాజు అనంతరం ప్రసంగించారు. సమాజ శుద్ధికి ఇస్లామిక్ ఇస్తేమాలు ధార్మిక పిలుపుగా అభివర్ణించారు. ఇస్తేమా ప్రసంగాల్లో దివ్య ఖురాన్, దైవ ప్రవక్త, మహమ్మద్ రసూలుల్లా జీవన విధానాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. సమాజంలో అసహనం, చెడు తొలగాలన్నారు. యువత నైతిక విలువలతో మెలగాలని చెప్పారు. పలువురు మత గురువులు కూడా ప్రసంగించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.